₹ 10/-

జనరాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-2 సంచిక - 3 పక్షపత్రిక ఫిబ్రవరి 1-15, 2011

## అరెస్టు సరిపోదు

### కేటాయింపులు రద్దు చేసి 1,76 .000 కోట్లు తిరిగి రాబట్టాలి






2జి. స్పెక్ట్రమ్ కేటాయింపుల రద్దు కోరుతూ
పోస్టుకార్డుల ఉద్యమంలో భాగంగా చీరాల విద్యార్థినులు



లోక్‌సత్తా పార్టీకి లక్ష రూపాయల విరాళాన్ని అందిస్తున్న
నెల్లూరు పార్టీ నాయకులు శ్రీ జె.ఎల్. నారాయణ



జాతీయ ఓటర్స్ డే సందర్భంగా నెల్లూరు పట్టణ ప్రజలతో
అవగాహన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు



కూకట్‌పల్లి రచ్చబండ కార్యక్రమంలో డా॥ జేపీ




రిపబ్లిక్ డే నాడు 'యూత్ ఫర్ బెటర్ ఇండియా' కార్యక్రమంలో
విద్యార్థులతో జేపీ



కూకట్‌పల్లి రచ్చబండ కార్యక్రమంలో పావలా వడ్డీ పథకానికి
ప్రభుత్వ చెక్కును అందిస్తున్న డా॥ జేపీ



రిపబ్లిక్ డే జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో డా॥ జేపీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు



ఒక లక్ష్యసాధన కోసం
ఓపికతో బాధను సహించేవారి కంటే
ఒకేసారి చనిపోవడానికి సిద్ధపడేవాళ్లను
పొందడం చాలా తేలిక

– జూలియస్ సీజర్

## లోపలి పేజీల్లో...


మార్పు తప్పక వస్తుంది – నిరాశ వద్దు.......... 5
వచ్చే తరం లక్ష్యంగా పనిచేయాలి.................. 7
కౌలుదారులకు, రైతులకు కొత్త చట్టం తేవాలి...... 9
2జీ పై కపిల్‌సిబాల్ తీరు గర్హనీయం........... 10
విద్వేషాలు రెచ్చగొట్టడం మా విధానం కాదు.. 11
తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్............ 12
న్యాయ సంస్కరణలు తక్షణావసరం............... 13
ఉత్తేజరిచే నాయకుడు వివేకానందుడు......... 14
పోలవరం ప్రాజెక్టు........................................ 15
రిజర్వేషన్ల చిచ్చుపై లోక్‌సత్తా........................ 23
రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను
పునరుద్ధరించడం మన తక్షణ కర్తవ్యం........... 25
విధానాలు లేని పార్టీలు కకావికలం.................. 27
ఉద్యమకారునికి ఘోర అన్యాయం.................28
ఎకరాకు 10,000 ఇవ్వటం భారమా?....... 29
లోక్‌సత్తా దండు గదిలిందో?...........................31
జిల్లాల సమాచారం.........................................32


# రచ్చబండ స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయం కాదు

**సంపాదకీయం**

స్థానిక ప్రభుత్వాలు, ప్రజలు ఎన్నుకున్న కమిటీలు నిరంతరం చేయాల్సిన పనులను ఆర్నెల్లకోసారి రచ్చబండ, పల్లెబాట, ప్రజాపథం, జన్మభూమి వంటి కార్యక్రమాల పేరుతో ముఖ్యమంత్రులు ఆర్భాటంగా చేపట్టే ఆనవాయితీగా మార్చివేశారు. ముఖ్యమంత్రులు మహారాజుల్లాగా మందీమార్బలంతో హైదరాబాద్ నుంచి జిల్లాలకు వెళ్లి పంపిణీలు చేయటం ప్రజాస్వామ్యానికి, పాలనావ్యవస్థకు తిరోగమన చర్య అవుతుంది.

"ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ఈనెల 24 నుంచి తలపెట్టిన రచ్చబండలో చేసే కార్యక్రమాలన్నీ దాదాపు స్థానిక ప్రభుత్వాల పరిధిలోనివే. ప్రస్తుత సీఎం కూడా గత ప్రభుత్వాల, పాలకుల తరహాలోనే సమస్యల పరిష్కారానికి రచ్చబండ మార్గాన్ని ఎంచుకోవటం పాతదారిలో నడవటమే అవుతుంది తప్ప ప్రయోజనం శూన్యం. సమస్యల పరిష్కారంతో ప్రజల్లో గుర్తింపు పొందేందుకు ముఖ్యమంత్రి మరింత నిర్మాణాత్మకంగా, సాహసోపేతంగా చర్యలు చేపట్టి, పాలనావ్యవస్థను ప్రక్షాళన చేసి, పథకాల అమలును వేగవంతం చేసివుంటే బాగుండేది. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, విధుల్ని బదిలీ చేసి, కార్యక్రమాల అమలును వేగవంతం చేయాల్సింది. అక్కడ అవినీతి జరిగితే చర్యలకు బలమైన అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చు. దీనివల్ల ప్రజల రోజువారీ ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించినవారయ్యేవారు".

ఈ రచ్చబండలో ప్రజలు గళం విప్పి సంక్షేమ కార్యక్రమాలు, ఉపాధి హామీ పథకంలో అవకతవకల్ని, అవినీతిని, వచ్చే ఆదాయాన్ని మింగేస్తున్న మద్యం మహమ్మారి సమస్యను ముఖ్యమంత్రికి తెలియచేయాలి. పాలనావ్యవస్థ కేంద్రీకృతమవటం వల్ల తమకు తాగునీరు, ఆరోగ్యకేంద్రాలు, పాఠశాలలు తదితర సేవల అందుబాటు ఎంత అధ్వాన్నంగా ఉందో తెలియచేయాలి. బెల్టుషాపుల నియంత్రణ కోసం, స్థానిక సమస్యల తక్షణ పరిష్కారం కోసం పైనుంచి రచ్చబండ, ప్రజాపథం వంటి పేర్లతో ముఖ్యమంత్రుల రాకకోసం ఆగకుండా తక్షణ పరిష్కారం కోసం సాధికారత ఇవ్వాలని, స్థానిక సంస్థల ఎన్నికలను త్వరగా నిర్వహించాలని గట్టిగా కోరాలి. ఈ సమావేశాల్లో స్థానిక సాధికారత దిశగా ప్రజల్ని చైతన్యవంతం చేసేందుకు లోక్‌సత్తా కార్యకర్తలు, పౌరసమాజం చొరవ తీసుకోవాలి. ◆

**మంచి అనేది ఎప్పుడు నత్త నడకలా నడుస్తుంది – చెడు అనేదే రెక్కల గుర్రంలా పరుగెడుతుంది**

– మహాత్మాగాంధీ

**లోక్‌సత్తా టైమ్స్** - కొత్త రాజకీయ పక్షపత్రిక

**ఫిబ్రవరి 1-15, 2011 సంపుటి - 2 సంచిక - 3**

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082
ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**

# స్పందన

రైతు సమస్యల గురించి జేపీ గారు అసెంబ్లీలో చేసిన ప్రసంగం యధాతథంగా అందరికి తెలిసేవిధంగా లోక్‌సత్తాటైమ్స్‌లో ప్రచురించినందుకు చాలా సంతోషం. 'మార్చేది మీరే' – విద్యార్థులతో జేపి ఇంటర్వ్యూ బాగుంది. లోక్‌సత్తాటైమ్స్‌లో జేపీ గారు ప్రజలకు మంచి సందేశం ఇవ్వాలని కోరుకుంటూ.....

– హర్షవర్ధన్ , నిజామాబాద్

జేపీ అసెంబ్లీలో ప్రసంగం చాలా బాగుంది. అన్నపూర్ణగారు రాసిన వ్యవసాయం – మహిళల పాత్ర ఆర్టికల్ కూడా బాగుంది. లోక్‌సత్తాటైమ్స్ పత్రికను సకాలంలో మాకు అందేవిధంగా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– సంకీర్తన, హైదరాబాద్

**డబ్బు లేని వారిని చట్టం శాసిస్తుంది**
**చట్టాన్ని ధనవంతులు శాసిస్తారు** – గోల్డ్‌స్మిత్

**మీరూ రాయండి :** లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.



### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజీ | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/ డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు


### మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఇం. నం. 5-10-180/ఎ&ఎ1, బ్యాండ్‌లేన్స్
హిల్‌ఫోర్ట్ రోడ్, హైదరాబాద్ - 500 004
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com

### లోక్‌సత్తాటైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తాటైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**
ఫొటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

# మార్పు తప్పక వస్తుంది-నిరాశ వద్దు: జేపీ

**రాజమండ్రిలోని ఆదిత్యకళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డా॥ జయప్రకాష్‌నారాయణ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా లాల్‌బహదూర్ శాస్త్రి ఆదర్శాలను విద్యార్థులకు వివరించారు. మనదేశ ప్రధానిగా చేసిన ఆయన తన కొడుకు చదువుతున్న కళాశాల ప్రిన్సిపాల్‌కు సైతం ప్రధాని కొడుకు కళాశాలలో చదువుతున్న విషయం తెలియకుండా కొడుకును పెంచిన విషయాన్ని గుర్తు చేస్తూ లాల్ బహదూర్ శాస్త్రి 45 ఏళ్ళ క్రితం జనవరి 11న మరణించారని జేపీ వివరించారు.**

దైనందిన జీవితంలో ప్రతిదీ రాజకీయాలతో ముడిపడి ఉంది. అందుకే యువతరం రాజకీయాల్లోకి రావాలని కోరారు. **విజయ అనే విద్యార్థిని మీలాంటి వారే రాజకీయాల్లో మార్పు తీసుకురాలేకపోతే మేం ఎలా తీసుకురాగలుగుతామని ప్రశ్నించింది.** దీనికి సమాధానమిస్తూ సమాజంలో 73 శాతం యువతరం ఉంది. ఓటర్లలో 50 శాతం యువతదే యువతరం మార్పును మనస్ఫూర్తిగా కోరుకుంటే ఏదైనా సాధించగలరని అన్నారు.

**మెక్‌డోనాల్డ్ కంపెనీ చిన్న చిన్న పల్లెలకు సైతం తన వ్యాపారకార్యకలాపాలను విస్తరిస్తోంది. అలాంటిది మన ప్రభుత్వం కానీ, పథకాలు కానీ గ్రామాల్లో ఉన్న ప్రజలకు ఎందుకు చేరలేకపోతున్నాయని పూజాజైన్ వేసిన ప్రశ్నకు** జేపీ సమాధానమిస్తూ మన ప్రభుత్వ విధానాలు మంచి పని చేయడానికి అనువుగా లేవు చెడ్డపని చేసేవారికే అనువుగా ఉన్నాయి. దీంతో పాలన కానీ పథకాలు కానీ ఒకస్థాయికే పరిమితమవుతున్నాయన్నారు.

**మరి రిజర్వేషన్లు ఎందుకు...**

**రిజర్వేషన్ల విధానంపై శ్వేత అడిగిన ప్రశ్నకు** జేపీ సమాధానమిస్తూ అందాల్సిన వారికి రిజర్వేషన్ల ఫలాలు దక్కకపోవడం కారణంగానే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రిజర్వేషన్ వ్యవస్థ నేటికీ కొనసాగుతోంది. పుట్టుకతో వచ్చే అంతరాలను నిర్మూలించే విధంగా రాజ్యవ్యవస్థ మారితే రిజర్వేషన్ల అవసరం ఉండదు. రిజర్వేషన్ల వల్ల వాటిని పొందుతున్న వారి స్థితిగతులు ఏ మేరకు మారుతున్నాయో పరిశీలించాలి.

- **రాష్ట్రాభివృద్ధి సమైక్యంగా ఉంటే సాధ్యమా? విడిపోతే సాధ్యమా అని పూజాజైన్, శ్రేయ అనే విద్యార్థులు ప్రశ్నించగా** సమైక్యంగా వున్నా, విడిపోయినా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యవస్థ మారనంతకాలం, రాజధానులు మారితే ఒరిగేది ఏమీ వుండదని అది కేవలం రాజకీయ పార్టీలకు రాజకీయపరమైన సర్దుబాట్లు, ప్రయోజనాలకే పరిమితమని సమాధానమిచ్చారు. శ్రీ కృష్ణ కమిటీ రిపోర్టును సమగ్రంగా చదవాలని, ఈ వివాదంలో పూర్తిగా గెలిచిన వారు, ఓడిపోయినవారు ఎవరూ లేరని ఆయన అన్నారు.
- **కిరీటి అనే విద్యార్థిని ఐఏఎస్‌ను వదిలేయడానికి బలమైన కారణమేదైనా ఉందా అని ప్రశ్నించగా** సినిమాల్లోలా అలాంటిదేమీ లేదని కేవలం ప్రజలను చైతన్యవంతుల్ని చేయడానికి పూర్తిసమయం వెచ్చించాలనే ఐఏఎస్‌ను వదులుకున్నానని జేపీ సమాధానమిచ్చారు. రాజకీయాల్లోకి రావాలనేది ఆకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదని ఎమర్జెన్సీ రోజుల్లో సాధ్యమైనంత వరకు దానిని ప్రతిఘటించి ఎమర్జెన్సీ ఎత్తివేసాక, ఆటగాళ్లు మారారు కాని, ఆట మారలేదని గ్రహించాను. ఎన్నో ఆదర్శాలతో ఐఎఎస్ అయ్యాను. మౌలికంగా రాజకీయ వ్యవస్థను మార్చటానికి లోక్‌సత్తా పార్టీ ప్రారంభించానని చెప్పారు.

**లోక్‌సత్తా పార్టీ అధికార పార్టీగా ఎప్పటికి రూపుదిద్దుకుంటుందని విజయ అన్న విద్యార్థిని ప్రశ్నించింది.** చాలా మంది నాతో లోక్‌సత్తా పార్టీ అధికారంలోకి రావాలని చెబుతూ తాము మాత్రం వేరు పార్టీకి ఓట్లు వేశామంటున్నారని జేపీ సమాధానమిచ్చారు.

- **ప్రైవేటైజేషన్ మంచిదా? ప్రభుత్వరంగం మంచిదా? అన్న ప్రశ్నకు** అన్ని ప్రభుత్వమే చేయాలనుకోవడం తప్పని ప్రైవేటైజేషన్ పోటీతత్వాన్ని పెంచుతుందని, తద్వారా తక్కువ ధరలకే విలువైన సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు.
- **కూకట్‌పల్లిలో మీరు ఆశించిన మార్పు తీసుకురాగలిగారా? అన్న ప్రశ్నకు** ప్రజలు ఆశించిన స్థాయిలో కాకపోయినా గతంలో ఎన్నడూ జరగని స్థాయిలో అభివృద్ధి పనులైతే చేశానన్నారు.

**మీరు కలెక్టర్‌గా విధులు నిర్వహించే సమయంలో లంచం ఇవ్వడానికి ఎవరైనా ప్రయత్నించారా? అంటూ సాయికృష్ణ అనే విద్యార్థి ప్రశ్నించాడు.** దీనికి జేపీ స్పందిస్తూ అధికారుల ప్రమాణాలు, పోకడలను బట్టే ఎదుటి వారు కూడా నడుచుకుంటారు. బలవంతంగా అవినీతికి లొంగిపోయామని ఎవరైనా అంటే అది వచ్చి అబద్ధం. నా నైజం తెలిసినవారు నన్ను గౌరవించేవారే కానీ లంచం ఇచ్చే ధైర్యం చేసేవారు కాదు. ఎప్పుడూ, ఎవరూ నాకు లంచం ఇచ్చే ప్రయత్నం చేయలేదు అంటూ సమాధానమిచ్చారు.

**నీలిమ అనే విద్యార్థిని మంచివారు నోరు విప్పాలి అంటున్నారు. అలా నోరువిప్పితే రెండురోజుల్లో ఆ మనిషి కన్పిస్తాడా? అని ప్రశ్నించగా** జేపీ స్పందిస్తూ ముందు మన మనస్సుల్లో నిరాశను, పిరికితనాన్ని వీడాలి యువతగా మీరు ముందు చేయాల్సిన ప్రయత్నం చేయండి. మీ దగ్గరలో ఉన్న పాఠశాలలను, పార్కును అభివృద్ధి చేయండి. ఓటర్లుగా నమోదు చేయించుకోండి. మంచి ఓటరు మేలైన వ్యక్తిని ఎన్నుకుంటారు. ఆ విధంగా మంచి సమాజం ఏర్పడుతుందని వివరించారు.

**అభిజ్ఞ అనే విద్యార్థిని మాట్లాడుతూ ఐఏఎస్ చేయడం ద్వారా సమాజంలో అవినీతిని రూపుమాపాలన్నది నా ఆశయం. అది సాధ్యం కాదని తెలిసిన వారు చెబుతున్నారు. దీనిపై మీరేమంటారు అని ప్రశ్నించిన** ఆమెకు జేపీ సమాధానమిస్తూ వ్యవస్థలో మౌలికమైన మార్పు రాకుండా కేవలం ఐఏఎస్‌ల ద్వారానో, ఐపీఎస్‌ల ద్వారానో సాధ్యం కాదన్నారు. అందరు కలిస్తేనే మార్పు సాధ్యం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

**జ్యోతి అనే విద్యార్థిని మాట్లాడుతూ కార్పొరేట్ వ్యవస్థపోయి అందరికీ విద్య సాధ్యం కావాలంటే ఏం చేయాలన్నారు.** జేపీ సమాధానమిస్తూ ప్రభుత్వ విద్యావిధానం విఫలమైన కారణంగానే కార్పొరేట్ వ్యవస్థ వచ్చిందన్నారు. అమెరికా లాంటి దేశాల్లో ప్రభుత్వమే అత్యుత్తమమైన విద్యను అందిస్తుందని, అక్కడ వాటి నడుమే పోటీ ఉంటుందని పేర్కొన్నారు.

### మార్పు తప్పక వస్తుంది - నిరాశ వద్దు.... యువతకు జేపీ భరోసా

సమాజంలో మార్పు ఖచ్చితంగా వస్తుంది. అది రావడానికి యువత, మేధావులు చేయి చేయి కలపాలి. నిరాశవీడి... కసి, ఆవేశం, ఆలోచన, ప్రణాళికలతో మనం అనుకున్న సమాజాన్ని సాధిద్దాం... అంటూ జేపీ యువతకు పిలుపునిచ్చారు. నిరాశ, పిరికితనం వదిలి సమాజహితం కోసం యువత కొంతైనా దృష్టి సారించాలన్నారు.

వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయింది. అంతా అవినీతి పరులైపోయారు. మనం ఏంచేసినా ఈ సమాజాన్ని బాగుపరచలేం. అంటూ నిరాశ చెందకండి. మంచి పనిచేస్తున్న ఎవరికైనా చేయూతనివ్వండి. ముందు మీ జీవితాలను సక్రమంగా తీర్చిదిద్దుకుంటూ... వ్యవస్థలో మీ వంతు సహకారం అందించండి. కారుచీకట్లో కూడా దీపస్తంభాన్ని చూసే శక్తి నాకుంది... ఖచ్చితంగా ఈ వ్యవస్థలో మార్పు వస్తుంది. మా తరం ఈ మార్పును చూస్తుంది. మీ తరం అనుభవిస్తుంది... అంటూ లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ యువతలో స్ఫూర్తిని నింపారు. 1700 సంవత్సరాల వరకు ప్రపంచంలో మనమే ముందున్నాం. అలాంటిది... తర్వాత క్రమక్రమంగా వ్యవస్థ దెబ్బతిని వెనుకబడిపోయాం. మళ్లీ మనకు పూర్వవైభవం వస్తుంది. మరో పదేళ్లలో మన ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. సమాజంలో మార్పు ఖచ్చితంగా వస్తుంది. అది రావడానికి యువత, మేధావులు చేయి చేయి కలపాలి. నిరాశవీడి... కసి, ఆవేశం, ఆలోచన, ప్రణాళికలతో మనం అనుకున్న సమాజాన్ని సాధిద్దాం... అంటూ జేపీ యువతకు పిలుపునిచ్చారు. నిరాశ, పిరికితనం వదిలి సమాజహితానికి యువత కొంతైనా దృష్టి సారించాలన్నారు.

గాంధీ, పటేల్, అంబేద్కర్ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సమాచార హక్కు చట్టం వంటి వాటిని ఉపయోగించి అవినీతి, అక్రమాలను బయట పెట్టడంలో యువత నడుం బిగించాలని జేపీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

సదస్సులో పాల్గొన్న మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ.. అవినీతి నిర్మూలన గురించి మాట్లాడితే కొంతమంది హేళన చేస్తున్నారని... ఈ విషయంలో ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధుల అక్రమాలపై విచారణను చట్టపరంగా చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. లెఫ్ట్‌నెంట్ జాస్తి మూర్తి మాట్లాడుతూ... మాతృదేశం కీర్తి ప్రతిష్టలు, సంక్షేమం గురించి ఆలోచించిన తర్వాతే ఏదైనా ఆలోచించాలన్నారు. ఆలోచన, నిబద్ధతగల పౌరులు సమాజాన్ని మార్చే శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారన్నారు. యువతను ఉద్దేశించి మాట్లాడుతూ... నగరంలో ఉన్న 50 కళాశాలల విద్యార్థులు 50 వార్డులను తీసుకుని... వచ్చే కార్పొరేషన్ ఎన్నికలలో మంచివారిని ఎన్నుకుని... ఇక్కడ నుంచే ఓ ఉద్యమానికి నాంది పలకాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియలో తనవంతు సహకారం ఉంటుందన్నారు.

### ప్రగతి కోసం పంచసూత్ర ప్రణాళిక

దేశాన్ని మార్చాలంటే మనం యోగులు కానక్కరలేదు. చుట్టూ ఉన్న పరిస్థితులను పట్టించుకుంటే చాలని 'నీతి' అన్నది మన ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణకు మనం చేసుకున్న కట్టుబాటు, అని సందేహాల నుంచే సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని జేపీ చెప్పారు.

## అవినీతి పరుల్ని జైలో పెట్టాలి

అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జేపీ సూచించారు. అవినీతి పరులను జైల్లో పెట్టి ఆస్తులు జప్తు చేయాలన్నారు. అవినీతి పరులకు శిక్షలు పడకపోవడం వల్లే విచ్చలవిడితనం పెరిగిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని దోచుకునేవాళ్లకు కిరీటం పెట్టే సంస్కృతి విడనాడాలన్నారు. ప్రజలు మత్తులో జోగితే ఓట్లు దండుకోవచ్చన్న రాజకీయనేతలకు బుద్ధిచెప్పాలని యువతకు పిలుపునిచ్చారు. అవినీతి నియంత్రణ వ్యవస్థను పటిష్టం చేయడానికి జాతీయ స్థాయిలో స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.

లోక్‌సత్తా నేతలు డాక్టర్ వివిరామారావు, విజయకుమార్, పైడి రామారావు, చంద్రకళ, సూర్యారావు, రవి, శంకర్ యాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ◆

## వచ్చే ఎన్నికలు కాదు ...

# వచ్చే తరం లక్ష్యంగా పనిచేయాలి

*మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఇజిఎ) వల్ల రైతులకు దీర్ఘకాలికంగా ప్రయోజనముంటుందని 'జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్' చైర్మన్ భవర్‌లాల్ జైన్ చెప్పున్నారు. జల్‌గావ్ ప్రాంతంలోని మొత్తం అరటితోటల్ని డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలోకి తీసుకువచ్చి రైతులకు బహుళ ప్రయోజనాలు కల్పించిన భవర్‌లాల్ ప్రస్తుతం సన్నకారు రైతులు, బీడుభూముల రైతులకు అనువైన ఒక 'ఆచరణాత్మక నమూనా' మీద కృషిచేస్తున్నారు. ఆయన కృషి ఫలిస్తే ఈ ఏడాది ద్వితీయార్థం నుంచి దేశ వ్యవసాయరంగంలో మరో కీలకమైన మార్పు రానుంది. ఈ 'రైతు మిత్రుని'తో దిహిందూ బిజినెస్‌లైన్ పత్రిక చేసిన ఇంటర్వ్యూ తెలుగు అనువాదం లోక్‌సత్తా టైమ్స్ పాఠకుల కోసం ...!*

**భారత్‌లో ఆహార ధాన్యాల ధరలు ఆకాశాన్నంటాయి. కానీ దీనివల్ల రైతులకేమైనా ప్రయోజనం కలిగిందను కుంటున్నారా?**

★ అంతగా లేదు. ఉదాహరణకి ఒక కేజీ ఉల్లిపాయలకి మీరు వంద రూపాయలు చెల్లించారనుకోండి .. అందులో మూడోవంతు కూడా రైతుకు చేరదు. **గత యాభై ఏళ్లుగా వ్యవసాయాధారిత నిత్యావసరాల ధరల్ని 'కృత్రిమంగా తగ్గిస్తూ' వచ్చారు. వాటి దుష్పరిణామాల్ని జనం ఈరోజు అనుభవిస్తున్నారు. దురదృష్టవశాత్తూ రైతు ఒక్కడే తన ఉత్పత్తులకు ధరలు నిర్ణయించుకోలేని దుస్థితిలో వున్నాడు. ఆపిల్స్ అయినా ఉల్లిపాయలైనా .. ధరల్ని మార్కెట్టే నిర్ణయిస్తోంది. ఈరకంగా మనం రైతుల్ని నిండా మోసం చేస్తున్నాం. వారికి ఉత్పత్తివ్యయం విపరీతంగా పెరుగుతున్నా మనం మాత్రం ధరల్ని కృత్రిమంగా తగ్గిస్తూవస్తున్నాం.**

**ధరలు ఇంత అధికంగా వున్నా కూడా ఆ లాభం రైతుకు మాత్రం ఎందుకు చేరడంలేదు? అమెరికాలోలాగా మార్కెట్లలో రైతులు సమైక్యంగా తమ ధరల్ని నిర్ణయించుకోవచ్చు కదా!**

★ ఇక్కడో సమస్య వుంది. అమెరికాలో రైతుల సంఖ్య రెండు లక్షలు మాత్రమే. కానీ మనదేశంలో 60 కోట్లమంది. మనకు ఒకటి, రెండు ఎకరాలున్న రైతులు కూడా వున్నారు. కానీ అక్కడ కనీసం 3000 ఎకరాలున్న రైతులు మాత్రమే వుంటారు. ఈరోజు మన రైతుల్ని సమైక్యంగా వుంచడానికి ఏదైనా ప్రయత్నం జరిగిందంటే అది కేవలం ఓట్ల కోసం మాత్రమే అని ఖచ్చితంగా చెప్పొచ్చు. గ్రామీణ భారతం తీవ్ర నిర్లక్ష్యానికి గురికావడానికి పూర్తి కారణం రాజకీయాలే. బీజేపీ అధికారంలో వుంటే కాంగ్రెస్ పార్టీ నుంచి ఆటంకాలు ఏర్పడతాయి. కాంగ్రెస్ అధికారంలో వుంటే బీజేపీ నుంచి ఆటంకాలేర్పడతాయి. ఫలితంగా వ్యవసాయరంగం, రైతుల అభివృద్ధి ఎప్పటికప్పుడు పరిష్కారం లేని ప్రశ్నల్లా మిగులుతున్నాయి. తమ సొంత ప్రయోజనాల కోసం తాము సమైక్యంగా వుండాలనే స్పృహ మన రైతులకు ఎప్పుడొస్తుందో అప్పుడే ఈ పరిస్థితి మారుతుంది తప్ప రాజకీయాలవల్ల ఏ ప్రయోజనమూ వుండదు.

**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్‌జీఏ) గురించి మీరేమనుకుంటున్నారు? కార్మికుల కొరత వుందని రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు కదా!**

★ కొన్ని అవరోధాలున్నప్పటికీ ఇది మంచి ఉద్దేశంతో రూపొందించిన పథకమే. ప్రభుత్వ అవగాహనా రాహిత్యంవల్ల ఇది ఆచరణలో లోపభూయిష్టంగా తయారైంది.

**మరి దీనిని మెరుగుపరిచే మార్గమేమిటి?**

★ ఎంఎన్ఆర్‌జీఏ పథకం కోసం కేటాయించిన 45 వేల కోట్ల రూపాయల డబ్బును ఇంకా బాగా ఉపయోగపెట్టుకోవచ్చు. ప్రతి రైతుకూ పొలంలో ఒక చిన్న బావి ఏర్పాటు చేయగలగాలి. మా ప్రాంతంలో (జల్‌గావ్ – మహారాష్ట్ర) ఇది సాధ్యం కాకపోవచ్చుకానీ .. దేశంలోని మిగతా ప్రాంతాల్లో నీటి నిల్వ కోసం బాగా ఉపయోగపడుతుంది. మనకు ఏడాదికి 700 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం వుంది. అంటే ఒక ఎకరాకు మూడున్నర లక్షల లీటర్ల నీరు అందుబాటులో వున్నట్టు లెక్క. ఫలితంగా కనీసం ఒక లక్ష లీటర్ల నీటిని భద్రపరచుకోవడానికి బావులు ఉపయోగపడతాయి.

**కానీ దీనివల్ల భూమి లేని కార్మికులకు ప్రయోజనం లేదు కదా!**

★ బీడుభూముల రైతులకు నీటి సదుపాయం బావున్నట్లయితే ఆ ప్రాంతాల్లో వ్యవసాయంవల్ల 1:7 నిష్పత్తిలో ఉపాధి లభిస్తుందని చాలా సందర్భాల్లో రుజువైంది కదా! కానీ దురదృష్టమేమిటంటే ఈ పథకంవల్ల వాళ్లు సంపాదించుకున్నదంతా పోగొట్టుకోకునే పరిస్థితిని కూడా ప్రభుత్వమే కల్పిస్తోంది. (మద్యం వగైరాల ద్వారా అని రచయిత అభిప్రాయం).

**బీడు భూముల రైతుల అభ్యున్నతి కోసం మీదగ్గర ఏయే ప్రణాళికలున్నాయి?**

★ ప్రస్తుతానికైతే మేము నీటి సదుపాయం వున్న రైతులవద్దకే వెళ్తున్నాం. నీటిని సమర్థవంతంగా ఎలా ఉపయోగించుకోవాలో వారికి సూచిస్తున్నాం. నీటి వసతి లేని రైతుల దగ్గరికి కూడా వెళ్ళాలనే ఆలోచన వుంది. 60 శాతం మన భూమి వర్షాధారమే; అంటే 80 శాతం రైతులు కేవలం వర్షాలమీదే ఆధారపడుతున్నారు. ఇదికాక ఇంకో పద్ధతిలో ప్రయత్నించాలన్నా కూడా .. విద్యుత్ సదుపాయం లేని పరిస్థితి వుంది. నేనిప్పుడు సౌరవిద్యుత్ మీద ఒక నమూనాను ప్రయత్నిస్తున్నాను. ఒక సోలార్ పంపు ద్వారా కొద్దిపాటి భూమిలో 3000 లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు. మే 15 నాటికి ఎకరానికి కనీసం 5000 లీటర్ల నీరు లేకపోతే పత్తిరైతులు నష్టపోతారు. ప్రస్తుతం రైతులు ఎకరానికి కేవలం రెండు క్వింటాళ్ళ ఉత్పత్తి మాత్రమే పొందగలుగుతున్నారు. వీరికి సమయానికి తగినంత నీరు ఏర్పాటు చేయగలిగితే ఇంతకు ఐదు రెట్ల ఉత్పత్తిని సాధించవచ్చు. ఫలితంగా తర్వాత తర్వాత నీటిని ఖరీదు చేయాల్సిన అవసరం వుండదు.

**దీనిమీద మీరు ప్రభుత్వంతో ఏమైనా మాట్లాడుతున్నారా?**

★ లేదు. రెండేళ్ళుగా నేను ఈ నమూనాను పరీక్షిస్తున్నాను, కొన్ని ఇబ్బందుల్ని అధిగమించే ప్రయత్నంలో వున్నాను.

**ఆర్థికంగా ఇది ఎలా అమలు సాధ్యం?**

★ ఈ నమూనాలో ఒక ఎకరానికి 40 వేల రూపాయలు ఖర్చవుతుంది. ప్రభుత్వం రు.8000 డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఇస్తుంది. సౌరవిద్యుత్ పరికరాలకూ కొంత సబ్సిడీ వుంది. కానీ పెట్టుబడే అసలు సమస్య. డబ్బుల్లేనివాళ్ళకు బ్యాంకులు డబ్బులివ్వవు. బీడుభూముల రైతులు అంటే వాళ్ళ దృష్టిలో అప్పులు ఎగ్గొట్టినవాళ్ళన్నా అయ్యుంటారు; లేదా అప్పు తీసుకోవడానికి అర్హత లేనివారన్నా అయ్యుంటారు. ఏదోవిధంగా ఈ మొత్తాన్ని ఏర్పాటు చేసుకోగలిగేవారికి ఒకటిరెండేళ్ళలోనే అది వెనక్కివస్తుందని నేను ఘంటాపథంగా చెప్పగలను. రెండేళ్ళలోనే రైతు తన రుణం మొత్తాన్నీ తీర్చేయగలుగుతాడు. ఇట్లాంటి పరిస్థితుల్లో ఆశాకిరణంలాగా నాబార్డ్ ఈ నమూనా మీద మంచి ఆసక్తి చూపించింది. వారితో మేము సంప్రదింపులు జరుపుతున్నాం. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోపే ఈ నమూనాను అమలుచేయాలనుకుంటున్నాను. అప్పటికి ఒక పంట పూర్తవుతుంది.

ఇప్పటికిప్పుడు ఇది చిన్న ఆలోచనే కానీ ఇది భారత్‌ను ఆహారధాన్యాల కొరత లేని దేశంగా మార్చగలదని నా విశ్వాసం. కేవలం ఒక్క పత్తిపంటకే కాదు .. ఇది జొన్నలు, తృణధాన్యాలు మొదలైన అన్ని పంటలకూ ఉపయోగపడుతుంది. పైలట్ ప్రాజెక్టు దశలో వుంది కాబట్టి దీని గురించి ఇంతకంటే వివరాలివ్వలేను. బీడుభూముల సాగు కోసం కూడా నేను కొంత పనిచేస్తున్నాను. కానీ అంతిమ నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వమే. నాకున్న వనరులు చాలా తక్కువ. దేశం మొత్తానికీ సరిపోయేంతటివి కావు.

**కేవలం డ్రిప్‌ఇరిగేషన్‌తోనే మీరు ఇన్ని అద్భుతాలు సృష్టించారు కదా; వ్యవసాయంపై ప్రభుత్వ విధానాల గురించి గమనించారా?**

★ లేదు. వాళ్ళకు వ్యవసాయ ప్యానెల్ అధ్యక్షులుగా ముఖేష్ అంబానీ వున్నారు. భవర్‌లాల్ జైన్ అనే ఒక సామాన్యుడి గురించి వాళ్ళకు తెలీదు కదా! తర్వాత టెర్మ్‌కి రతన్‌టాటాను అధ్యక్షుడిని చేసినా నేను ఆశ్చర్యపోను. ఈ సందర్భంలో ఒక విషయం గుర్తుకొస్తోంది. మొదటి పంచవర్ష ప్రణాళిక అమలు సమయంలో పండిట్ నెహ్రూ వినోబాభావేకి 'వెంటనే బయల్దేరండి' అని ఒక టెలిగ్రామ్ పంపారట. భావే వెంటనే 'ఇప్పుడే బయల్దేరుతున్నా ... నడిచి' అని నెహ్రూకు తిరుగు టెలిగ్రామ్ పంపారట. ఆ సందర్భంలో భావే ''ఎవరికోసం పనిచేయాలో నిర్ణయించుకోకుండా పనిచేయడం మొదలుపెడితే ప్రయోజనమేముంటుంది?" అన్నారట. మనకి పనిచేసేవాళ్ళని, పనికొచ్చేవాళ్ళని గుర్తించే సామర్థ్యం వుందంటారా? 102 సంవత్సరాల వయసున్న తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంతోసహా అనేక యూనివర్సిటీలనుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్న ఒక వ్యవసాయ మేధావికి కూడా వ్యవసాయానికి మేలు చేకూర్చే పనుల్లో భాగస్వామ్యం ఇవ్వడం లేదంటే పరిస్థితిని మనం సులభంగా అర్థం చేసుకోవచ్చు.

**ఈ పథకానికి బడ్జెట్ నుంచి మీరు ఎంతమొత్తం కేటాయింపు జరగొచ్చని ఆశిస్తున్నారు?**

★ ఎంఎన్‌ఆర్‌ఇజిఎ ఒక భిన్నమైన తరహాలో రాబోతోంది. తాత్కాలిక ప్రయోజనాలు, రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకుని కాకుండా ... మన దృష్టిని తర్వాత తరాల మీద లగ్నం చేద్దాం. వ్యవసాయ రుణాలు రద్దు చేయడంలాంటి పనులు కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగేలా ప్రభుత్వాలు కృషిచేయాలి.

**అంటే.. మీరు రైతులకు రుణాల రద్దును వ్యతిరేకిస్తున్నారా?**

★ అసలా భావనతోనే నేను ఏకీభవించను. **రైతులకు 20 ఏళ్ళ తర్వాత చెల్లించేలా రుణాలివ్వండి, ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లించమనండి, రైతులకు ఏం కావాలో అవి ఏర్పాటు చేయండి; కానీ ఖచ్చితంగా ఇది మీరు తీర్చాల్సిన రుణమే .. అని రైతులకు స్పష్టంగా చెప్పండి., అప్పుడు ఫలితాలెందుకు రావోచూద్దాం. ఇప్పుడొస్తున్నదానికంటే ఐదారు రెట్ల అదనపు ఆదాయం వస్తుంది. ఎంఎన్‌ఆర్‌ఇజిఎ కోసం కేటాయించిన 45 వేల కోట్ల రూపాయల్నీ వర్షాధారిత రైతులమీద మాత్రమే పెట్టుబడి పెట్టిచూడండి. అప్పుడు మీరు ఎన్నికల్లో గెలవడమే కాదు .. అనూహ్య సంఖ్యలో ఓట్లను కూడా పొందగలుగుతారు.**

**ఈమధ్యకాలంలో బయటపడుతున్న కుంభకోణాలు, విదేశీబ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనం మీద మీ స్పందనేమిటి?**

★ నల్లధనాన్ని వెనక్కి తీసుకువచ్చే విషయంలో ఈ పన్నుల ఒప్పందాల వాదనలేమిటో నాకు అర్థం కావడంలేదు. రాజ్యాంగ చట్టం, కామర్స్ చదువుకున్నవాడిగా అంతర్జాతీయ ఒప్పందాలమీద నాకు అవగాహన వుంది. వాటిలో పన్నుల ప్రస్తావన వుంటుందని తెలుసు; కానీ ఇలాంటి అడ్డంకుల గురించి తెలీదు. కానీ సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ వీటికి అడ్డుకట్ట పడకతప్పదు. వికీలీక్స్ అదే చేసిందికదా! మరి ప్రభుత్వం ఏం చేస్తోంది?

ఇది ప్రజల డబ్బు. మీరు ఆ డబ్బును ఆ ప్రజల నుంచే రహస్యంగా ఉంచుతున్నారు. ఎటువంటి ప్రజాస్వామ్యం గురించి మనం మాట్లాడుతున్నాం? నాదో సూచన... ఆ డబ్బులో 50 శాతాన్ని దేశ ఖజానాకు ఇచ్చేయమనండి. పేర్లు చెప్పనక్కర్లేదు. భారతీయులు చాలా ఉదాత్త స్వభావం కలవారు. వారు తప్పక క్షమిస్తారు. ఒక అబద్ధం తరువాత ఇంకో అబద్ధం ఎందుకు? ◆

అనువాదం : **వీఎమ్ఆర్‌జి. సురేష్**

# కౌలుదారులకు, రైతులకు ఉభయతారకంగా కొత్తచట్టం తేవాలి

## కౌలురైతులకు కించిత్తు ప్రయోజనం చేకూర్చని పాత చట్టాన్ని రద్దుచేయాలి

**1956లో** అమల్లోకి తెచ్చిన ఆంధ్రప్రదేశ్ కౌలుదారీ చట్టం వల్ల ఈరోజు వరకూ దాదాపు కౌలురైతు ఎవరూ అధికారికంగా నమోదవలేదు. చిల్లిగవ్వపాటి ప్రయోజనం లేని ఆ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి. భూయజమానిగా ఉన్న రైతు హక్కుకు నష్టం లేకుండా, సాగుచేసుకునే సమయంలో కౌలుదారునికి అన్ని ప్రభుత్వ రాయితీలు, సదుపాయాలూ వర్తించేలా కొత్త కౌలుదారీ చట్టాన్ని తేవాలి.

“1956లో తెచ్చిన కౌలుదారీ చట్టం రైతుల హక్కులకు భంగం కలిగించేలా ఉండటం వల్ల రైతులు అధికారికంగా కౌలుకిస్తున్నట్టు నమోదుచేయటం లేదు. పొలం కౌలుకు ఇచ్చిన రైతు ఒకవేళ తన పొలాన్ని అమ్మాలంటే కౌలుదారునికే అమ్మాలి. అది కూడా మార్కెట్ విలువతో సంబంధం లేకుండా కేవలం కౌలుకు ఐదు రెట్లు లోపే అమ్మాలి. కౌలుదారు వద్దంటేనే ఇంకొకరికి అమ్మాలి... ఇలాంటి లసుగులవల్లే మెజారిటీ రైతులు కౌలుకిస్తున్నట్టు నమోదు చేయటం లేదు. ఈ చట్టానికి ఆ తర్వాత సవరణ జరిగినా, పాత చట్టం ప్రాతిపదికనే చేయటం వల్ల ఆచరణలో ఏమాత్రం ఫలితాలు రాలేదు. వివాదాల కేసులు వేల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి”.

ఈ 54ఏళ్లలో రిజిస్టర్ చేసుకున్న కౌలురైతులు దాదాపు లేకపోవటంతో రాష్ట్రంలోని లక్షలాదిమంది కౌలుదారులకు బ్యాంకుల నుంచి రుణాలు, విత్తన తదితర రాయితీలు, పంట బీమా వంటి సహాయాలు కౌలుదారులకు అందకుండా పోతున్నాయి. కౌలు చేస్తున్నవారిలో ఎక్కువమంది పేద, అణగారినవర్గాల వారే. సర్కారు నుంచి, బ్యాంకుల నుంచి ఎటువంటి సాయం లేకపోవటం వల్ల వారు హెచ్చువడ్డీలకు ప్రైవేటు వ్యాపారుల నుంచి తెచ్చుకుంటున్నారు. కరవు, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు వీరు పూర్తిగా నష్టపోయి కోలుకోలేని రీతిలో పేదరికం ఊబిలో కూరుకుపోతున్నారు. పంట బాగా పండినా వీరికి కూలీ, చేల గట్ల మీద పచ్చగడ్డితో పశు పోషణ ద్వారా లభించే ఆదాయం తప్ప మిగిలేదేమీ లేదన్నారు. ఇంత దుర్మార్గంగా కౌలురైతుల శ్రమదోపిడీకి కారణమవుతున్న చట్టాన్ని వెంటనే రద్దుచేసి, వారికి కనీస హక్కులు లభించే విధంగా చర్యలు చేపట్టాలి. ఆత్మహత్యలను నివారించాలి.

### కొత్తచట్టం లేకుండా కార్డులు ప్రచార ఆర్భాటమే

ఈ సుదీర్ఘకాల సమస్య మీద అఖిలపక్షానికి ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ తీసుకోవటం హర్షణీయం. అయితే సరైన చట్టం లేకుండా కార్డుల జారీ వంటి పైపై చర్యలు కేవలం ప్రచార ఆర్భాటానికి మాత్రమే పనికొస్తాయి. “స్వయంసహాయక బృందాల కోసం ఇటీవల ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకొచ్చింది. అదే తరహాలో రైతు యాజమాన్య హక్కులకు భంగంకలిగించకుండా, కౌలుదారులకు నిర్ణీత కాలవ్యవధి మేరకు సాగుచేసుకునే హక్కులు ఉండేలా కొత్త చట్టాన్ని తేవాలి. ఆ వ్యవధిలో ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు, రాయితీలు కౌలురైతులకు అందేవిధంగా ఏర్పాటు చేయాలి”. చిన్నకమతాలతో వ్యవసాయం లాభసాటికాని ప్రస్తుత తరుణంలో, చట్టపరమైన భద్రత ఉంటే, పెద్ద కమతాలను సాగుచేసేందుకు కౌలుదారులు ముందుకొచ్చే అవకాశముంది. దీనివల్ల ప్రకృతి వైపరీత్యాలను, పంట ఉత్పత్తి, మార్కెటింగ్‌లో ఎదురయ్యే కొన్ని దీర్ఘకాలిక సమస్యలు సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశముంది. రైతులకు మెరుగైన ఆదాయం కోసం లైసెన్స్-పర్మిట్ వ్యవస్థ నుంచి రైతుల్ని విముక్తి చేసి వారికి మెరుగైన ఆదాయానికి గ్యారంటీ ఇవ్వాలి. ఏటా కనీసం 1కోటి మంది యువతకు వృత్తి నైపుణ్యాలను అందించే ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించాలని, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించాలి.“దేశం ముందున్న సవాళ్ల దృష్ట్యా ఈ లక్ష్యాలన్నిటినీ నూతన సంవత్సరంలోనే చేపట్టాల్సి ఉంది. వాటిని చేపట్టటం పూర్తిగా సాధ్యం. ఎందుకంటే అందుకు కావలసిన వనరులు, సాంకేతిక పరిజ్ఞానం మనకు పుష్కలంగా ఉన్నాయి. వాటిని సాధించాలనే సంకల్పం, కృతనిశ్చయం ప్రభుత్వానికి ఉంటే చాలు”. ◆

# పనికిమాలిన వాదనలు ఆపి గట్టి చర్యలు తీసుకోండి

## 2 జీ పై కపిల్ సిబాల్ తీరును గర్హించిన లోక్‌సత్తా

అవినీతిమయమైన 2-జీ స్పెక్ట్రం లైసెన్సుల్ని రద్దు చేయాలని లోక్‌సత్తా చొరవతో దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యం సుప్రీంకోర్టులో అడ్మిట్ అయి నెం. 423/ 2010గా నమోదైన రిట్ పిటిషన్ జనవరి 10వ తేదీన జస్టిస్ జి.ఎస్ సింఘ్వి, జస్టిస్ ఎ.కె గంగూలీతో కూడిన ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. 2-జీ కుంభకోణంపై సరైన దిశలో చర్యలకు జాతీయస్థాయిలో పేరొందిన పౌరసమాజ సంస్థలు, నిజాయతీకి మారుపేరైన వ్యక్తులతో కలిసి సుప్రీంకోర్టులో లోక్‌సత్తా రిట్ పిటిషన్ దాఖలు చేసేంది.

జయప్రకాష్ నారాయణ్ (లోక్‌సత్తా)తో పాటు ఇతర పిటిషనర్లు: మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు జె.ఎం లింగ్డో, టి.ఎస్. కృష్ణమూర్తి, ఎన్. గోపాలస్వామి, మాజీ విజిలెన్స్ కమిషనర్ పి. శంకర్, గుజరాత్, పంజాబ్ మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జూలియో రెబీరో, సీనియర్ జర్నలిస్ట్ పరంజోయ్ గుహ థాకుర్త, మాజీ గవర్నర్, నావికాదళ మాజీ ప్రధానాధికారి, ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ మాజీ ఛైర్‌పర్సన్ అడ్మిరల్ తహిల్యాని, కామన్‌కాజ్, టెలికాం వాచ్‌డాగ్, సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్ పిటిషనర్లుగా ఉన్నారు.

దేశంలో జరిగిన కనీవినీ ఎరుగని స్థాయి అవినీతిపై ఏ మాత్రం సమర్థనీయం కాని వాదనను సమర్థించేందుకు కపిల్ సిబల్ ప్రయత్నించటం ఖండనీయం. ఖజానాకు వచ్చే నష్టాన్ని హేతుబద్ధంగా నిగ్గుతేల్చి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇచ్చిన నివేదికను బాధ్యత గల కేంద్రమంత్రి ఎలా తోసిపుచ్చగలరు. 2-జీ అక్రమాల వల్ల ఖజానాకు రూ.55,000 కోట్ల నుంచి రూ.1,76,000కోట్ల మేర నష్టం వచ్చిందని మూడు నిర్దిష్ట ప్రమాణాలతో కాగ్ ధృవీకరించింది. లైసెన్సుదారులు ప్రభుత్వానికి చెల్లించిన డబ్బులు- ఎటువంటి విలువ ఆధారిత సేవ లేకుండా కొన్ని వారాల వ్యవధిలోనే తిరిగి ఆ లైసెన్సుల్ని అమ్ముకుని సంపాదించిన మొత్తాలు, 3-జీ స్పెక్ట్రం వేలంపాట ద్వారా వచ్చిన ఆదాయం, లైసెన్సులు పొందలేకపోయిన కొంతమంది దరఖాస్తుదారులు ఆఫర్ చేసిన మొత్తాలు... వీటన్నిటి ఆధారంగా 2-జీ దోపిడీని కాగ్ లెక్కకట్టింది.

తనకు ముందు మంత్రిపదవిలో ఉన్న ఎ. రాజా చేసిన స్పెక్ట్రం కేటాయింపులపై అడ్డగోలు వాదనలు కట్టిపెట్టి సిబల్ ఆ లైసెన్సుల్ని వెంటనే రద్దు చేసి, పారదర్శకమైన, పోటీబిడ్డింగ్ ద్వారా తిరిగి కేటాయించాలి.

అటువంటి అవినీతి ఒప్పందాల్ని రద్దుచేసిన సందర్భం ఉంది. ఇ.ఎ.డి.ఎస్ నుంచి 197 యూరోకాప్టర్లను కొనుగోలు చేసిన ఒప్పందంలో బిడ్డింగ్ ప్రక్రియలో అవకతవకల్ని విజిలెన్స్ కమిషన్ తప్పుపట్టటంతో భారత ప్రభుత్వం రద్దు చేసింది.

### ఏఆర్‌సీ సిఫార్సులపై కేంద్రపాలకుల నిర్లక్ష్యం దారుణం శాస్త్రీజీ పక్కన ఈ మంత్రుల్ని చూసి జాతి తలదించుకోవాలి

ప్రభుత్వంలో వ్యవస్థాగత రుగ్మతలకు చికిత్స చేసి సరైన వ్యవస్థల్ని నిర్మించేందుకు రెండో పరిపాలనాసంఘం (ఏఆర్‌సీ), ఇతరులు ఇచ్చిన నివేదికలను పట్టించుకోకుండా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు గర్హనీయం. " యాదృచ్ఛికంగా ఈరోజు (జనవరి 11) లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతి. అవినీతి నిర్మూలనకు ఆయన తీసుకున్న చర్యల్ని గుర్తు చేసుకుంటే ఈవేళ కేంద్రంలోని మంత్రుల తీరు జాతి సిగ్గుతో తలదించుకునేలా ఉంది. మచ్చలేని నిజాయతీకి, దృఢ సంకల్పానికి మారుపేరుగా ఉన్న ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి అప్పట్లో అవినీతి కట్టడికి సంతానం కమిటీ ఇచ్చిన నివేదికల్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా అమలు చేశారు. ఆ రిపోర్టు రాగానే అప్పటి భారత ప్రభుత్వం కేంద్ర విజిలెన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసి రాష్ట్రాల్లో విజిలెన్స్ కమిషన్లను ఏర్పాటు చేసేందుకు, విజిలెన్స్ విభాగాల్ని బలోపేతం చేసేందుకు, మంత్రులను అవినీతి నిరోధక చట్టం కిందకు తెచ్చేందుకు, అఖిల భారత, కేంద్ర సర్వీసుల ఉద్యోగులకు సంబంధించిన పాలనానిబంధనలను సవరించేందుకు చర్యలు తీసుకుంది.

ఇటీవలి కాలంలో దేశాన్ని కుదిపేస్తూ నాశనం చేస్తున్న వరుస కుంభకోణాల నేపథ్యంలో కావలసింది చౌకబారు న్యాయతర్కవితర్కాలు కాదు. అవినీతి నిర్మూలనకు బలమైన చర్యలు కావాలి.

### సుప్రీంకోర్టులో ఇతర పిటిషనర్లతో కలిసి లోక్‌సత్తా వాదనలు

2-జీ లైసెన్సుల జారీలో అనేక కోణాలో అవకతవకలు, చట్ట ఉల్లంఘనలు జరిగాయని, అవినీతి, ఆశ్రితపక్షపాతం పెద్దఎత్తున జరిగిందని లోక్‌సత్తా, ఇతర పిటిషనర్లు వాదించారు. స్పెక్ట్రం కేటాయింపుల్ని రద్దు చేసి తిరిగి అంతర్జాతీయ వేలంపాటల పద్ధతి ద్వారా కేటాయింపులు జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరారు. తప్పుడు డిక్లరేషన్లు ఇచ్చిన, ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచిన కంపెనీల నుంచి భారీ నష్టపరిహారాల్ని వసూలు చేయాలని కోరారు.

లంచం/అవినీతితో కూడిన లేదా నిబంధనల్ని, పద్ధతుల్ని ఉల్లంఘించి చేసిన లావాదేవీల్ని చాలా న్యాయవ్యవస్థల్లో చట్టవిరుద్ధంగా, అమలు చేయసాధ్యం కానివిగా పరిగణిస్తారని పిటిషనర్లు పేర్కొన్నారు. ◆

# విద్వేషాలను రెచ్చగొట్టటం మా విధానం కాదు

## నాయకత్వమంటే ప్రజల్ని హేతుబద్ధంగా ఆలోచింపచేయటం: లోక్‌సత్తా

తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించాలని సీమాంధ్ర ప్రజలను లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ రెచ్చగొట్టారని కొందరు టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) నాయకులు చేసిన ఆరోపణలను లోక్‌సత్తా తీవ్రంగా ఖండిస్తున్నది.

ప్రాంతం, మతం, కులం, భాష ప్రాతిపదికన ప్రజల మధ్య శత్రుత్వాన్ని, ద్వేషాల్ని లోక్‌సత్తా ఎప్పుడూ రెచ్చగొట్టలేదు, ఎప్పటికీ రెచ్చగొట్టదు. అందుకు భిన్నంగా యావత్ భారతదేశంలోని ప్రజల మధ్య శాంతి, సామరస్యాల కోసం నిలబడి రాజీలేని పోరాటం చేస్తోంది.

తెలంగాణ అంశంపై లోక్‌సత్తా వైఖరిలో ఎటువంటి మార్పు లేదు. "తెలంగాణ ఏర్పాటు సర్వరోగ నివారిణి కాదు, అది ఉపద్రవం కూడా కాదు". అందువల్లే అసూయ, ద్వేషం, భయానికి లోనుకావద్దని, భాషలో, ప్రవర్తనలో హింసకు పాల్పడవద్దని తెలంగాణ, సీమాంధ్రలోని యువతకు పదేపదే విజ్ఞప్తి చేస్తోంది. నాయకత్వం అనేది వాస్తవాల ఆధారంగా ప్రజల్ని హేతుబద్ధంగా, నిష్పాక్షికంగా ఆలోచింపచేయటంలో ఉంటుంది తప్ప ఉద్రేకాల్ని, ద్వేషాన్ని రెచ్చగొట్టటంలో ఉండదు.

సమస్యలు ఎంత జటిలంగా కనిపించినా, భాగస్వామ్య పక్షాలు రాజ్యాంగం పరిధిలో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరిస్తే చర్చల ద్వారా ఖచ్చితంగా పరిష్కారమవుతాయని లోక్‌సత్తా విశ్వసిస్తోంది. క్రియాశీల ప్రజాస్వామ్య రాజకీయంలో చర్చలకు మించి పరిష్కారాలకు ప్రత్యామ్నాయం లేదు.

విస్తృత ప్రజాప్రయోజనాన్ని, దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బహిరంగ చర్చలో, రాజకీయ కార్యకలాపాలలో పరస్పర గౌరవానికి, హుందాతనానికి, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి రాజకీయ పార్టీలు, పౌరసమాజ సంస్థలు వ్యవహరించాలని . "పరస్పర దూషణలను, ద్వేషాల్ని, బెదిరింపులను మనందరం విడిచిపెట్టాల్సుంది. హేతుబద్ధ బహిరంగ చర్చ, సంయమనం, ప్రజాభిప్రాయంలోని వివిధ కోణాల్ని గౌరవించటమే ప్రజాస్వామ్య సారాంశం". ◆

# ఆరోగ్యసేవల వ్యవస్థలో సమూల మార్పులు తెస్తేనే ఫలితం: జేపీ

*హైదరాబాద్‌లో ఆరోగ్య, వైద్యవిద్య మంత్రుల సదస్సులో జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికను ప్రకటించటంపై జేపీ స్పందన....*

జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ) 2005లో చేసిన సిఫార్సులతో ఆరోగ్య సేవల వ్యవస్థలో సమగ్ర, విప్లవాత్మక మార్పులు తీసుకురావాలి.

జాతీయ ఆరోగ్య మిషన్‌ను ప్రారంభించాలని ఎన్ఏసీ అప్పట్లోనే ప్రతిపాదన చేసింది. అయితే జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌ను మాత్రమే తొలుత చేపట్టాలని కేంద్రప్రభుత్వం భావించింది. ఇన్నేళ్ల తర్వాత జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ మీద దృష్టి సారిస్తోంది.

ప్రభుత్వమే ప్రతి ఒక్కరికీ ఉచితంగా ప్రాథమిక, రెండోదశ ఆరోగ్యసేవల్ని అందించాలని డా॥ జేపీ రూపొందించిన జాతీయ ఆరోగ్య మిషన్ 2005లో సిఫార్సు చేసింది. తాను ఎవరి ద్వారా ఆరోగ్యసేవను పొందాలో రోగికి ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని, ప్రైవేటు-ప్రభుత్వ ఆసుపత్రుల మధ్య గట్టి పోటీ ఉండాలని ఆ నివేదిక సూచించింది. ఆసుపత్రులకు చెల్లించే డబ్బు, వైద్యులకు ఇచ్చే ప్రోత్సాహకాలు కూడా వాళ్ల వైద్యం అందించే రోగుల సంఖ్య మీదే ఆధారపడి ఉండాలని పేర్కొంది.

"ఆరోగ్యసేవల రంగంలో పోటీని, ఎంపిక అవకాశాల్ని పెంచకుండా ఏం చేసినా మనం పాత విధానాన్ని కొనసాగిస్తున్నట్టే. ప్రపంచంలోని ప్రధాన ఆర్థికవ్యవస్థల్లో ఆరోగ్యరంగానికి ప్రాధాన్యత ఇవ్వని దేశం భారత్ ఒక్కటే".

ఆరోగ్యరంగానికి మూడు శాతం కేటాయింపులు చేస్తామని యూపీఏ ప్రభుత్వం 2004లో ప్రకటించినప్పటికీ ప్రస్తుతం బడ్జెట్ కేటాయింపులు కేవలం ఒక్కశాతం మాత్రమే ఉన్నాయి.

ప్రభుత్వ రంగంలో అరకొర, నాణ్యతలేని వైద్య సేవల వల్ల ప్రజలు ఖరీదైన కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్తూ దారుణరీతిలో అప్పుల్లో మునిగిపోతున్నారు. అనారోగ్యం వల్ల అప్పుల్లో కూరుకుపోయి అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాలు మద్యాన్ని ఆదాయమార్గం చేసుకుని గ్రామస్థాయి వరకూ యధేచ్ఛగా సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తూ స్వయంగా వారిని పేదరికం ఊబిలోకి నెడుతున్నాయి. వీటన్నిటినీ సమీక్షించి సమగ్ర ఆరోగ్యసేవల వ్యవస్థను రూపొందించకుండా పైపై పూతల డిక్లరేషన్లతో ప్రయోజనముండదు. ◆

# తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్ : జేపీ

పార్టీ ప్రధాన కార్యాలయంలో లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గ కమిటీ రెండు రోజుల సమావేశంలో జేపీ ప్రారంభోన్యాసం....

10-11శాతం వృద్ధిరేటు సాధిస్తామని ఇప్పటిదాకా గొప్పలు చెప్పుకున్న ఆంధ్రప్రదేశ్ వృద్ధి ఈవేళ 3-4శాతానికి పడిపోవటంతో రాష్ట్రం తీవ్ర ఆర్థికసంక్షోభంలోకి జారిపోతోంది. దేశంలోని అన్ని పెద్ద రాష్ట్రాలకన్నా ఆంధ్రప్రదేశ్ వృద్ధిరేటు అట్టడుగున ఉంది.

వరుస ప్రభుత్వాలు గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానాలే ప్రస్తుత సంక్షోభానికి దారితీశాయి. రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లను సంఘటితంగా ఎదుర్కోవటంలో ప్రభుత్వం, పార్టీలు, సమాజం విఫలమవుతుండటం వల్ల పరిస్థితి మరీ క్షీణిస్తోంది. అభివృద్ధి పథంలో శరవేగంగా దూసుకెళ్తూ గుజరాత్ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలను సృష్టిస్తుంటే, ఆంధ్రప్రదేశ్‌లోని యువత భవిష్యత్తు ఉన్నకొద్దీ అంధకారంగా మారుతోంది. గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడి ఇటీవల నిర్వహించిన 'వైబ్రెంట్ గుజరాత్' దాదాపు రూ.20లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. దాదాపు 50లక్షల కొత్త ఉద్యోగాలకు అవకాశం ఏర్పడింది.

ఈ పరిస్థితుల్లో రాష్ట్ర విభజనకు అనుకూలంగా, వ్యతిరేకంగా ఉన్న డిమాండ్లపై కేంద్రప్రభుత్వం వేగంగా నిర్ణయం తీసుకోకపోతే ఆంధ్రప్రదేశ్ ప్రగతి మరింత దెబ్బతింటుంది.

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల వెనకబాటుతనం, వివక్షపై వచ్చిన వాదప్రతివాదాలపై నిపుణులతో కూడిన శ్రీకృష్ణ కమిటీ తన నివేదికను ఇచ్చింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల, దేశ ప్రయోజనాలను పరిరక్షించేలా కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. భాగస్వాములందరూ సామరస్య విధానాన్ని అవలంబించి, నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఇచ్చిపుచ్చుకుంటే ఆ సమస్యకు ఖచ్చితంగా పరిష్కారం సాధ్యం.

కృష్ణా జలాల వివాదంపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పువిషయంలో దానిపై సుప్రీంకోర్టులో సవాలు చేయటం సాధ్యంకాదు. అయితే ముసాయిదా తీర్పుపై ట్రిబ్యునల్ ముందు రాష్ట్రం కొన్ని అభ్యంతరాల్ని లేవనెత్తవచ్చు. తీర్పు అమలులో కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని గ్యారంటీలను కోరవచ్చు. కృష్ణానది మిగులు జలాల విషయంలో తన కేటాయింపునకు ట్రిబ్యునల్ కట్టుబడినా, నీటిని 75శాతం డిపెండబిలిటీతో అంచనావేసి వివిధ రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని కోరాలి. బలమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల కృష్ణా జలాల నియంత్రణ అథారిటీని ఏర్పాటు చేసి దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా కోరాలి. అన్నిటికంటే కీలకంగా, రాష్ట్రంలోని కృష్ణా బేసిన్‌కు ఆంధ్రప్రదేశ్ తన సొంత ఖర్చుతో మళ్లించే గోదావరి నీటిని ఇతర రాష్ట్రాలతో పంచుకోవాల్సిన పన్లేదని రాష్ట్రప్రభుత్వం ట్రిబ్యునల్ నుంచి విస్పష్టమైన హామీని పొందాల్సుంది. కృష్ణా అదనపు జలాల్ని పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాల మధ్య ట్రిబ్యునల్ పంపిణీ చేసిందికాబట్టి, గోదావరి మళ్లింపునకు ఇతర రాష్ట్రాలు అభ్యంతరం పెట్టాల్సిన పన్లేదు. గోదావరి జలాల్ని కృష్ణా బేసిన్‌కు మళ్లించటాన్ని డెల్టాలో రైతులకు జీవన్మరణ సమస్యగా రాష్ట్రప్రభుత్వం గుర్తించాలి. గోదావరి జలాలు, నాగార్జునసాగర్ దిగువన ఉన్న ప్రాజెక్టులు కృష్ణా డెల్టా రైతుల అవసరాల్ని తీరిస్తే, సాగర్ జలాల్ని తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ జిల్లాలు, కోస్తాంధ్రలోని ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల సాగుకు వినియోగించవచ్చు. శ్రీశైలం రిజర్వాయర్‌లోని నీటిని రాయలసీమలో బీడుభూముల సాగుకు ఉపయోగించుకోవచ్చు.

లోక్‌సత్తా చొరవతో జాతీయ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదించేందుకు ప్రస్తుతం భారతదేశంలో జీవించిఉన్న ముగ్గురు అత్యుత్తమ న్యాయకోవిదులు- జస్టిస్ కృష్ణయ్యర్, చీఫ్ జస్టిస్ ఎం.ఎన్. వెంకటాచలయ్య, చీఫ్ జస్టిస్ జె.ఎస్ వర్మ అంగీకరించారు. ఉన్నత న్యాయవ్యవస్థపై అవినీతి ఆరోపణలు ముసురుకుంటున్న నేపథ్యంలో, సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాల్ని, తొలగింపుల్ని కమిషన్ చేపట్టటం అవసరం. రాజకీయ నేతల్లో విశ్వసనీయత, దిశానిర్దేశం కొరవడుతుండటం వల్ల దేశం అరాచకత్వంలోకి జారిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో దేశ ఐక్యతను పరిరక్షించేలా సుప్రీంకోర్టు విశ్వసనీయతను, నైతిక అథారిటీని పెంపొందించటం మన తక్షణ కర్తవ్యం.

**ఎవరికీ నష్టంలేని ఉప్పుడు బియ్యం ఎగుమతులకు చర్యలు తీసుకోలేని దౌర్భాగ్యస్థితిలో ప్రభుత్వాలు**

రైతుల కోసం రాజకీయాలకతీతంగా దీర్ఘకాల పోరాటానికి పార్టీ నేతలు అంకితభావంతో సిద్ధంకావాలి. వర్షాలకు దెబ్బతిన్న ధాన్యాన్ని ఎగుమతుల కోసం ఉప్పుడు బియ్యంగా మార్చాలని లోక్‌సత్తా, ఇతర పార్టీలు ఎంతో గట్టిగా పోరాడినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని ఒప్పించలేకపోయాయి. ఎవరికీ నష్టంలేకుండా లాభం చేకూరే అంశాలలో సైతం చర్యలు చేపట్టని దౌర్భాగ్యస్థితిలో పాలకులు ఉన్నారు. నిబద్ధత, నిలకడైన విధానాలు, మొక్కవోని సాహసం వల్ల లోక్‌సత్తా పార్టీకి ప్రజల్లో ఎంతో విశ్వసనీయత ఉన్నప్పటికీ పార్టీ ఇంకా సంస్థాగత శక్తిగా రూపుదిద్దుకోలేదు. ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీని దిగువస్థాయి నుంచి నిర్మించేందుకు చురుగ్గా చర్యలు చేపట్టాలి. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి రైతులు, యువత, ఆర్థిక ప్రగతి అంశాల చుట్టూ కార్యక్రమాలను చేపట్టాలి. ◆

# న్యాయసంస్కరణలు తక్షణావసరం

*న్యాయసంస్కరణలపై 'ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్' ఆధ్వర్యంలో ముంబయిలో ప్రారంభమైన రెండురోజుల జాతీయ సదస్సులో జనవరి 22న జేపీ ప్రసంగం...*

భారత్ ఐక్యత, సమగ్రతలను పరిరక్షించటానికి దేశ న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, విశ్వసనీయతను, నైతిక సాధికారతను కాపాడటం అత్యంత కీలకం.

దేశ ఐక్యతను కాపాడే చివరి శక్తిగా ఈవేళ సుప్రీంకోర్టు మాత్రమే మిగిలింది. జనం మధ్య చిచ్చు రగిల్చిన, తీవ్రమైన అయోధ్య-బాబ్రీ మసీదు వివాదం, కుల రిజర్వేషన్లపై ఆందోళనలు, రాష్ట్రాల మధ్య- రాష్ట్రంలోపల ప్రాంతీయ అసమానతలు, నీటి పంపకాలు, అత్యంత విలువైన, పరిమితమైన 2-జీ స్పెక్ట్రం వనరుల్ని ఇష్టమొచ్చినట్టు కేటాయించటం వంటి అంశాల పరిష్కార బాధ్యతను చేపట్టటం ద్వారా సుప్రీంకోర్టు చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తిస్తోంది.

మనకు స్వతంత్ర ప్రతిపత్తి గల బలమైన న్యాయవ్యవస్థ లేకుండా ప్రజాస్వామ్యం పనిచేయలేదు. "మనిషికుండే న్యాయంగా వ్యవహరించగల సామర్థ్యం ప్రజాస్వామ్యాన్ని సాధ్యం చేస్తుంది, కానీ అన్యాయం పట్ల మనిషి మొగ్గు చూపుతుండటం ప్రజాస్వామ్యాన్ని తప్పనిసరి చేస్తుంది" అని అమెరికన్ ఆధ్యాత్మికవేత్త రీన్‌హోల్డ్ నీబర్ ప్రజాస్వామ్యంపై చెప్పిన మనం గుర్తు చేసుకోవాలి.

ఏమాత్రం ఆలస్యం చేయకుండా భారత ప్రభుత్వం నాలుగు న్యాయ సంస్కరణలను తీసుకురావాలి.

1. భారత ఉపరాష్ట్రపతి ఛైర్‌పర్సన్‌గా అత్యున్నతస్థాయి జాతీయ జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ప్రతిభ, సామర్థ్యం, మచ్చలేని నిజాయతీ కలిగిన వ్యక్తుల్ని ఉన్నత న్యాయవ్యవస్థలో నియమించటం, తప్పు చేసిన న్యాయమూర్తులను తొలగించటం కమిషన్ పరిధిలోనే ఉంటాయి.
2. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐ.ఏ.ఎస్) తరహాలో ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్ (ఐ.జే.ఎస్)ను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం పోటీతత్వం కలిగిన ప్రతిభావంతులు న్యాయమూర్తుల బెంచ్‌లోకి ప్రవేశించేందుకు విముఖత చూపుతున్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్ ఉంటే సామర్థ్యం గల వారిని ప్రభుత్వం ఆకర్షించగలుగుతుంది. రాజ్యాంగంలో అందుకు ఏర్పాటు ఉంది కాబట్టి ఐ.జే.ఎస్ ఏర్పాటుకు వీలుగా పార్లమెంటు చట్టం చేయాలి.
3. గ్రామన్యాయాలయాల చట్టంలో పేర్కొన్నట్టు కనీసం 5,000 స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయాలి. న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలి. కోర్టు వ్యవహారాల ఖర్చు పెరుగుతుండటం, కోర్టులు అందుబాటులో లేకపోవటం వల్ల లక్షలాది పేద ప్రజలు న్యాయస్థానాలకు దూరమైపోతున్నారు. దౌర్జన్యంతో తక్షణ న్యాయం అందించి డబ్బు గుంజే నేరస్తుల్ని, గూండాల్ని వారు ఆశ్రయిస్తున్నారు. న్యాయవ్యవస్థ వైఫల్యం వల్ల నేరస్తులకు భారీ మార్కెట్ డిమాండ్ ఏర్పడింది. రాజకీయ అండదండలతో నేరస్తులు భూముల సెటిల్‌మెంట్లు వంటి వాటికి పాల్పడుతూ పెద్దఎత్తున డబ్బును సంపాదిస్తున్నారు. ఈరోజు 10లక్షలమంది ప్రజలకు 10మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు. న్యాయమూర్తుల సంఖ్యను నాలుగైదు రెట్లు పెంచాలి.
4. చట్టాల్ని పౌరులకు అనుకూలంగా సంస్కరించాలి. ప్రస్తుతం న్యాయవాదులకు ఎక్కువ సానుకూలంగా ఉన్న క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్ వంటి వాటిని సంస్కరించి పౌరుని పక్షం ఉండేలా మార్చాలి.

ఈ సంస్కరణల కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్న నాకు... వాటి అవసరం, తక్షణావశ్యకత పట్ల ఇప్పుడు దేశవ్యాప్తంగా స్థూల ఏకాభిప్రాయం రావటం ఎంతో సంతోషాన్నిస్తోంది. "సంస్కరణల్ని వ్యవస్థీకృతం చేసేందుకు ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలి". ◆

## ఫిబ్రవరి 1 నుంచి కార్యాచరణ ప్రణాళిక- దశలవారీగా సంస్థాగత ఎన్నికలు

ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రైతు సమస్యల మీద, పట్టణాల్లో పౌరసేవల మీద ప్రజాకార్యక్రమాలకు కార్యాచరణను రాష్ట్ర కార్యదర్శి సమావేశం ఆమోదించింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఎంపిక చేసిన మండలాల్లో సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలి. పార్టీని దిగువస్థాయి నుంచి ప్రజాస్వామీకరించే ప్రక్రియలో భాగంగా గ్రామ, వార్డు స్థాయిలో దశలవారీ ఎన్నికలను నిర్వహించాలి. **రచ్చబండలో నిలదీయండి.** 24నుంచి ప్రారంభమవుతున్న ముఖ్యమంత్రి రచ్చబండ కార్యక్రమంలో రైతులు గట్టిగా నిలదీయాలి. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రైతులకు, కౌలురైతులకు తక్షణం అందించాలని, ఉప్పుడు బియ్యం ఎగుమతులకు అనుమతినివ్వాలని, మిగులు బియ్యం రవాణాపై ఆంక్షల్ని శాశ్వత ప్రాతిపదికన ఎత్తివేయాలని, పంటకు లాభసాటి ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేయాలని లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది. కృష్ణా జలాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన ముసాయిదా తీర్పు నేపథ్యంలో రాష్ట్రప్రయోజనాల పరిరక్షణకు వెంటనే ప్రభుత్వం అఖిలపక్షం ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా కార్యవర్గం తీర్మానించింది. ◆

# ఉదయించే సూర్యుడు, ఉత్తేజపరిచేనాయకుడు – వివేకానందుడు

**డి. వెంకటరావు**

అవును! నాకు ప్రతి ఉదయంలోనూ వివేకానందుని రూపం కనిపిస్తుంది. అతని వెలుగులో ప్రతి వ్యక్తిత్వం వికసిస్తుంది. ఇది నిజం. విశాల భూగోళంలోని ఏభాగమైతే ఆదిత్యునివైపు ప్రణమిల్లి ప్రపంచానికి తన ఉనికిని తెలియజేసుకుంటుందో, స్వామీజీ జీవిత పరమార్థాన్ని శోధించే క్రమంలో ప్రతి మనిషీ తనవ్యక్తిత్వ విలువల్ని పరిమళింప జేసుకోగల్గుతాడు. అమాయక ప్రపంచానికి అతనొక హైందవ సన్యాసి మాత్రమే. కానీ అతడు అనంతమైన ఆధ్యాత్మిక శక్తి. అక్షణం మాతృదేశ ప్రజల శ్రేయస్సు కోరే మహోన్నత వ్యక్తిత్వం కలిగిన నిజమైన మానవతావాది. సన్యాసానికే ఒక క్రొత్త నిర్వచనం పలికిన మహనీయుడు. తమ గురువులు రామకృష్ణులందించిన ఆధ్యాత్మిక శక్తికి శారదామాత ఆశీస్సులు తోడవగా, తన జ్ఞాన జ్యోతితో మూఢత్వపు అంధకారంలో మగ్గిపోతున్న ప్రజలజీవితాల్లో మానవత్వపు వెలుగురేఖల్ని ప్రసరింపజేసారు. నిరంతరం అతని రచనల్తో చేస్తూనే ఉంటారు కూడా.

స్వామీజీ ప్రతి ఆలోచనలోనూ, ప్రసంగంలోనూ 'యువత'కే పెద్దపీట ఎందుకంటే ఏ వ్యవస్థలో మార్పురావాలన్నా క్రొత్త సంస్కృతికి శ్రీకారం జరగాలన్నా అది ఒక్క యువతకే సాధ్యం. అతివిలువైన జాతి సంపద యువత పారేసెలయేరు యువత. పరవళ్ళుతొక్కే వరదనీరు యువత. అవును! సమాజానికి సహజ వనరు యువత. నీటికి ఆనకట్ట కడితే అది ఎన్ని పంటల్ని పండిస్తుందో, యువశక్తికి ఆధ్యాత్మికశక్తిని జోడిస్తే, తమ వివేకంతో ఒక గొప్ప, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి జాతి నిర్మాణానికి కారకులౌతారు. స్వామీజీ దృష్టిలో యువకులంటే, వజ్రంలాంటి దేహం, వికసించిన మేధస్సు, విశాలమైన హృదయం – ఈ మూడూ కలిసిన పరిపూర్ణ వ్యక్తిత్వం కులమత, ప్రాంత విభేదాలు లేకుండా ప్రతి వారిలోని ఉన్నతిని గుర్తించి గౌరవించే గొప్ప సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన మాహోజ్ఞాని మనస్వామిజీ, ఆయన మాటల్లో, మనం సాంకేతిక, శాస్త్రరంగాల్లో ఏ దేశాన్నైనా అనుసరించ వచ్చునుగాక. కానీ వాటిని సక్రమంగా వినియోగించుకొనే సంస్కారాన్ని పెంపొందించే ఆధ్యాత్మిక బోధనలు మాత్రం ప్రపంచంయావత్తూ భారతదేశాన్ని చూసి నేర్చుకోవాలి. ఈ నిజాన్ని పాశ్యాత్యులు కూడా అంగీకరించారు. ఆ మాటల్లోని ఔన్నత్యాన్ని కాపాడవలసిన బాధ్యత మనది. అంతే తప్ప సంస్కృతి పేరుతో సినిమా/ టి.వి. తెరపై కన్పించే ప్రతీదీ గుడ్డిగా అనుకరించడం కాదు.

అదృష్టవశాత్తూ నేడు మన సమాజంలో విద్యావంతులు, మేధావులకు కొరతేలేదు. ఉన్నలోటంతా వారిలో సామాజిక స్పృహ కరువైపోవడమే. దురదృష్టం ఏంటంటే మనలోని చాలా మంది పెద్దలకు/ తల్లిదండ్రులకు కూడా ఈ విషయమై సరైన అవగాహన లేదు. ప్రతివారూ తమపిల్లల్ని ఒక డాక్టరుగానో, ఇంజనీరుగానో చూడాలనే బలమైన కోరికతప్ప వారిలో ఉండాల్సిన అతిముఖ్యమైన వ్యక్తిత్వంపై ఇసుమంతైన ధ్యాసలేదు. స్వామీజీ చెప్పినట్లు బలమే జీవనం – బలహీనతే మరణం (Strength is life weakness is death) నేటి యువత వృత్తిరీత్యా ఉన్నత స్థితికి చేరుకున్నప్పటికీ, వ్యక్తిత్వరీత్యా తమని తాము మరింత బలహీన పరచుకుంటున్నారు. విద్యావంతులైన యువతసైతం, యావత్ జగతిని శాసించగలిగే తమ శక్తి – సామర్థ్యం విస్మరించి, తను వ్యసనాల ద్వారానో, అమాయకత్వం ద్వారానో మరే ఇతర బలహీనతల వల్లో కొందరు స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు బలై పోతున్నారు. నేటికీ గ్రామాల్లో నిరక్ష్యరాస్యత, పట్టణాల్లో లేనిపోని బడాయి (False Prestige) ఈ రెండూ సమాజానికి రాచపుండ్లు (Cancer) మాదిరి తయారై దేశ అభివృద్ధికి గండి కొడుతున్నాయి. వీటిని అధిగమించాల్సిన అవసరం యువతపై ఎంతగా ఉందో వారికి సహకరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై అంతకు మించి ఉంది.

ఒక తరం తరువాత తరానికిచ్చే వారసత్వం ఆస్థి కాదు. ఆరోగ్యకరమైన వ్యవస్థ ఈ విషయం నేడు మనం నిర్లక్ష్యం చేస్తే, ఇప్పుడున్న వ్యవస్థలోని లోపాల్ని సరిదిద్దే మాట అటుంచి, కనీసం ఈ పాటి వ్యవస్థను కూడా రేపటి తరానికి మనం అందించలేమన్నది అక్షర సత్యం. వ్యసనం ఒక బలహీనత. అంతేకానీ అది ఒక అవసరం కాదనే నిజం గుర్తించాలి. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణం చొరవ తీసుకుని అమాయకపు యువతను తప్పుదోవ పట్టిస్తున్న సంఘవిద్రోహశక్తుల్ని, సంస్కృతిని రూపుమాపి చట్టాన్ని మరింత బలోపేతం చేసి పటిష్ఠమైన సమాజాన్ని నెలకొల్పాలి. ఈ జాతికి కావలసింది కేవలం పాలకులు కాదు నాయకులు. దీనికి తమవంతు బాధ్యతగా ప్రసారమాధ్యమాలు (Media) అన్ని ఒక్కతాటిపై నిలిచే ఒక నియంత్రణా వ్యవస్థను నెలకొల్పాలి. ఇప్పటికీ మనం స్పందించకపోతే ఇప్పటి వ్యసనాలలాగే, రేపటి రోజుల్లో నేరాలు కూడా మామూలు విషయంగా మారిపోయే ప్రమాదం ఉంది.

ప్రతి యువకుడు, యువతి తమ తమ ఆత్మను గౌరవించండి. పరమాత్మను దర్శించండి. స్వామీజీ మాటల్లో

" సమస్త శక్తి మీలోనే ఉంది. అసమర్థులమని భావించకండి మీరు ఏమైనా చేయగలరు అన్నింటినీ సాధించగలరు (All power is within you. you can do anything and everything. Believe in that )

లెండి! మేల్కొండి! గమ్యాన్ని చేరుకొనే వరకూ విశ్రమించకండి. (Arise awake stop not till the goal is reached) ◆

## పోలవరం ప్రాజెక్టు

# ప్రజలు, పర్యావరణ రక్షణకు ప్రత్యామ్నాయ ప్రతిపాదన

**పరిచయం**

60 సంవత్సరాల క్రితం ఆనాటి అవసరాలు, ప్రాధాన్యతలు, అభీష్టాలు, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా రూపకల్పన చేసిన పోలవరం సాగునీటి ప్రాజెక్టును ఇవ్వాల్టి పరిస్థితులకు అన్వయించుకోవడం సాధ్యం కాదు. ఆనాటి ప్రధానోద్దేశం ఆహారోత్పత్తి, సంక్షేమం మాత్రమే. కానీ ఈరోజు పర్యావరణం, వాతావరణం, భూమిని కోల్పోతున్న ప్రజల జీవితాలు, నష్టపరిహారం చెల్లింపు మొదలైన అనేక అంశాలు కూడా ప్రాజెక్టు నిర్మాణంలో కీలక భాగస్వామ్యం తీసుకుంటున్నాయి.

ప్రకృతి వనరుల సౌలభ్యతకు సంబంధించి దేశం ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితులను ప్రస్తావించకుండా, చర్చించకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుమీద చేపట్టిన ఏ చర్చా కూడా ఫలవంతం కాబోదు. అభివృద్ధిని ఇంకా వేగంగా సాధించాలన్న ఆశతో పరిగెడుతున్న ప్రస్తుత వినియోగ సంస్కృతే దేశంలో ప్రకృతి వనరుల సమతుల్యత దెబ్బతినడానికి మూలకారణం. దీన్ని పునరుద్ధరించడానికి చేస్తున్న ప్రయత్నాలు వాతావరణాన్ని, పర్యావరణాన్ని మరింత దెబ్బతీస్తూ సామాజికంగా వెనుకబడ్డ తరగతులవారిని మరింత వెనక్కి నెడుతున్నాయి. వీటికితోడు సామాజిక, రాజకీయ తారతమ్యాలూ మరొక అవరోధం.



పోలవరం ప్రాజెక్టు పేరుతో తూర్పుగోదావరి జిల్లా పోలవరం గ్రామంవద్ద గోదావరి నది మీద నిర్మించతలపెట్టిన భారీ రిజర్వాయరు కుడి, ఎడమ కాలువల ద్వారా మొత్తం 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆశిస్తున్నారు. దీంతోపాటు ఎడమకాలువ ద్వారా విశాఖపట్నం, పరిసర ప్రాంతాలకు 25 టిఎంసిల నీటి సరఫరా, కుడి కాలువనుంచి కృష్ణా బ్యారేజీకి 80 టిఎంసిల నీటి తరలింపు జరుగుతుంది.

పోలవరం రిజర్వాయర్ నిర్మాణంవల్ల మొత్తం రెండు లక్షల ఎకరాల భూమి ముంపునకు గురికానుంది; ఇందులో 1.50 లక్షల ఎకరాలు వ్యవసాయభూమి కాగా 0.50 లక్షల ఎకరాలు అటవీభూమి. 300 గ్రామాలు మునిగిపోవడం ద్వారా రెండు లక్షలమంది ప్రజలు నిర్వాసితులవుతారు.

ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పర్యావరణ సంరక్షణ, గిరిజనుల సొంత పాలన, పునరావాసం తదితర కీలకమైన అంశాలపై వున్న చట్టాలు, నిబంధనల్ని ఉల్లంఘిస్తూ ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇంజనీరింగ్, ప్రకృతి, ఆర్థిక, సామాజిక, న్యాయపరమైన అంశాల్లో నిపుణుల సూచనల ఆధారంగా జాతీయస్థాయిలో రూపొందిన ప్రమాణాలను బేఖాతరు చేస్తూ ప్రాజెక్టు నిర్మాణమవుతోంది.

ప్రకృతి పూర్తిగా మనుషుల అవసరాలమేరకు సంతృప్తిపరచలేనప్పటికీ వారి కనీస స్థాయి అవసరాల్ని తీరుస్తుందని మహాత్మాగాంధీ ఎప్పుడో చెప్పారు. ప్రజలు క్రమశిక్షణతో ప్రకృతి సమతుల్యతను కాపాడుకోకుండా, వనరుల్ని ఇష్టానుసారం ఉపయోగించుకుంటే ప్రకృతి తిరగబడి తీరుతుందని హెచ్చరించారు కూడా. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల విభాగంలో పొందుపరిచిన 51-ఎ నిబంధన ... పౌరుల బాధ్యతలు, ప్రాథమిక హక్కుల గురించి పేర్కొంది. సామాజిక నిర్మాణం, ప్రకృతి పరిశుద్ధతను కాపాడడంలో ప్రతి పౌరుడి బాధ్యతా కీలకమైనదేనని స్పష్టం చేసింది. మనం వారసత్వంగా పొందినదానికంటే ఇంకా గొప్ప ప్రపంచాన్ని మన ముందుతరాలకు అందించాల్సిన బాధ్యత మనపై వుందని అందరం గుర్తుంచుకోవాలి.

పర్యావరణాన్ని కాపాడుకుంటూ, ప్రకృతి వనరుల్ని సమర్థవంతంగా వినియోగించుకునే తరహాలో నిర్మాణమవుతున్న పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్టు (ఇందిరాసాగర్ ప్రాజెక్టు) సమాజంలో ఎక్కువశాతంమంది ప్రజల సంక్షేమం కోసం .. అభివృద్ధిలో వెనుకబడిన కొందరు ప్రజలు తమ జీవనోపాధిని త్యాగం చేయాల్సిన అవసరాన్ని కల్పించింది. కానీ ప్రాజెక్టువల్ల సర్వం కోల్పోతున్నవారి పునరావాసం కోసం ప్రభుత్వం ఏర్పరిచిన ఈ విధానం చాలా సాదాసీదాగా, ఒక అభివృద్ధి చెందుతున్న దేశం ఆమోదించకూడనిదిగా వుంది.

నీటిని వినియోగించుకునే అంశంలో రాష్ట్రాలు ప్రజల భూముల్ని ఆక్రమించడం, వారిని బలవంతంగా నిరాశ్రయుల్ని

చేయడం వంటి పనులకు పాల్పడకూడదని జాతీయ నీటివిధానం స్పష్టంగా చెప్తోంది. భవిష్యత్‌లో ఎదురవబోయే ఇబ్బందుల్ని కూడా దృష్టిలో వుంచుకుని ఇటీవలికాలంలో జాతీయ విధానాలు, తాజా పర్యావరణ చట్టాలు .. సంప్రదాయిక పద్ధతుల స్థానే ఆధునిక విధానాల్ని అవలంబించడం, ఒకరి అభివృద్ధి కోసం మరొకరు తమ జీవనోపాధిని త్యాగం చేయాల్సిన అవసరం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడాన్ని తప్పనిసరి చేశాయి.

**పోలవరం ప్రాజెక్టు సమాజంలోని భిన్నవర్గాల ప్రజలమధ్య, ప్రాజెక్టులో భాగస్వాములైన రాష్ట్రాలమధ్య వివాదాలకు, ఆందోళనలకు తెరతీసి ప్రాజెక్టు నిర్మాణాన్ని రద్దుచేయాలనేంత వరకూ వెళ్ళింది.** ◆

## పర్యావరణం, ప్రజల పరిరక్షణ కోసం ప్రత్యామ్నాయ విధానాలు, నిర్దేశకాల రూపకల్పన

సామ్యవాదపంథాలో సమాజాన్ని నిర్మించడం, సమాజంలోని అన్నివర్గాల ప్రజలకీ సమన్యాయం అందించడం, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా దక్కేలా చేయడం, ముఖ్యంగా అణచివేతకు గురైన వర్గాలవారి అభివృద్ధిని కాంక్షిస్తూ మనదేశం ఒక విలువైన రాజ్యాంగాన్ని ఏర్పాటుచేసుకుంది.

జాతీయ నీటివనరుల విధానం అమలులో అనాలోచితంగా ముందుకు వెళ్ళకుండా కొన్ని చట్టాలు చాలా స్పష్టంగా మార్గాల్ని నిర్దేశించాయి. వీటి ప్రకారం ప్రభుత్వాలు ఏ ప్రాజెక్టును చేపట్టదల్చినా అందుకు ముందస్తుగా పలు అంశాల్లో పరిశోధించి, అభివృద్ధి పేరుతో ప్రజల జీవనోపాధికి, పర్యావరణానికి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాల్సివుంది.

### జాతీయ విధానం మరియు చట్టాలు

కేంద్రప్రభుత్వం విస్పష్టంగా నిర్వచించిన తాజా జాతీయ గిరిజన విధానం ఏమని పేర్కొంటోందంటే ...

ఎ) ప్రజాసంక్షేమం, అభివృద్ధి పేరుతో గిరిజనుల (షెడ్యూల్ తెగల) జీవనోపాధిని అడ్డుకోరాదని, 50000 మంది కంటే ఎక్కువమంది గిరిజన ప్రజల్ని నిర్వాసితుల్ని చేసే ఎటువంటి ప్రాజెక్టునైనా చేపట్టరాదని జాతీయ గిరిజన విధానం విస్పష్టంగా నిర్దేశిస్తున్నది.

బి) "పర్యావరణ (పరిరక్షణ) చట్టం, 1986" గిరిజన ప్రజలు, పేదవారి జీవనోపాధి, పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ పరిష్కారాలు, ప్రతిపాదనల కోసం శాస్త్రీయంగా అధ్యయనం జరపడం తప్పనిసరని 1994, 1997, 2004 సంవత్సరాల్లో విడుదల చేసిన నోటిఫికేషన్లలో స్పష్టంగా పేర్కొంది. గతంలో చేసుకున్న ఏరకమైన ఒప్పందాలూ చెల్లవని, ప్రతి ప్రాజెక్టూ ఈ చట్టం నిర్దేశాల ప్రకారం మాత్రమే అమలుకావాలని, ఏ ప్రభుత్వమూ సమాజాల్ని, వారి జీవనోపాధిని నిరోధించజాలదని చట్టం పేర్కొంది.

### పలు నిపుణుల కమిటీల ప్రతిపాదనలు, మార్గదర్శకాలు

1) ప్రొఫెసర్ జయతీఘోష్ ఛైర్‌పర్సన్‌గా ఏర్పాటైన రైతుసంక్షేమ కమిషన్ తన ప్రతిపాదనల్లో "పెద్ద పెద్ద ప్రాజెక్టులు తీసుకుని భారీస్థాయిలో ప్రజల్ని తరలించే బదులు చిన్న చిన్న ప్రాజెక్టుల్ని చేపట్టడం ద్వారా అవే ఫలితాల్ని సాధించవచ్చు" అని పేర్కొంది. ఈ ప్రతిపాదనల్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించింది.

2) నిర్వాసితలను సాధ్యమైనంతగా తగ్గించుకోవడం, తరలింపుల అవసరం లేకుండా లేదా సాధ్యమైనంత తక్కువ ప్రభావం వుండేలా ప్రత్యామ్నాయాల్ని రూపొందించుకోవాలని "రీసెటిల్‌మెంట్ మరియు పునరావాస జాతీయ విధానం 2003" ప్రతిపాదించింది.

3) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన "రీసెటిల్‌మెంట్ మరియు పునరావాస విధానం 2005" చెప్తున్న ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీస్థాయిలో ప్రజల్ని నిర్వాసితుల్ని చేయడాన్ని సాధ్యమైనంతవరకూ తగ్గించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించింది.

4) పర్యావరణానికి సంబంధించి అధికారికంగా తీసుకోవాల్సిన 1994, 1997, 2004 సంవత్సరాల్లో విడుదలైన పర్యావరణ ప్రభావ నిర్ధారణ ప్రకటనలు (ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ ఎసెస్‌మెంట్ నోటిఫికేషన్లు) ఆయా ప్రాజెక్టుల ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎంచుకున్న ప్రతిపాదనను ఎందుకు ఎంచుకోవాల్సివచ్చిందో వివరించాల్సివుందని స్పష్టం చేశాయి.

5) నదీలోయలు, హైడల్ ప్రాజెక్టులకు సంబంధించిన పర్యావరణ ప్రభావ నిర్ధారణ నిర్దేశకాలు కూడా ఇదేరీతిన ప్రతిపాదిస్తూ ...నష్టపోతున్నవారికి కల్పించే ప్రయోజనాలకు సంబంధించిన భిన్న ప్రతిపాదనలు (ప్రత్యామ్నాయాలు) ఇవే తరహా ప్రభావాలున్న ఇతర ప్రాజెక్టులతో సరిపోల్చుకుంటూ పరిశీలించాల్సివుంటుంది. ప్రత్యామ్నాయ అంశాలతోపాటు ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన భిన్న డిజైన్లను కూడా గమనించాల్సివుంటుంది.

6) సమీకృత నీటి వనరుల అభివృద్ధి జాతీయ కమిషన్ ప్రతిపాదనల ప్రకారం ఒక భారీ ప్రాజెక్టుకు అంగీకారం తెలిపేముందు ప్రాథమిక సందేహాలన్నిటికీ జవాబు చెప్పాల్సివుంటుంది. "ప్రకృతితో ఇంత పెద్ద స్థాయిలో జోక్యం చేసుకుంటూ దానికి సమాధానం చెప్పకుండా తప్పించుకోగలరా? ప్రాజెక్టు ఉద్దేశాలు నెరవేర్చడానికి ప్రత్యామ్నాయ మార్గాలు పూర్తిగాకానీ, లేదా కనీసస్థాయిలో కానీ లేనేలేవా?" అని సూటిగా ప్రశ్నించింది.

7) సుప్రీంకోర్టు నియమించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ ప్రతిపాదనల ప్రకారం .. ముంపునకు గురయ్యే భూమి, అడవులు,

నివాసాలు, ప్రజల తరలింపులను సాధ్యమైనంతవరకూ తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాల కోసం తప్పనిసరిగా పరిశోధనలు జరపాల్సిందే. ప్రాజెక్టు అసలు లక్ష్యాల్ని ఏమాత్రం చేరుకున్నా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడమే సముచితం.

కేంద్రప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పై ప్రతిపాదనలు, విధాన నిర్దేశకాలను అంగీకరించాయి కాబట్టి ఇవన్నీ ఖచ్చితంగా అమలు జరిపితీరాల్సిందే. పోలవరం ప్రాజెక్టువల్ల లక్షలాదిమంది ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్టపోతున్నారు; తూర్పు కనుమల వాతావరణం, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. ప్రాజెక్టు పూర్తయితే ఏ పరిస్థితిలోనూ జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేము కాబట్టి ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయ డిజైన్‌ను రూపొందించేందుకు సమగ్ర అధ్యయనం జరిగితీరాల్సిందే.

ఇప్పటికే సమాజంలోని పలువర్గాలు, పొరుగు రాష్ట్రాలు ప్రాజెక్టు ప్రస్తుత డిజైన్ మీద అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్ళాయి. ఈ అంశాల్ని పరిశీలించేందుకు సుప్రీంకోర్టు 'సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ'ని ఏర్పాటు చేసింది. ప్రజలనుంచి పెద్దసంఖ్యలో విజ్ఞప్తుల్ని అందుకున్న అనంతరం ఎంపవర్డ్ కమిటీ ఒక నిర్ధారణకు వచ్చి, ప్రాజెక్టు పరిశీలనను మళ్ళీ ప్రారంభించాలని, ప్రాజెక్టుకు అనుమతినిచ్చేముందు పునరాలోచించాలని ప్రతిపాదించింది.

## సుప్రీంకోర్టు ఎంపవర్డ్ కమిటీ ప్రతిపాదనలు

సుప్రీంకోర్టు నియమించిన ఎంపవర్డ్ కమిటీ పోలవరం ప్రాజెక్టును పరిశీలించి, కింద పేర్కొన్న పలు కారణాలరీత్యా ప్రాజెక్టు నిర్మాణంపై పునరాలోచించుకోవాల్సిందే అని అభిప్రాయపడింది. "ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంత కీలకమైన అవసరం అయినప్పటికీ, రెండు అతి ప్రాధాన్యమైన అంశాలకు సంతృప్తికరమైన సమాధానాల్లేవు".

పోలవరం ప్రాజెక్టువల్ల ముంపునకు గురయ్యే తొమ్మిది మండలాల్లోని 276 గ్రామాలకు చెందిన 44,754 కుటుంబాల్లో అత్యధికశాతంమంది పేదప్రజలే. వీరిలో 6875 కుటుంబాలు షెడ్యూల్ కులాలకు చెందినవికాగా, 21109 కుటుంబాలు షెడ్యూల్ తెగలకు చెందినవి. పోచవరం సమీపంలోని ఎప్పూర్ గ్రామంలో నివసిస్తున్న కొండరెడ్డి ప్రజలు అనేక తరాలుగా జీవనోపాధి కోసం అడవిమీదే ఆధారపడ్డారు. వెదురు, కొన్ని అటవీ ఉత్పత్తుల ఆధారంగా జీవిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం తప్పనిసరైతే తాము కొండమీదికే వెళ్తాం తప్ప అడవిని వదిలిపెట్టబోమని తేల్చిచెప్పారు. అలాగే, పోలవరాన్ని వ్యతిరేకిస్తున్న రావిగూడెం, జీడిగుప్ప, విస్మూరు గ్రామాల ప్రజలు కూడా అడవిప్రాంతంలో నివసించడానికే మొగ్గుచూపుతున్నారు.

మొత్తంగా చూస్తే అక్కడి ప్రజలెవరూ తాము వంశపారంపర్యంగా నివసిస్తున్న ప్రాంతాలనుంచి విడిపడి, తమ సాంస్కృతిక వారసత్వాన్ని పోగొట్టుకుని, కష్టాలపాలయ్యేందుకు ఏమాత్రం సిద్ధంగా లేరని అర్థమవుతోంది.

మరో ముఖ్యమైన అంశం పోలవరం ప్రాంతంలోని సహజ అడవులు, అందులోవున్న 'పాపికొండలు వైల్డ్‌లైఫ్ శాంక్చువరీ'లో ఒక పెద్ద భాగాన్ని కోల్పోవడం గురించి. వృక్ష సంపద, జీవసంపదలకు ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతంగానీ మునిగిపోతే అద్భుతమైన జీవవైవిధ్య పర్యావరణ విధానాన్ని కోల్పోయి మళ్ళీ పూడ్చుకోలేని నష్టాన్ని చవిచూస్తాం. అనేక వన్యమృగాలకు నివాసమైన ఈ ప్రాంతం వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972లోని షెడ్యూల్-1లో పేర్కొన్న ప్రకారం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంగా వుంది. వీటితోపాటు పలు తరహాల జీవుల ఉనికికే ప్రాజెక్టువల్ల తీవ్రభంగం వాటిల్లుతుంది.

ముంపునకు గురయ్యే అడవులు పులులకు ఆవాస కేంద్రాలుగా వున్నాయి. పలు సర్వేల్లో ఇక్కడ పులుల జాడలు కనిపించాయి. దేశంలో పులుల సంఖ్య నానాటికీ తగ్గిపోతున్నదనేది అందరికీ తెలిసిన సత్యమే. పోలవరం ప్రాజెక్టువల్ల పులుల సంఖ్య మరింత తగ్గిపోతుంది. ఈ సహజమైన అడవులు, పర్యావరణవిధానం ఏమాత్రం మార్చడానికి కానీ, కృత్రిమంగా తయారుచేయడానికి కానీ వీలుపడదు. వీటివల్ల కలిగే ప్రయోజనాలు పైకి కనిపించినా, కనిపించకపోయినా వాటిని డబ్బుతో ఏమాత్రం విలువకట్టలేం. ఈ నష్టాన్ని పూడ్చుకోవడం ఏరూపంలోనూ సాధ్యం కాదు. అడవి ప్రస్తుత విలువను లెక్కగట్టి ఏజెన్సీల ద్వారా చెల్లించే నష్టపరిహారాలు కోల్పోయే వాటి అమూల్యతతో పోలిస్తే ఏమాత్రం సరిపోలవు.

**భారీస్థాయిలో సహజమైన అడవుల్ని దెబ్బతీయకుండా, అక్కడి ప్రజల జీవనవిధానాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పునరాలోచించి, డ్యామ్ నిర్మాణానికి ప్రత్యామ్నాయ ప్రాంతం, డిజైన్‌ను ఎంచుకోవాల్సిన అవసరం ఎంతైనావుంది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) ప్రాజెక్టు డిజైన్లను ఆమోదించేముందు ప్రస్తుత ప్రతిపాదనలకు వున్న ప్రత్యామ్నాయాలు, ప్రాజెక్టు సాంకేతిక, ఆర్థిక సానుకూలతలు, డ్యామ్ సురక్షత, ఇతర సాంకేతికాంశాలు, ప్రాజెక్టువల్ల నష్టపోతున్న ఆయకట్టు ప్రాంతాల ఖచ్చితమైన లెక్కల్ని దృష్టిలోవుంచుకుని ఒక నిర్ణయం తీసుకోవాలి.**

## పోలవరం ప్రాజెక్టు నేపథ్యం – సమీక్ష – పరిశీలన

గోదావరి నది తూర్పుకనుమలను దాటుకుని దిగువన డెల్టాలోకి ప్రవేశించి సముద్రంలో కలుస్తుంది. తూర్పుకనుమలు విస్తరించివున్న అన్ని ప్రాంతాలతో పోలిస్తే ఈ డెల్టా సారవంతమైన భూములతో ప్రకృతిపరంగా బాగా అభివృద్ధి చెందిన ప్రాంతమనే చెప్పాలి. పూర్తిగా అడవులతో నిండిన ఈ ప్రాంతంలో గిరిజనులు, పేదరైతులే జీవిస్తున్నారు.

ఇప్పటికే అభివృద్ధి చెందిన డెల్టా ప్రాంతంలో మరింత అభివృద్ధిని సాధించడం, 300 టిఎంసిల నీటిని సద్వినియోగం చేసుకోవడం కోసం 60 సంవత్సరాలకుముందే

తూర్పుకనుమల్లోని పోలవరం గ్రామం సమీపంలో ఒక రిజర్వాయర్‌ను నిర్మించాలని ప్రతిపాదించడం జరిగింది.

గోదావరి పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న గిరిజన ప్రాంతాల్లో పలు అవసరాలకు నీటివినియోగంపై స్వాతంత్ర్యానికి పూర్వమే విస్తృతమైన పరిశోధనలు జరిగాయి. భిన్నప్రాంతాలనుంచి నీటిని మళ్ళించి సముద్రమట్టానికి ఉపరితలంలో వున్న పోలవరం వద్ద కలపాలని, పోలవరం కంటే ముందు గోదావరి ఇంకా ఎత్తులో పారే దుమ్ముగూడెం వద్ద వున్న ఆనకట్ట ద్వారా శబరి, సీలేరు, సోకులేరు, పాములేరు ప్రాంతాలనుండి నీటిని మళ్ళించాలని ఊహాచిత్రం గీశారు. ఈ ప్రాంతాలన్నీ బాగా ఎత్తులో వుండడంవల్ల కావల్సినంత నీటిని తూర్పుకనుమల్లో అందుబాటులోవున్న డెల్టా ప్రాంతానికి తరలించవచ్చనే నిర్ణయానికి వచ్చారు. కానీ ఉభయగోదావరి, విశాఖపట్నం జిల్లాల్లోని తూర్పుకనుమలలో సొరంగాల ద్వారా నీటి మళ్ళింపు కోసం కాలువలు నిర్మించడం ఎలా అన్నదే ప్రధాన సమస్యగా మారింది.

అయితే, దురదృష్టవశాత్తూ ఆనాడు పొడవైన భారీ సొరంగాలు నిర్మించే సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంవల్ల ఆ ప్రతిపాదనలు అక్కడితో ఆగిపోయాయి. అయినప్పటికీ ప్రాజెక్టు నిర్మాణం తప్పనిసరైనపక్షంలో తూర్పుకనుమలకు దిగువన పోలవరం (వి) వద్ద 150 అడుగులకంటే అత్యధిక నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) వద్ద రిజర్వాయరు నిర్మించి, 130 అడుగులకంటే ఎత్తున సరఫరా కాలువలు నిర్మించి పంటపొలాలకు నీరందించవచ్చని ఆనాడు సూచించారు.

### ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే సరిహద్దు రాష్ట్రాలమధ్య 1977 నాటి ఒప్పందం

గోదావరి నదీజలాల్ని వినియోగించుకునే విషయంలో కొన్ని రాష్ట్రాలమధ్య తీవ్రవివాదాలు ఏర్పడిన విషయాన్ని కూడా ఈ సందర్భంలో మనం ప్రస్తావించుకోవాలి. ఈ వివాదాలవల్లనే చాలా ప్రాజెక్టులు గోదావరి నీటిసరఫరా ట్రిబ్యునల్ వద్ద అనుమతికి నోచుకోక ఆగిపోయాయి. ఈ నీటివాటాల వివాదాల్ని పరిష్కరించుకోవడానికి రాజకీయపరమైన మద్దతు అందడంతో 1977-78లో ఒక అవగాహన కుదిరి, గోదావరిపై సముద్రమట్టానికి 150 అడుగుల ఎత్తున పోలవరం ప్రాజెక్టును నిర్మించుకునేందుకు అంగీకరిస్తూ ఆయా రాష్ట్రాలమధ్య ఒక ఒప్పందం కుదిరింది. అయితే, **ప్రాజెక్టువల్ల ప్రభావితమయ్యే రాష్ట్రాలు, ఇతర భాగస్వాములందరితో సంప్రదించి, అందరికీ సమ్మతమయ్యేలా వారితో చర్చలు జరిపిన అనంతరమే పోలవరం డిజైన్‌కు సిడబ్ల్యుసి అనుమతించాలనే ఒక నిబంధనను ఒప్పందంలో ఏర్పాటుచేసుకున్నారు.**

ప్రాజెక్టువల్ల నష్టపోయే ప్రజలు, ప్రభావిత రాష్ట్రాలనుంచి బలమైన వ్యతిరేకత ఎదురుకావడంతో ఈ పథకం

| ప్రాజెక్టు | పరివాహక ప్రాంతం (ఎకరాల్లో) |
|---|---|
| చాగల్నాడు ఎత్తిపోతల | 35,000 |
| తొర్రిగెడ్డ పంపింగ్ పథకం | 23,000 |
| ఏలేరు ఆయకట్టు (ఇప్పటికే వుంది) | 70,000 |
| తాడిపూడి, పుష్కరం ఎత్తిపోతల ఆయకట్టు (186,000 + 206,000) | 392,000 |
| **మొత్తం స్థిరీకరించబడిన ఆయకట్టు** | **520,000** |
| పోలవరం రిజర్వాయరువల్ల కలిగే భూమి నష్టం | 120,000 |
| కాలువల తవ్వకం ద్వారా పోయే భూమి | 35,000 |
| పారిశ్రామికీకరణ, పట్టణీకరణ కోసం | 30,000 |
| | 185,000 |
| **ప్రతిపాదిత పోలవరం ప్రాజెక్టు ఆయకట్టు** | **720,000** |
| **స్థిరీకరించిన ఆయకట్టు** | **520,000** |
| **ప్రాజెక్టు నిర్మాణంవల్ల పోతున్న భూమి** | **185,000** |
| **పోలవరం ప్రాజెక్టు ద్వారా సాగులోకొచ్చే భూమి** | **15,000** |

దశాబ్దాలపాటు నిశ్శబ్దంలో వుండిపోయి, కేంద్రప్రభుత్వం అనుమతుల్ని నిరాకరించడానికి దారితీసింది.

### ప్రాజెక్టు ప్రయోజనాలు - కీలకమైన లోపాలు

భారీస్థాయిలో పర్యావరణానికి ముప్పు కలుగుతున్నప్పటికీ, ప్రాజెక్టువల్ల కలిగే ప్రయోజనాలస్థాయి చాలా తక్కువగా వుండడంవల్ల పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తొలినుంచీ గట్టి నిరసనలే వినిపిస్తున్నాయి. పోలవరం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రభుత్వం చెప్తున్నవన్నీ అబద్ధాలేనని కింద పేర్కొన్న లోపాల్ని గమనిస్తే అర్థమవుతుంది.

### ఎ) ఆయకట్టును ఎక్కువ చేసి చూపుతున్నారు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంవల్ల 7.20 లక్షల ఎకరాలకు సాగునీరందుతుందన్నది ప్రతిపాదన. కానీ ప్రభుత్వం పేర్కొంటున్న ఆయకట్టు లెక్కలు సరైనవి కావు. ఇప్పటికే వున్న, నిర్మాణమవుతున్న సాగునీటి ప్రాజెక్టుల ద్వారా కలిగే ప్రయోజనాల్ని కూడా కలిపి పోలవరం వల్ల ప్రయోజనం కింద ప్రభుత్వం చూపిస్తోంది. ఈ 7,20,000 ఎకరాల్లో ఇప్పటికే ఏలేరు, తొరిగడ్డ ఎత్తిపోతల, చాగల్నాడు ఎత్తిపోతల, నాగార్జునసాగర్ ఎడమకాలువ, కొవ్వాడ, తాడిపూడి ఎత్తిపోతల పథకాల ద్వారా 5,20,000 ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలుగుతూనేవుంది. కేవలం తాడిపూడి, పుష్కరం ఆయకట్టు ద్వారానే 3.92 లక్షల ఎకరాలు తడుస్తున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా మరో 15000 ఎకరాల ఆయకట్టు పెరుగుతుందని అంచనావేయడం జరిగింది. కాగా ప్రాజెక్టువల్ల నష్టపోతున్నది 1,85,000 ఎకరాలు (1,20,000 ఎకరాలు పోలవరం రిజర్వాయర్, 35,000 ఎకరాలు కాలువల తవ్వకం, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ కోసం మరో 30000 ఎకరాలు).

ఎక్కువ ఆయకట్టు, అధిక లెక్కలు చూపిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడానికే పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. అదే ఆయకట్టును అనేక పథకాల్లో చూపిస్తుండడాన్ని కూడా మనం గమనించవచ్చు.

**బి)** సాధారణ వరద పరిస్థితుల్లో 36 లక్షల క్యూసెక్కుల నీటిని తట్టుకునేలా పోలవరం ప్రాజెక్టు డిజైన్‌ను తయారుచేసినప్పటికీ, ఇది 50 లక్షల క్యూసెక్కుల నీటిని తట్టుకుంటుందని చెప్తున్నారు. 36 లక్షల క్యూసెక్కుల వరద వస్తే ఆంధ్రప్రదేశ్‌లోని 276 గ్రామాలు, ఇతర రాష్ట్రాల్లోని 24 గ్రామాలు మునకకు గురవుతాయి. ఇది వెనక్కి తోసుకువచ్చే నీటి ప్రభావం మీద సైద్ధాంతిక అంచనాతో వేసిన లెక్కే కానీ శాస్త్రీయ ఆధారాలతో ఖచ్చితంగా గణించింది కాదు.

కానీ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ 2006 ఆగస్ట్ 7వ తేదీన తీసిన ఉపగ్రహ ఛాయాచిత్రం (25 అక్టోబర్ 2006న తెలుగు దినపత్రిక 'ఈనాడు'లో ప్రచురితమైంది) ప్రకారం ముంపునకు గురయ్యే ప్రాంతం ఇంకా చాలా ఎక్కువని రుజువుచేసింది. ఆరోజుటి వరద కేవలం 28.50 లక్షల క్యూసెక్కులే వుండగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 369 గ్రామాలు మునకకు గురయ్యాయి. మునకకు గురయ్యే ఇది 36 లక్షల క్యూసెక్కులంటూ ప్రభుత్వం వేసిన వరద లెక్కలు తప్పని నిరూపించింది. ఆగస్ట్ 2006 వరదలు .. పోలవరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చెప్తున్న లెక్కలు నిజం కావని నిరూపించింది.

7 ఆగస్ట్ 2006 నాటి వరదల్లో వెల్లడైన వాస్తవాల్ని పరిశీలిస్తే అవి మనకు మర్చిపోలేని పాఠాల్ని చెప్పిందని అర్థం చేసుకోవచ్చు. నిజంగా గరిష్టస్థాయిలో 50 లక్షల క్యూసెక్కుల వరదేకానీ వస్తే 400 గ్రామాలు, 2.50 లక్షలమంది ప్రజల మీద ఆ ప్రభావం పడుతుందని విస్పష్టంగా తెలిసిపోయింది. ఇంతకంటే ఎక్కువ వరద వస్తే డ్యామ్ విచ్ఛిన్నమై ఊహించలేనంత విలయం ఏర్పడుతుంది. ఇదేగనుక జరిగితే డెల్టా జిల్లాల్లోని 50 లక్షలమంది ప్రజలు, వేల కోట్ల రూపాయల ఆస్తుల నష్టం వాటిల్లే పెనుప్రమాదం వుందని సైంటిస్టులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. లక్షలాదిమంది ప్రజలను నిలువునా నష్టపరిచే ఇలాంటి విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కొనే పరిస్థితిలో మన సమాజం లేదు. ఇన్ని విషమ ప్రమాదాలున్నాయి కాబట్టే నిపుణులు తొలినుంచీ ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు.

### సి) మేట పెద్ద సమస్య

ఇసుక మేట పేరుకుపోవడం వల్ల డ్యామ్‌ల జీవితకాలం, వినియోగాన్ని తగ్గించే సమస్యలకు గోదావరి నది పెట్టింది పేరు. రిజర్వాయర్లలోకి భారీ ఎత్తున ఇసుకమేటను చేర్చడంలో గోదావరికి పెద్ద చరిత్రే వుంది. గత యాభైఏళ్ళలో నిజాంసాగర్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులు ఈ ఇసుకమేటలవల్లే 60 శాతం స్టోరేజీ సామర్థ్యాన్ని కోల్పోయాయి. ఇదే సమస్య పోలవరం ప్రాజెక్టును కూడా వెంటాడితీరుతుంది. కనుకనే పోలవరం వల్ల ఫలితం వుండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయానికి సాగునీరు, పారిశ్రామిక అవసరాలు, నివాస ప్రాంతాల కోసం నీటిని అందించేందుకు గోదావరి బేసిన్‌లో నీటిమళ్ళింపు పథకాలు మాత్రమే ఖచ్చితంగా సరిపోతాయని నిపుణులు చెప్తున్నారు.

### డి) పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత ప్రతిపాదనల విపరిణామాలు

- ఆగస్ట్ 7, 2006 నాటి ఉపగ్రహచిత్రం ప్రకారం 400కి పైగా గ్రామాలు మునిగిపోతాయి; వీటిలో అత్యధికభాగం గిరిజనుల ఆవాసప్రాంతాలే.
- రెండు లక్షల ఎకరాల భూమిని శాశ్వతంగా కోల్పోతాం. ఇందులో లక్షన్నర ఎకరాలు పూర్తిగా పంటలు పండుతున్న భూమి.
- రెండులక్షలమందికి పైగా గిరిజనులు (కోయ, కొండరెడ్డి తెగలు) ఆవాసాల్ని కోల్పోతారు. వీళ్ళంతా ఇక్కడినుంచి తరలిపోవడం ద్వారా తరతరాలుగా ఈ కొండలతో మమేకమైపోయిన తమ సంస్కృతిని, గుర్తింపుల్ని పోగొట్టుకోవడానికి ఇష్టపడడంలేదు.
- అటవీభూములు, పాపికొండలు వైల్డ్‌లైఫ్ శాంక్చువరీ మునిగిపోతాయి.
- ఇంతచేసీ ప్రాజెక్టువల్ల సాగునీటి ప్రయోజనం పొందేది కేవలం 15 వేల ఎకరాలే.
- ఇసుకమేటల ఫలితంగా ప్రాజెక్టు జీవితకాలం చాలా తక్కువ.
- ఒకవేళ డ్యామ్‌కానీ విచ్ఛిన్నమైతే జరిగే ఉత్పాతాలను కనీసం ఊహించనైనా ఊహించలేం.
- సరిహద్దు రాష్ట్రాల వివాదాలు, ఎదురవుతున్న న్యాయపరమైన చిక్కులు
- సాంకేతిక, ఆర్థిక అంశాలను పరిశీలిస్తే దీనిమీద పెట్టే పెట్టుబడికి దక్కే ఫలితం చాలాతక్కువ.
- ఈ ప్రాజెక్టు ద్వారా సాగులోకొస్తుందని చెప్తున్న ఆయకట్టు ఇప్పటికే పలు పథకాలద్వారా సాగులో వున్నదే. కాబట్టి ఈ ప్రాజెక్టు నిర్మాణం కేవలం ప్రజాధనం దుర్వినియోగానికేనని తేటతెల్లమవుతోంది.
- ప్రసిద్ధ భద్రాచలం రామాలయంతోపాటు అనేక చారిత్రక నిర్మాణాలు మునకకు గురవుతాయి.

### ఇ) ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయ ప్రతిపాదనల కోసం డిమాండ్

పైన పేర్కొన్న పలు లోపాలు, అనేక ప్రమాదాల్ని దృష్టిలో వుంచుకుని నిపుణులు, ఎన్‌జీవో సంఘాలు, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ప్రాజెక్టు డిజైన్‌ను వ్యతిరేకిస్తూ, తగిన

అనుమతులు లేకుండానే నిర్మాణాలు కొనసాగించడాన్ని తప్పుబట్టారు. పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నవారంతా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తమ స్పష్టమైన డిమాండ్‌ను వినిపించారు. "పర్యావరణం, వాతావరణాల్ని కాపాడటం, నిర్వాసితుల సంఖ్యను బాగా పరిమితస్థాయికి తీసుకురావడం, సహజ వారసత్వాల్ని కాపాడుకోవడం కోసం అనువైన ప్రత్యామ్నాయ డిజైన్ కోసం ఏర్పాటైన ప్రమాణాల్ని ప్రభుత్వం ఖచ్చితంగా పాటించితీరాల్సిందే"నని వారు తేల్చిచెప్పారు.

### 4) డిజైన్‌ను మెరుగుపరిచే ప్రత్యామ్నాయాలు

సాంకేతిక, ఆర్థికాంశాలు, ప్రాజెక్టువల్ల కలిగే ప్రయోజనాల్ని ప్రాతిపదికగా తీసుకుని .. మునకకు గురయ్యే ప్రాంతాల్ని తగ్గించడం, పర్యావరణాన్ని రక్షించడం కోసం ఒక సమగ్రమైన పరిశోధన జరిగింది. పోలవరం చరిత్రను ఒకసారి పరిశీలిస్తే దాని అసలు రూపకర్తలు తొలుతే ఈ ప్రతిపాదనలో వున్న ఇబ్బందుల్ని తెలియజేసినట్లు అర్థం చేసుకోవచ్చు. ఎక్కువ ప్రాంతాల్ని నష్టపోయే అవకాశాలు, భూమ్యాకర్షణశక్తి ద్వారా నీటి సరఫరా (గ్రావిటీ) దృష్టిలో పెట్టుకుని ... తూర్పుకనుమల ద్వారా గోదావరి మీద చిన్నచిన్న మళ్ళింపు కాలువల్ని నిర్మించుకోవడం మంచి ఫలితాలనిస్తుందని అభిప్రాయపడ్డారు. కానీ ఇందుకోసం తూర్పుకనుమల్లో భారీ సొరంగాలు తవ్వాల్సిరావడం, ఆనాటి సాంకేతిక పరిస్థితులు అందుకు అనువుగా లేకపోవడంతో ఈ ప్రతిపాదనకు అక్కడే గండిపడింది.

కానీ ఈనాడు పరిస్థితి మారి, సొరంగాల నిర్మాణం చాలా తేలికగా మారింది. పెద్దపెద్ద పర్వతాలు, సముద్రాలలోనుంచే సొరంగాల్ని తవ్వగల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకివచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కొండప్రాంతాలనుంచి సాధారణ ప్రాంతాలకు నీటిసరఫరా కోసం కొండల్ని ఛేదించి సొరంగాల్ని తవ్విస్తోంది. శ్రీశైలం ఎడమకాలువ (ఎస్ఎల్‌బిసి) సొరంగమైతే 50 కిలోమీటర్ల పొడవులో వుంది. దీనితోపాటు అనేక చిన్న సొరంగాలు, నిర్మాణంలో వున్న మరెన్నో సొరంగాలు రాష్ట్రంలో సొరంగాలు తవ్వేందుకు కావల్సినంత సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వుందని రుజువుచేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొండ ప్రాంతాలనుంచి నీటిని దిగువప్రాంతాలకు సొరంగాల ద్వారా తరలించేందుకు అవసరమైనంత సాంకేతికానుభవాన్ని గడించింది కాబట్టి నీటిమళ్ళింపు పథకాల ద్వారా నీటిని మళ్ళించి, సాధ్యమైనంత ఎక్కువ ప్రాంతాలు ముంపునకు గురికాకుండా కాపాడవచ్చు. అప్పుడు పోలవరం లాంటి భారీ ప్రాజెక్టు నిర్మాణమే అవసరం లేదు. గోదావరి మీద ఇప్పటికేవున్న దుమ్ముగూడెం ఆనకట్టను, ఇప్పటికే స్థిరంగా జలవిద్యుత్ పథకాలు అమలవుతున్న సీలేరు రిజర్వాయర్‌ను ఉపయోగించుకుని ఇంకా అదనపు ప్రయోజనాల్ని పొందవచ్చు.

### కుడి, ఎడమల ద్వారా ప్రత్యామ్నాయ ప్రతిపాదన వివరాలు

**ఎడమవైపు అవసరాలకు తగిన పద్ధతి**

శబరి, గోదావరి బేసిన్‌కి ప్రధానంగా నీరందిస్తున్న సీలేరు ప్రాజెక్టులు కలిపి 200 టీఎంసీల నీటిని గోదావరికి సరఫరా చేస్తున్నాయి. ఉపరిభాగాన, ప్రతిపాదిత పోలవరం ప్రాజెక్టుకు ఎఫ్ఆర్ఎల్‌కు పైన లభ్యమవుతున్న ఈ నీటిని కింద పేర్కొన్న విధంగా పలు ప్రాంతాలనుంచి సేకరించుకోవచ్చు.

ఎ) సీలేరు నది ద్వారా ఏటా కనీసం 9 నెలలపాటు 5000 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి తోడ్పడే జలవిద్యుత్ పథకాలు ఇప్పటికే అనేకం వున్నాయి. ఈ ప్రవాహాన్ని అదుపుచేసి దిగువ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పథకం వద్ద ఒక రిజర్వాయరును నిర్మించి సొరంగాల ద్వారా ఏలేరు నదిలోకి పంపి, ఏలేరు ఆనకట్ట ద్వారా ఎడమభాగాన ప్రధాన కాలువకు అనుసంధానం చేయవచ్చు.

సీలేరునది నుంచి ప్రతిపాదించిన ఈ మళ్ళింపు 600 అడుగుల ఎత్తున వుండడంవల్ల ఆయకట్టు ప్రాంతానికి చేరేలోపు 500 అడుగుల ఎత్తు ధారను ఆశించవచ్చు. దీనివల్ల 500 మెగావాట్ల జల విద్యుదుత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని అంచనా.

బి) సోకులేరు, పాములేరు మొదలైన ఎత్తయిన ప్రాంతాలనుంచి కనీసమొత్తంలో లభించే నీటిని వినియోగించుకునేందుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నిర్మించాలి. గోదావరి నుంచి నీటి లభ్యత తక్కువైన సందర్భాల్లో ఈ నీటిని క్యారీఓవర్ రిజర్వాయర్ ద్వారా వినియోగించుకోవచ్చు.

ఈ ప్రతిపాదనలకు అనుగుణంగా సమగ్రమైన డిజైన్‌ను రూపొందించేందుకు బ్యారేజీలు, రిజర్వాయర్లు, కాలువల నిర్మాణానికి అన్ని అనువైన పరిస్థితులూ వున్నాయి. ఈ ప్రతిపాదిత కాలువలు, రిజర్వాయర్లన్నీ పోలవరానికి మరింత ఎత్తులోనే వుండటంతోపాటు ఎడమ కాలువ అవసరాలు తీర్చడానికి ఉపకరిస్తాయి.

ఎడమభాగాన మొత్తం 100 టీఎంసీల నీటి వినియోగాన్ని కింద పేర్కొన్న ప్రకారం అంచనావేయడం జరిగింది.

1. ఏడాదిలో రుతుపవనాల ప్రభావం వున్న ఆరునెలల్లోనే హైడ్రో ఎలక్ట్రిక్ పథకాల ద్వారా సీలేరు ప్రాజెక్టునుంచి నీటిని నియంత్రిస్తే సీలేరుబేసిన్ నుంచి కనీసం 75 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని ప్రతిపాదిస్తున్నాం.

2. సోకులేరు, పాములేరులతోపాటు మరో 4,5 చిన్న ప్రాంతాలనుంచి 25 టీఎంసీల దాకా నీరు లభ్యమవుతుంది. సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పథకం, సోకులేరు, పాములేరులపైయబ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ద్వారా విడుదలయ్యే నీరు ఎడమకాలువ అవసరాల కోసం సరిపోతాయని అంచనా వేయడం జరిగింది.

**కుడివైపు అవసరాలకు తగిన పద్ధతి**

గోదావరి మీద ఇప్పటికే వున్న దుమ్ముగూడెం ప్రాజెక్టును

ఆధునీకరించడం ద్వారా 165 అడుగులపైమేరకు నీటిని భద్రపరచగలుగుతాం. ఈ ప్రాజెక్టు బాగా ఎత్తులో .. ప్రతిపాదిత పోలవరం కంటే కూడా ఎత్తులో వుంది.

దుమ్ముగూడెం ఆనకట్టవద్ద 35 వేల క్యూసెక్కుల నిరంతరాయ నీటి ప్రవాహం వుంటుంది. 600 టిఎంసీల నీటితో 75శాతం మేరకు దీనిమీద ఆధారపడేందుకు అవకాశం వుంది. ఈ ప్రాంతంలో నీటికి అసలు కొరతే లేదు. ఈ ఆనకట్ట ద్వారా 180 టిఎంసీల నీటిని మళ్ళించే అవకాశం వుంది. ఇందులో 80 టిఎంసిలు కృష్ణా బ్యారేజ్‌కు మళ్ళింపబడతాయి.

దుమ్ముగూడెం ఆనకట్టకు కుడివైపునుంచి గోదావరి, కృష్ణానదులు అనుసంధానమయ్యే ప్రదేశం దాటి కిన్నెరసాని దాకా గోదావరికి సమాంతరంగా ఒక పెద్ద కాలువ నిర్మించాలి. కృష్ణా-గోదావరిలను విభజించే కొండల పొడవున ఒక సొరంగాన్ని నిర్మించడం ద్వారా ప్రతిపాదిత కుడికాలువ ఆయకట్టుకు, కృష్ణా బ్యారేజ్‌కి నీటిని సరఫరా చేయవచ్చు.

**ప్రయోజనాలు**

1. పోలవరం కుడికాలువ ద్వారా సాధించదలచుకున్న ప్రయోజనాలన్నీ దుమ్ముగూడెం ఆనకట్ట ద్వారా చాలా సులభంగా సాధించగలుగుతాం. దుమ్ముగూడెం పోలవరం కంటే ఎత్తున వుంది కాబట్టి ఇది ఆచరణసాధ్యం.
2. కృష్ణాలోయలోని అనేక ప్రాంతాలు .. ప్రత్యేకించి నాగార్జునసాగర్ కాలువ చివరి ప్రాంతాలకు కూడా ప్రయోజనం కలుగుతుంది. కృష్ణా-గోదావరిలను విభజించే కొండల వద్ద 80 టిఎంసీల నీటి స్టోరేజీ తర్వాత ఈ కాలువ కృష్ణా లోయలోకి ప్రవేశిస్తుంది కాబట్టి ప్రతిపాదిత కుడివైపు ఆయకట్టు, కృష్ణా బ్యారేజ్‌కి నీటిని సరఫరా చేయగలుగుతాం.
3. గోదావరిమీద కుడివైపున ఇప్పటికే అందుబాటులో వున్న రిజర్వాయర్లకు ఈ కాలువ మరింత వరప్రదాయిని అవుతుంది. ప్రజావాస ప్రాంతాల్లో నీటి వినియోగ పద్ధతుల్ని మరింత ఆధునీకరించడం ద్వారా మరికొంత నీటిని వినియోగించుకోవడానికీ వీలవుతుంది.
4. ఈ కాలువ ఖమ్మం, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాలలోని చాలా ప్రాంతాలకు కూడా నీటిని అందించగలుగుతుంది.
5. ఈ కాలువ గోదావరికి సమాంతరంగా వెళ్తుంది కాబట్టి దీనిని వరదనీటి బ్యాంకుగా కూడా రూపొందించుకోవచ్చు; ఒక రహదారిని కూడా నిర్మించుకోవచ్చు.

**ప్రత్యామ్నాయ ప్రతిపాదనల ముఖ్యాంశాలు:**

1) దిగువ సీలేరు జలవిద్యుత్ కేంద్రం వద్ద సీలేరు నుంచి నీటిని మళ్ళించి సొరంగం ద్వారా ఏలేరు నదిలోకి పంపిస్తే ఎడమవైపున్న ప్రాంతాల ప్రజల సాగునీరు, మంచినీటి అవసరాలన్నీ తీరతాయి. ఈ ప్రవాహాన్ని ఉపయోగించుకుని విద్యుత్ ఉత్పాదన చేయగలగడం మరో ప్రయోజనం.

2) దుమ్ముగూడెం ఆనకట్టపై గోదావరికి సమాంతరంగా ఒక కాలువను తవ్వి, కృష్ణా-గోదావరి పరివాహక ప్రాంతాలను విభజించే కొండలమధ్యలో సొరంగాన్ని నిర్మిస్తే కుడివైపు ప్రాంతాల ప్రజల అవసరాలు తీరడంతోపాటు, కృష్ణాబ్యారేజీకి నీటిని సులభంగా తరలించవచ్చు.

3) సోకులేరు, పాములేరు వంటి కొండల ఉపరితలాలపై బ్యాలెన్సింగ్ (స్టోరేజీ) రిజర్వాయర్లను నిర్మిస్తే అవి డెల్టా మరియు ఇతర ప్రాంతాలలో కొరత సమయాల్లో ఉపయోగపడతాయి.

**ప్రత్యామ్నాయ విధానం సాధ్యాసాధ్యాలు**

సొరంగాలు తవ్వేందుకు మార్కెట్లో అనేక తరహాల టన్నెల్ బోరింగ్ యంత్రాలు లభిస్తున్నాయి కాబట్టి సొరంగాల తవ్వకం సులభమేనని భావించాలి. శ్రీశైలం ఎడమకాలువ కోసం సొరంగాల తవ్వకంతోపాటు పలుచోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఈ యంత్రాలను వినియోగిస్తోంది కాబట్టి ఈ సాంకేతిక సామర్థ్యాన్ని సులభంగా ఉపయోగించుకోవడం అసాధ్యం కాదు.

గోదావరి మీద బ్యారేజీలు, పలు చిన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం వల్ల ఏడాది పొడవునా నీటిని భద్రపరచుకోగలుగుతాం. అంతేకాదు; దీనివల్ల మొత్తం డెల్టా ప్రాంతంలో భూగర్భజలాల సామర్థ్యం మరింత పెరిగి, గోదావరి, కృష్ణా డెల్టాలోని ఆయకట్ల స్థిరీకరణ జరుగుతుంది.

**ముగింపు**

1. ప్రత్యామ్నాయ ప్రతిపాదనల ప్రకారం .. గోదావరి మీద బ్యారేజీలు, పలు చిన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం వల్ల ఎలాంటి సామాజిక వివాదాలూ తలెత్తవు; ఏ ఒక్క వర్గానికీ ఎటువంటి నష్టమూ వాటిల్లదు. పైగా అందరికీ ప్రయోజనకరం. దీనివల్ల అదనంగా గ్రామాల మునక, ప్రజల నిర్వాసత వుండదు. అంతేకాదు, పోలవరం ప్రాజెక్టు ద్వారా ఊహిస్తున్న 300 టిఎంసీల నీటిని కూడా వినియోగించుకోగలం.

2. సీలేరు నదినుంచి మళ్ళింపు ద్వారా ఆయకట్టు ప్రాంతానికి చేరేముందే 500 అడుగుల నీటి ప్రవాహం పొందగలం. దీంతోపాటు 500 మెగావాట్ల విద్యుదుత్పత్తి కూడా సాధ్యమవుతుంది.

3. ఈ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి పొందే అనుమతులకు మాత్రమే లోబడివుండడంవల్ల అంతర్రాష్ట్ర వివాదాలకు ఆస్కారమే వుండదు. ఫలితంగా అనవసరమైన కాలయాపన, ఖర్చులు వుండవు. అన్ని నిర్ణయాలూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిధుల్లోనే పూర్తవుతాయి.

4. ఇప్పటికే సొరంగాల తవ్వకం కోసం అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మాత్రమే ఉపయోగించుకుంటాం.

5. ప్రత్యామ్నాయ డిజైన్‌తో నిర్మాణాన్ని ఐదేళ్ళలోపే పూర్తిచేయవచ్చు. చిన్నచిన్న బ్యారేజీలు, రిజర్వాయర్ల ద్వారా ప్రయోజనం కలిగేందుకు మరికొంత సమయం పడుతుంది.

6. ఈ పద్ధతి వాతావరణం, పర్యావరణాన్ని రక్షించడమే కాక అడవులు, వన్యమృగాలు, ప్రజలను సంరక్షిస్తుంది.

7. పోలవరం కోసం ప్రతిపాదించిన 16,000 కోట్ల రూపాయల అంచనా వ్యయం కంటే అతితక్కువ ఖర్చుతో ఈ ప్రాజెక్టు పూర్తవుతుంది.

8. అన్నిటికంటే ముఖ్యంగా ఈ పథకం 1.5 లక్షల ఎకరాల వ్యవసాయభూమిని, 400 గ్రామాల్ని, జనసదుపాయాలు, సాంస్కృతిక వారసత్వ సంపదలు, ఆలయాలు, పాపికొండలు వన్యమృగ సంరక్షణ కేంద్రాన్ని శాశ్వతంగా ముంపు బారినుంచి కాపాడుతుంది. ఇంకా, 3 లక్షలమంది వెనుకబడిన గిరిజనుల్ని నిర్వాసితులు కాకుండా కాపాడుతుంది. మరీ ముఖ్యంగా వాతావరణం, పర్యావరణం, అడవులు, గిరిజనుల జీవనోపాధిని కోల్పోయే ప్రమాదమే లేదు. గిరిజనులకు కలిగే నష్టాన్ని ఏవిధంగానూ అంచనా వేయలేము, కానీ దాని అనుభూతి వారికి మాత్రమే తెలుస్తుంది.

9. మరో ముఖ్యమైన అంశం ... పోలవరం ప్రాజెక్టుకుపై సుమారు 4,000 కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా, ఈ ఖర్చుతో కాలువల తవ్వకంతో సొరంగాలద్వారా కొత్తగా ప్రతిపాదించిన నీటి మళ్ళింపు పథకాలకు వినియోగించుకోవచ్చు.

## పర్యావరణ విధ్వంసాన్ని నిర్మూలిద్దాం

## సైలెంట్‌వ్యాలీ, హెరాన్ రిజర్వాయర్లను స్ఫూర్తిగా తీసుకుందాం

ఒక పెద్ద విపత్తును నిరోధించడం కోసం చేసే ప్రయత్నం ఎప్పటికీ ఆలస్యం కాబోదు. ఇప్పటికే కొంత డబ్బు వెచ్చింపు జరిగిపోయినప్పటికీ, మానవనష్టం, పర్యావరణ నష్టాల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుంటే ఇకముందు జరగబోయే నష్టాన్ని పూర్తిగా నివారించగలుగుతాం. ప్రభుత్వ విధానాలు, చర్యలు పౌరసమాజం విజ్ఞతతో చేసిన సూచనలను, పర్యావరణ పరిరక్షణ సంబంధిత అంశాలను విస్మరించలేదు.

## సైలెంట్ వ్యాలీ ప్రాజెక్టును సజీవ ఉదాహరణగా తీసుకోవాలి

1970వ దశకంలో కేరళలోని సైలెంట్‌వ్యాలీ నిర్మాణంపై జరిగిన చర్చ తక్కువ స్థాయి ప్రయోజనాల కోసం పర్యావరణం, జాతీయ సంస్కృతులను పణంగా పెట్టడం గురించి విస్తృతంగా చర్చించింది. ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా సమాజం అభిప్రాయాలు, నిపుణులు, పర్యావరణ రక్షణ సంస్థలు కలిసి ... కేరళలో నిర్మించతలపెట్టిన సైలెంట్‌వ్యాలీ భారీ ప్రాజెక్టును 'రెయిన్ ఫారెస్ట్ బయోస్ఫియర్ రిజర్వ్'గా మార్చేశాయి. తప్పుడు డిజైన్లతో మెగా ప్రాజెక్టులను రూపొందిస్తే ఆర్థికంగా నష్టదాయకమే కాక, మన మూర్ఖత్వానికి అవి ప్రాతిపదికలుగా నిలుస్తాయి.

**హెరాన్ రిజర్వాయర్ ప్రాజెక్టు** కూడా ఇలా రూపొందించిన ప్రాజెక్టే. ఇది కూడా పర్యావరణానికి సంబంధించిన అంశాల్ని ఏమాత్రం పరిశీలించకుండానే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల అధికారులనుంచి నిర్మాణామోదం పొందింది. 25 గ్రామాల్లోని మొత్తం 3503 హెక్టార్ల భూమిని ముంపునకు గురిచేసే ఈ రిజర్వాయర్ నిర్మాణాన్ని స్థానికులు తీవ్రంగా ప్రతిఘటించారు. వీరి గొంతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని, ప్రధానమంత్రిని కూడా ప్రభావితం చేసింది. దీంతో సాంకేతిక నిపుణులు, అటవీశాస్త్రం, వనరుల వినియోగం, జీవశాస్త్రం, వన్యమృగ సంరక్షణ, ఆర్థికశాస్త్రం, ప్రాజెక్టుల నిర్వహణ తదితర పలు రంగాల నిపుణులతో ఒక స్పెషల్ వర్కింగ్ గ్రూపును ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అనేక కీలక సంప్రదింపుల తరువాత స్పెషల్ వర్కింగ్ గ్రూపు ఇచ్చిన సూచనల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదననే పూర్తిగా రద్దుచేయడం జరిగింది.

సైలెంట్ వ్యాలీ, హెరాన్ ప్రాజెక్టుల రద్దు కానివ్వండి, భవిష్యత్‌లో మరేదైనా ప్రాజెక్టు కానివ్వండి ... ప్రతిపాదనల్ని తుదిరూపానికి తీసుకువచ్చేటప్పుడు కేవలం సాంకేతిక, ఆర్థికాంశాలు, నీటి ప్రయోజనాల్నే కాక ... మానవజీవనం, పర్యావరణం, సాంస్కృతిక పునాదులు, సామాజిక సుహృద్భావాల్ని కూడా పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ఒక నిర్ణయానికి రావల్సివుంటుంది. పర్యావరణం మరియు అడవుల మంత్రిత్వశాఖ రూపొందించిన నదీలోయ ప్రాజెక్టుల నిర్మాణంపై పర్యావరణ ప్రభావ నిర్ధారణాంశాల్లో హెరాన్ రిజర్వాయర్ కేస్‌స్టడీని కూడా ఒక భాగంగా చేశారు. నదీలోయ ప్రాజెక్టుల విషయంలో కలిగే దీర్ఘకాలిక నష్టాల్ని దృష్టిలో వుంచుకుని భారత ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకూ ఈ ఉదాహరణలను సూచించి, జాగ్రత్త వహించమని హెచ్చరించింది.

## విజ్ఞప్తి

సైలెంట్‌వ్యాలీ, హెరాన్ ప్రాజెక్టులు నేర్పిన పాఠాల నేపథ్యంలో, తీవ్రస్థాయిలో మానవహననాన్ని నిర్మూలించేందుకు పోలవరం రిజర్వాయర్ నిర్మాణాన్ని రద్దుచేయాల్సిందిగా కోరుతున్నాం. దీని స్థానంలో ఈ ప్రతిపాదనలో సూచించిన ప్రత్యామ్నాయ డిజైన్‌ను ప్రభుత్వం ఆమోదించాలని విజ్ఞప్తిచేస్తున్నాం. ఈ ప్రత్యామ్నాయ పథకంతో ... ఇప్పటికే నిర్మాణమైన, నిర్మాణంలో వున్న పథకాలను మరింత అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ సంరక్షణ, వృక్ష మరియు జంతుసంపద సంరక్షణ, ప్రజల జీవనోపాధి తదితర అంశాల్లో సమ్మిళిత పురోగతిని సాధించగలుగుతాం. అంతేకాదు, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలు, దేవాలయాలు (ముఖ్యంగా భద్రాచలం రామాలయం), పాపికొండలు, తల్లిగోదారి ప్రవహించే పావనప్రదేశాలన్నీ మునిగిపోకుండా మన తరతరాల సాంస్కృతిక వారసత్వం, ప్రకృతిని రక్షించుకోగలుగుతాం. ◆

**- ఎమ్. ధర్మారావు** చీఫ్ ఇంజనీర్ (ఇరిగేషన్) రిటైర్డ్
**94405 01333**

(72 ఏళ్ళ శ్రీ ధర్మారావు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇరిగేషన్ సిఏడి డిపార్ట్‌మెంట్‌లో చీఫ్ ఇంజనీర్‌గా 1996లో పదవీ విరమణ చేసారు. నీటిపారుదల ప్రాజెక్టుల ఇన్వెస్టిగేషన్, ప్లానింగ్, డిజైన్, కన్‌స్ట్రక్షన్ మరియు మేనేజిమెంట్‌లో నాలుగుదశాబ్దాల అనుభవం ఆయన స్వంతం)

### తాత్కాలిక ఉపశమనంకోసం కొట్లాటవద్దు

# శాశ్వత పరిష్కారం కోసం కృషిచేద్దాం

### బి.సి రిజర్వేషన్ల చిచ్చు పై లోక్‌సత్తా

రిజర్వేషన్ల అంశంపై తాత్కాలిక రాజకీయ లబ్ధి పొందే ధోరణితో కాకుండా వివక్షల సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించే దిశగా కృషిచేసేందుకు అందరూ కలిసిరావాలి. కాపులతో సహ మరికొన్ని కులాలను వెనకబడిన తరగతుల జాబితాలో చేర్చే అంశాన్ని అధ్యయనం చేయటానికి రాష్ట్రప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం, సంకుచితత్వంతో 2007లో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పుడు మళ్లీ మారుతున్న రాజకీయ వాతావరణంలో రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చుపెట్టి కుంపటి రగిల్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. సాధ్యాసాధ్యాలతో నిమిత్తంలేకుండా రిజర్వేషన్లను గణనీయంగా పెంచుతామని కొన్ని కులాలకు ఆశలు కల్పించటం ఓట్లు దండుకోవాలనే దురాలోచనే. నిజంగా కాపులు లేదా ఇతర వెనకబడిన కులాల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే పరిమితమైన, తాత్కాలికమైన ఉపశమనమైన రిజర్వేషన్ల చుట్టూ రాజకీయం చేయకుండా వారందరి అభివృద్ధికీ శాశ్వతచర్యలు చేపట్టి ఉండేది.



"ఎస్సీ, ఎస్టీలు మినహాయించి రాజ్యాంగం ఎవరికీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించలేదు. రాజ్యాంగ మౌలిక చట్రంలో భాగంగా రిజర్వేషన్లు 50శాతం మించకూడదని అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే ప్రకటించింది. గతంలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఈ గీత దాటి చేసిన చట్టాలను రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్చటాన్ని కూడా తప్పుపట్టింది. ఇకమీద ఇదే తంతు ఎవరైనా నడిపితే రాజ్యాంగం 9వ షెడ్యూల్‌నే న్యాయసమీక్ష పరిధిలోకి తీసుకుంటామని హెచ్చరించింది. తమిళనాడు తిరిగి 50శాతానికి రిజర్వేషన్లను పరిమితం చేసేందుకు రెండేళ్ల కాలవ్యవధిని అత్యున్నత న్యాయస్థానం ఇచ్చింది... ఈ నేపథ్యంలో సాధ్యంకాదని తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచాలని యోచించటం ఓట్లు దండుకోవాలన్న ఎన్నికల మోసం తప్ప మరొకటి కాదు. ప్రస్తుతం రిజర్వేషన్లు పొందుతున్న కులాల్లో, పొందని కులాల్లో కూడా పేదల పిల్లలకు అవకాశాలు లభించటం లేదన్న అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా వ్యాపించిఉంది. ఒకరకంగా రిజర్వేషన్లు పొందుతున్న కులాల మధ్యే ఈ తరహా రిజర్వేషన్లు చిచ్చుపెడుతున్నాయి. ఇది రకరకాల రూపాల్లో వ్యక్తమవుతోంది. రిజర్వేషన్లు పొందుతున్న కులాలవారు... వర్గీకరణ రూపంలో, ఉప కులాల హక్కుల రూపంలో ఆందోళనలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాల-మాదిగ, రాజస్థాన్‌లో గుజ్జర్లు-మీనాల మధ్య ఘర్షణలు ఇందుకు ఉదాహరణ. ఇతర కులాల్లో ఆర్థికంగా వెనకబడినవారికి రిజర్వేషన్లు కావాలన్న నినాదం ఊపందుకుంటోంది. ఈ పరిస్థితులకు పరిష్కారం రిజర్వేషన్ల కోటా పెంచటం కాదు.

వాస్తవానికి 90శాతంమంది పిల్లలు 12వ తరగతిలోపే చదువుకు దూరమవుతున్నారు. పైచదువులకు 10శాతం కూడా చేరటంలేదు. ఈ నేపథ్యంలో కులవిద్వేషాలకు, ఉపకుల వ్యత్యాసాలకు తావులేకుండా పేదలందరికీ ఎదిగే అవకాశాలను కల్పించే తగిన పరిష్కారాలను అన్వేషించాల్సి ఉంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా లోక్‌సత్తా కార్యవర్గం చేసిన తీర్మానంలోని అంశాలు.

1. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను సుప్రీంకోర్టు తీర్పుమేరకు 50శాతానికి లోబడి కొనసాగించాలి.
2. రిజర్వేషన్ల ద్వారా సంపన్నులైనవారు, పెద్దపెద్ద హోదాలను పొందినవారు తిరిగి రిజర్వేషన్లు సొంతం చేసుకోకుండా కేంద్రప్రభుత్వం నిర్దేశించినరీతిలో క్రీమీలేయర్ విధానాన్ని అమలుచేయాలి.
3. గ్రామీణ ప్రాంతాల పిల్లలకీ, పట్టణ పేదల పిల్లలకీ కులం, మతంతో నిమిత్తంలేకుండా చదువులో ఉండే అంతరాన్ని తగ్గించటానికి పోటీపరీక్షల్లో 10శాతం మార్కుల్ని అదనంగా కలపాలి. దీనివల్ల రిజర్వేషన్లలోపల రిజర్వేషన్ల బయట ఉన్న పేదల పిల్లలకు పోటీలో నిలబడే అవకాశం ఉంటుంది.
4. ప్రభుత్వ- ప్రైవేటు తేడాలేకుండా 12వ తరగతి వరకూ పిల్లలందరికీ ఒకే ప్రమాణాల ఇంగ్లీషు, కంప్యూటర్ విద్యను ఉచితంగా అందించే ఏర్పాటుచేయాలి.
5. ఆ తర్వాత, ఇంజనీరింగ్, మెడిసన్ సహా పై చదువులన్నిటికీ అర్హత ఉన్న పిల్లలందరికీ డబ్బులేని కారణంగా చదువు ఆగిపోకుండా ప్రభుత్వమే విధిగా తోడ్పాటును అందించాలి"

రిజర్వేషన్ల పేరుతో సాగే ఓట్ల రాజకీయాలలో పావులు కాకుండా, బీసీలకు, పేదలకు శాశ్వత లబ్ధి చేకూర్చే ఈ అంశాలపై దృష్టిసారించాలి. ◆

# బినాయక్ సేన్ కు శిక్షపై అప్పీల్‌ను త్వరితంగా విచారణకు చేపట్టాలి

## నిష్పాక్షిక విచారణతో ఉన్నత న్యాయవ్యవస్థ ప్రజల్లో విశ్వాసం కలిగించాలి: జేపీ

హక్కుల కార్యకర్త డా॥ బినాయక్ సేన్‌కు ఛత్తీస్‌గఢ్‌లోని కోర్టు జీవితఖైదు శిక్ష విధించటం మనదేశ న్యాయవ్యవస్థలోని కొన్ని లోపాల్ని బట్టబయలు చేసింది. సేన్ కేసు తీర్పుపై అప్పీలును ఆ రాష్ట్రంలోని ఉన్నత న్యాయస్థానం త్వరితంగా విచారణకు స్వీకరించాలి.

''ప్రజాస్వామ్యంలో ప్రాణం తర్వాత కీలకమైన హక్కు పౌరస్వేచ్ఛ. ఇతరుల స్వేచ్ఛకు ప్రమాదకరంగా మారారని ధృవీకరించిన తర్వాత మాత్రమే ఎవరి స్వేచ్ఛనైనా తొలగించేలా అత్యంత జాగ్రత్తతో వ్యవస్థ వ్యవహరించాలి. డా॥ సేన్ అలా ప్రమాదకరంగా మారారా అనే విషయంలో చాలా సందేహాలున్నాయి''.

అన్ని రాష్ట్రాలలోలాగే ప్రజాక్షేమానికి ప్రమాదంగా మారిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఛత్తీస్‌గఢ్ సర్కారుకు కూడా ఉంది. అయితే ఆ ప్రయత్నంలో రాష్ట్రప్రభుత్వం నిష్పాక్షికంగా వ్యవహరించటమే కాకుండా, అలా వ్యవహరిస్తున్నట్టు కూడా కన్పించాల్సి వుంది. డా॥ సేన్ కేసును విచారించిన కోర్టు ఆ రెండో పరీక్షలో సఫలం కాలేకపోయింది. అందుకే తీర్పు పట్ల అంత పెద్దఎత్తున అభ్యంతరాలు వస్తున్నాయి.

పేదలకు విశేష సేవలందించిన డా॥ సేన్ మానవతాచర్యలను ఒకపక్క- తన విధానాలను, చర్యలను వ్యతిరేకించేవారి పట్ల హింసాత్మకంగా అణచివేస్తూ వస్తున్న ప్రభుత్వాల తీరును మరోపక్క బేరీజు వేసుకున్నాకే పౌరసమాజం... సేన్ కృషిని మావోయిస్టుల దేశద్రోహం, హింసతో పోల్చటాన్ని అభ్యంతర పెడుతోంది. సేన్ విషయంలో కోర్టు తీర్పు పట్ల దేశంలోనేకాకుండా, విదేశాల్లోని వివిధ హక్కుల సంస్థలు, పౌరసమాజ సంస్థలు పెద్దఎత్తున నిరసనలు వ్యక్తంచేస్తున్నాయి.

హక్కుల పరిరక్షణలో కోర్టులు కూడా కీలకపాత్ర పోషించే వ్యవస్థ భారతదేశంలో ఉంది. సేన్‌కు విధించిన శిక్షను పునస్సమీక్షించి మరింత ఉన్నత ప్రమాణాలతో విచారణ జరపాలి. నిష్పాక్షికంగా విచారణ జరిగిందనే నమ్మకం కూడా ప్రజలకి కలిగించాలి. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరొందిన భారత్... నాణ్యమైన న్యాయవ్యవస్థలో కూడా ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించాలి. ◆

# భారత న్యాయవ్యవస్థకు ఐరోపా సమాఖ్య పాఠాలు చెప్పనక్కర్లేదు

మానవ హక్కుల కార్యకర్త డా॥ బినాయక్ సేన్ బెయిలు విచారణను పరిశీలించేందుకు బిలాసపూర్‌లోని ఛత్తీస్‌గఢ్ హైకోర్టుకు ఐరోపా సమాఖ్య (యూరోపియన్ యూనియన్) తన బృందాన్ని పంపటం గర్హణీయం.

''అటువంటి విదేశీ పర్యవేక్షణలకు భారతదేశమేమీ బలహీనమైన చిన్నాచితకా గణతంత్ర రాజ్యం కాదు''. స్వేచ్ఛాస్వాతంత్ర్యాల పరిరక్షణకు... అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలన్నింటిలో అరుదైన ఘనత కలిగిన ప్రజాస్వామిక దేశం భారత్ మానవ హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు తగిన దిద్దుబాటు చర్యలకు భారతదేశంలోని ప్రభుత్వాలు వెనక్కి తగ్గలేదు. న్యాయం సక్రమంగా అందలేదని తేలిన సందర్భాలలో న్యాయవ్యవస్థ కూడా తగురీతిలోనే స్పందిస్తూ వస్తోంది. వ్యక్తిగత స్వేచ్ఛను, మానవ హక్కులను పరిరక్షించేందుకు భారతదేశానికి సుప్రీంకోర్టులాంటి ఓ అద్భుతమైన వ్యవస్థ ఉంది.

ఈ అంశాన్ని పరిష్కరించగల సత్తా భారత న్యాయవ్యవస్థకుంది. చట్టబద్ధ పాలన, సహజ న్యాయంపై విదేశీయులు జోక్యం చేసుకుని మనకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదు.

సామర్థ్యానికి, పారదర్శకతకు పేరొందిన భారత న్యాయవ్యవస్థ పనితీరును పర్యవేక్షించేందుకు ఐరోపా సమాఖ్య అత్యుత్సాహాన్ని ప్రదర్శించటం అవాంఛనీయం. రాజ్యాంగబద్ధతను, మన హక్కుల్ని కాపాడటంలో ఎదురయ్యే సవాళ్లను భారతీయ వ్యవస్థలు, పౌరసమాజం సమర్థవంతంగా ఎదుర్కోగలవు.

మానవ హక్కుల రక్షణకు ఎంత విలువుందో దేశ గౌరవ పరిరక్షణకూ అంతే విలువ ఉందని మానవ హక్కుల కోసం ఆందోళన చెందుతున్నవారు కూడా గుర్తించాలి. ◆

# లోక్‌సత్తాలో చేరికలు

మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి రెడ్డి ఆనంద్ పాల్, తూర్పు గోదావరి జిల్లా పత్తిపాడు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ పొట్ల సత్యనారాయణ లోక్‌సత్తా పార్టీలో చేరారు. జనవరి 21న లోక్‌సత్తా ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సమక్షంలో వారు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసి వివక్షలేకుండా అందరికీ ఎదిగే అవకాశాలను కల్పించేందుకు లోక్‌సత్తా చేస్తున్న రాజ్యాంగబద్ధ పోరాటాన్ని విస్తరించేందుకు కృషి చేయాలని జేపీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ◆

# రాజ్యాంగసంస్థల విశ్వసనీయతను పునరుద్ధరించటం మన తక్షణ కర్తవ్యం : జేపీ

ఆయన మాట్లాడుతూ... దేశం ప్రస్తుతం ఐదు తీవ్రమైన సవాళ్ళను ఎదుర్కొంటోందన్నారు. రాజ్యాంగ సంస్థలు సంస్కరణలకు దూరంగా జరుగుతుండడం, అవినీతి విశృంఖలంగా పెరిగిపోతుండడం, చట్టబద్ధ పాలనకు చరమగీతం పాడడం, యువతకు ఉపాధి అవకాశాలు దూరమవుతుండడం, వ్యవసాయం సంపద సృష్టించే రంగంగా గుర్తింపును కోల్పోతుండడం అనే ఈ ఐదు సవాళ్లు దేశప్రగతికి తీవ్ర విఘాతంగా మారాయన్నారు. ముఖ్యాంశాలు....

62వ గణతంత్ర సంవత్సరంలోనైనా రాజ్యాంగసంస్థల, ముఖ్యంగా న్యాయవ్యవస్థ పవిత్రతను కాపాడుకోకపోతే దేశ భవిష్యత్తు అంధకారంలో పడుతుంది. రాజ్యాంగ సంస్థల పరిరక్షణకు విభేదాలను, విద్వేషాలను, అసూయను అధిగమించి, కులం, మతం, ప్రాంతం, భాషతో ప్రమేయం లేకుండా అందరు కలిసికట్టుగా పోరాడుదాం. "భారత రాజ్యాంగానికి పదవుల్లో ఉన్నవారెవ్వరూ సంతకం పెట్టలేదు. భారత ప్రజలమైన మేము... అని మనంతట మనం అమల్లోకి తెచ్చుకున్నాం. మనం తెచ్చుకున్న రాజ్యాంగాన్ని కాపాడుకుని అనుక్షణం ఆచరణలో చూపటం మనముందున్న తక్షణ కర్తవ్యం".

అవినీతి ఆరోపణలతో భారత న్యాయవ్యవస్థపై నీలినీడలు కమ్ముకున్నాయి. చట్టసభలు పార్టీల మధ్య యుద్ధభూములుగా మారాయి. ప్రభుత్వాలు ప్రజాధనాన్ని దోచుకోవటానికి సాధనాలుగా మారాయి. చట్టబద్ధపాలన ఎండమావిగా మారుతోంది. న్యాయవ్యవస్థ ప్రక్షాళనకు ప్రస్తుతం జీవించివున్న వారిలో జాతీయస్థాయిలో అత్యున్నత న్యాయకోవిదులతో కలిసి 'జాతీయ జ్యుడీషియల్ కమిషన్'ను ఏర్పాటు చేసేందుకు లోక్‌సత్తా గట్టి కృషి చేస్తోంది. ఉన్నత న్యాయవ్యవస్థలో నిజాయతీపరుల్ని నియమించేందుకు, అక్రమార్కులైన న్యాయమూర్తులను తొలగించేందుకు ఈ కమిషన్ చర్యలు తీసుకుంటుంది.

అవినీతిపై పోరాటానికి దేశ ఎజెండాలో ఈ ఏడాది గట్టి ప్రాధాన్యత ఉండాలి. భారత్ నుంచి దాదాపు రూ.20లక్షల కోట్ల రూపాయల దోపిడీ డబ్బును విదేశాలకు తరలించినట్టు, అంతే మొత్తాన్ని ఇక్కడ స్వదేశంలో కూడా పెట్టుబడి పెట్టినట్టు ఒక అంచనా. "ప్రభుత్వానికి చిత్తశుద్ధి, సత్తా ఉంటే ఆ సమస్యను కేవలం మూడు నెలల్లో పరిష్కరించే ఏర్పాటు చేయవచ్చు". అవినీతికి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో లోక్‌సత్తా ఆందోళనా కార్యక్రమాలను చేపట్టింది. 2-జీ స్పెక్ట్రం కుంభకోణంపై జరిగే పోరుకవ్యవస్థలో మార్పునకు సంకేతం కావాలి. శాశ్వత ప్రాతిపదికన స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి వ్యతిరేక కమిషన్ ఏర్పడేంతవరకూ విశ్రమించబోము.

దేశంలో చట్టబద్ధపాలన సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయింది. పలుచోట్ల పలు తరహాల మాఫియాలు పుట్టుకొస్తున్నాయి. మహారాష్ట్ర నాసిక్‌లో నిజాయతీకి, నిర్భీతికి నిలబడినందుకు అదనపు కలెక్టర్ యశ్వంత్ సోనావానేను కిరోసిన్ మాఫియా సజీవదహనం చేయడం తాజా దారుణ ఘటన. మాఫియాలను అణచటంతోపాటు వారికి అండగా ఉన్న రాజకీయశక్తుల్ని బైటపెట్టి కఠినచర్యలు తీసుకోవాలి. చట్టాన్ని కాపాడే శక్తుల్ని బలోపేతం చేయడం తక్షణ కర్తవ్యంగా గుర్తించాలి.

కండల్లో శక్తి, గుండెల్లో ఆర్తి వుండికూడా యువత ఉపాధి అవకాశాలు దొరక్క తీవ్రనిరాశకు లోనవుతున్నారు. ఏటా కోటిమంది యువతకు ఉపాధి నైపుణ్యాల శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించడం దేశం ముందున్న సవాలు.

వ్యవసాయాన్ని సమూలంగా సంస్కరించి ఆదాయాన్ని పెంచకుండా దేశం అభివృద్ధి చెందదు. దేశ జనాభాలో 60శాతం వ్యవసాయం మీద ఆధారపడి కేవలం రూ.15,000 తలసరి ఆదాయాన్ని సంపాదిస్తుంటే, పట్టణాల్లో వ్యవసాయేతర రంగాల్లో ఉన్నవారి తలసరి ఆదాయం రూ.1,05,000 ఉంది. వ్యవసాయోత్పత్తిని పెంచి ఆ ఉత్పత్తులకు మార్కెట్ రేట్లు అందించే ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు అధిక ఆదాయం వచ్చేలా చేయకపోతే భారత ఆర్థికవ్యవస్థ కుప్పకూలిపోతుంది. ◆

# వి.ఐ.టి వర్సిటీ యువజన సదస్సులో జేపీ

తమిళనాడు వెల్లూరులోని వి.ఐ.టి యూనివర్సిటీ జనవరి 28వ తేదీన నిర్వహించిన జాతీయస్థాయి యువజన సదస్సులో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారతదేశాన్ని అగ్రరాజ్యంగా నిర్మించటంలో యువత పాత్రపై సదస్సు ప్రధానంగా చర్చించింది.

గాంధీ సెంటర్‌కు చెందిన 'ది గాంధీ బ్రాడ్‌షీట్' అనే వార్తా వెబ్‌సైట్‌ను కూడా జేపీ ఈ సందర్భంగా ప్రారంభించారు. సెంటర్ నిర్వహించే 'యూత్ ఫర్ పీస్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ◆

రాష్ట్ర ప్రజలకు లోక్‌సత్తా విజ్ఞప్తి

# సభ్యులుగా చేరండి- విరాళాలు ఇవ్వండి

## ఫిబ్రవరి 1 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు పక్షంరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సభ్యత్వం చేర్పించాలని, విరాళాల్ని సేకరించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. సమాజహితాన్ని కోరే రాజకీయం కోసం, ప్రజాసమస్యలకు నిజమైన పరిష్కారాల ఆధారంగా అవినీతిరహిత రాజకీయం కోసం, పౌరులు కేంద్రంగా పాలన కోసం, మానవాభివృద్ధిని సాధించే ఆర్థిక ప్రగతి కోసం, నిబద్ధతతో, నిజాయతీగా రాజకీయం చేస్తున్న లోక్‌సత్తా పార్టీని బలోపేతం చెయ్యడానికి రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలూ సభ్యులుగా చేరాల్సిందిగా, విరాళాలు ఇచ్చి ఆర్థికంగా సహాయాన్ని అందించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ అన్నారు.

“దేశంలో రాజకీయం అవినీతిమయమైంది. ప్రజాధనాన్ని దోచుకోవటం, దాచుకోవటమే రాజకీయంగా చెలామణి అవుతున్నది. పదవుల వేట, లాభాల మేటగా రాజకీయం నడిచిపోతున్నది. రాజ్యాంగ విలువల్ని తుంగలో తొక్కుతున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థని సంక్షోభంలోకి నెట్టారు. వ్యవసాయరంగాన్ని విస్మరించారు. యువతకు మంచి ప్రమాణాల విద్య, నైపుణ్యాలు కరవయ్యాయి. స్థానిక ప్రభుత్వాలకు విధులు, నిధులు లేకుండా చేసి పౌరసేవల్ని మృగ్యం చేశారు. వీటి పర్యవసానంగా అన్నివర్గాల ప్రజల్లో, ప్రత్యేకించి రైతులలో, యువతలో అసంతృప్తి పెల్లుబుకుతున్నది. అవినీతికి-జనాకర్షక పథకాలకే పరిమితమైన రాజకీయాన్ని వదిలించుకోకపోతే దేశం అధోగతి పాలవుతుంది. అందుచేత కులం,మతం,ప్రాంతీయ విభేదాలకు అతీతంగా ఏకం కావలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. జనహితం ఆధారంగా కొత్త రాజకీయానికి తోడ్పాటునివ్వాల్సిందిగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

కొత్త రాజకీయాన్ని, ప్రజా సమస్యల పరిష్కారాల్ని అభిలషించేవారంతా మౌనాన్ని విడనాడాలి. కార్యసాధకులు, ప్రోత్సాహికులు కావాలి. అందుకోసం లోక్‌సత్తా పార్టీలో సభ్యులుగా చేరాలి. పార్టీకి విరాళాలు ఇచ్చి ఆర్థికంగా తోడ్పాటునివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం” అని డి.వి.వి.ఎస్ వర్మ పేర్కొన్నారు. ◆

# జీవో 58కి ప్రభుత్వం కట్టుబడి బియ్యం స్వేచ్ఛారవాణాను కొనసాగించాలి

## రంగుమారిన ధాన్యం కొనుగోలుకు పెద్దఎత్తున కేంద్రాల్ని ప్రారంభించాలి: లోక్‌సత్తా

వరి ధాన్యం రైతుకు లాభసాటి ధర వచ్చేందుకు వీలుగా బీపీటీ, ఇతర సన్నరకం ధాన్యం/బియ్యం ఇతర రాష్ట్రాలకు స్వేచ్ఛగా రవాణా చేసేందుకు అనుమతినిస్తూ డిసెంబర్ 4, 2010న జారీచేసిన (జీవో ఎంఎస్ నెం. 58)కు రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉండాలి. దాంతోపాటు ఉప్పుడు బియ్యం, బీపీటీ బియ్యం అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉన్న చోట అమ్ముకునేందుకు తక్షణం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ప్రతి గింజా కొంటాం, దిగులు చెందవద్దు అని ప్రకటనలు గుప్పించిన రాష్ట్రప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం చేతులెత్తేసింది. ధాన్యం కొనుగోలు, ఎగుమతులపై ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన, అసమర్థ విధానాల వల్ల ధాన్యాన్ని రైతులు కనీస మద్దతు ధర కంటే కూడా క్వింటాలుకు రూ.400 తక్కువకు అమ్ముకునే దుస్థితి కొనసాగుతోంది. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఉదారంగా వ్యవహరించాలి. కనీసం 13శాతం వరకూ ఎం.ఎస్.పికే కొనుగోలు చేయాలి. చేసిన ప్రకటన మేరకు 50శాతం వరకూ రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలి. రైతుల వద్ద మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని బీరాలు పలికిన రాష్ట్రప్రభుత్వం కనీస స్థాయిలో కూడా ఆ కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోవటం వ్యవసాయం పట్ల దాని చులకనభావానికి అద్దం పడుతోంది. రైతుకు, మార్కెట్‌కు మధ్య ఐదు అంచెలుండటం వల్ల అటు రైతు, ఇటు వినియోగదారుడూ నష్టపోతున్నారు. ప్రభుత్వం వెంటనే ఐ.కె.పి ద్వారా మండలానికో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. రైతులకు మార్కెట్ అవకాశాల్ని విస్తృతం చేసేలా రైతు వద్ద నిల్వ ఉన్న ధాన్యానికి తనఖా రుణాలు (ప్లెడ్జి లోన్లు) ఇచ్చేందుకు బ్యాంకులకు నిర్దిష్ట మార్గదర్శకాలు ఇవ్వాలి. దీనివల్ల కూడా కొంతమేర రైతులు మార్కెట్ దోపిడీకి గురికాకుండా సరైన ధర వచ్చాక పంటను అమ్ముకునే వెసులుబాటు లభిస్తుంది.

హైదరాబాద్ తాగునీటికి భారీవ్యయంతో, ప్రయాసతో గోదావరి జలాలు తెచ్చే బదులు తక్కువ వ్యయంతో, స్వల్పకాలంలో పూర్తయ్యే కృష్ణా నదీజలాల మూడోదశ పథకాన్ని అమలు చేయాలి. లోక్‌సత్తా పార్టీ కొంతకాలంగా పోరాడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ప్రయత్నాలు ప్రారంభించటాన్ని స్వాగతిస్తున్నాం. ◆

# విధానాలు లేని పార్టీలు కకావికలవుతున్నాయి...

■ స్థానిక నిర్మాణం, నిర్దిష్ట కార్యక్రమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా రూపుదిద్దుకుందాం : పార్టీ వర్గాలకు జేపీ పిలుపు

ఎంత డబ్బు, బలగం ఉన్నా సరైన విధానాలు, కనీస విలువలు లేకపోతే దశాబ్దాల చరిత్ర ఉన్న పార్టీలు సైతం కకావికలైపోతాయని కళ్ల ముందే సాక్ష్యాలు కనిపిస్తున్నాయి. విలువలు, విధానాలకు కట్టుబడిన లోక్‌సత్తా పార్టీ సంస్థాగతంగా పటిష్టం చేసుకుని బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా తీర్చిదిద్దాలి. "ఈవేళ పరిస్థితుల వల్ల రాష్ట్రంలో, దేశంలో అన్ని వర్గాలూ కదులుతున్నాయి. రాష్ట్రంలో మొదటిసారిగా గ్రామస్థాయి నుంచి పెద్దఎత్తున అస్థిరత్వం వల్ల వివిధ పార్టీల మధ్య రాజకీయ మొబిలిటీ కన్పిస్తోంది. అందరి ప్రయోజనాలనూ పరిరక్షించే బలమైన భావజాలం కలిగిన లోక్‌సత్తా పార్టీ సరైన నిర్మాణం, కార్యాచరణతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి".

పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ సీనియర్ల, గ్రేటర్ హైదరాబాద్ నేతల సమావేశానుద్దేశించి జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ... 2009లో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ, జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత పరిణామాల వల్ల లోక్‌సత్తా పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగింది. ఒకప్పుడు గ్రేటర్ హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన లోక్‌సత్తా వాణి ఈరోజు గ్రామాల్లో, జాతీయస్థాయిలో కూడా విస్పష్టంగా వినిపిస్తోంది. అయితే సంస్థాగత నిర్మాణం, స్థానిక కార్యక్రమాలు లేకుండా ఎన్నికల ఫలితాలు సాధించటం సాధ్యంకాదు. రాబోయే మూడున్నరేళ్ల కాలంలో నియోజకవర్గం ప్రాతిపదికగా పార్టీ నిర్మాణం, నాయకత్వం పెంపు, కార్యక్రమాలు చేపట్టి 2014 ఎన్నికలకు పటిష్టంగా సిద్ధం కావాలి. అనేక వైరుధ్యాలు, ఆధారపడే స్వభావమున్న మన సమాజంలో విధానాల ప్రాతిపదికన వ్యవస్థను నిర్మించటం పెద్దసవాలు. అందువల్ల లోక్‌సత్తా తన సంస్థాగత నిర్మాణంలో నెమ్మదిగా ముందు కెళ్తుండటం కొంత నిరాశ కలిగిస్తున్నా అందులో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఈ వైఫల్యాన్ని త్వరలోనే అధిగమించగలం. లోక్‌సత్తాకు ఏ పార్టీ అంటరానిదికాదు. విధానాల ప్రాతిపదికన ఎవరితోనైనా కలిసి పనిచేస్తుంది. అయితే పొత్తుల గురించి ఎన్నికల సమయంలో తప్ప ఇప్పుడు ఆలోచించవద్దు. వార్డు, గ్రామస్థాయి నుంచి పార్టీని ప్రజాస్వామ్యయుతంగా నిర్మిస్తూ, నాయకత్వాన్ని పెంపొందించుకుంటూ, స్థానికంగా కార్యక్రమాలు చేపట్టాలి. ఇందుకోసం యువత, రైతులు, గ్రామీణ ప్రాంత సమస్యలు, అవినీతి నిర్మూలన, స్థానిక ప్రభుత్వాల సాధికారత అంశాల మీద బలంగా, నిర్దిష్ట అవగాహనతో పనిచేయాలి.

"సంకుచిత రాజకీయాల్లో భాగం కావద్దు. తెలంగాణ వస్తే నష్టమేంటని తాను కోస్తా, రాయలసీమ పర్యటనల్లో యువతను ప్రశ్నించానని, అలాగే ప్రత్యేక రాష్ట్రం వల్ల సమస్యలు పరిష్కారమైపోతాయని భ్రమపడవద్దని తెలంగాణలో యువతకు వివరించానని, ముమ్ముందు పరిణామాలు ఎలా ఉన్నా పార్టీ ఇదేతీరుగా యువత, విద్యార్థుల్లో విజ్ఞతను పెంచేందుకు కృషి చేయాల"ని జేపీ అన్నారు.

### రాజకీయ స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలి

"రాష్ట్రంలో, దేశంలో దిశానిర్దేశం చేసే బాధ్యతతో లోక్‌సత్తా పనిచేస్తోంది. ఈ కొత్తరాజకీయానికి తగ్గట్టు పార్టీ తన సామర్థ్యాన్ని పెంచుకోవాలి. ఇందుకోసం జనసమీకరణ చేసేందుకు రాజకీయ స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రజలకు దగ్గరగా కార్యకలాపాలు చేపట్టటం మీద దృష్టి పెట్టాలి". అని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు వర్మ అన్నారు. ◆

---

## విద్యార్థి సత్తా

# వైబిఐ ద్వారా అవినీతి వ్యతిరేక ఉద్యమం

**డి. నరసింహ**

జేపీ ఆధ్వర్యంలో వైబిఐ ద్వారా పార్టీలకు అతీతంగా లోక్‌సత్తా అవినీతి వ్యతిరేక ఉద్యమం చేపట్టనుంది. వైబిఐ ద్వారా అన్ని స్వచ్ఛంద సంస్థలను, అవినీతి పై పోరాటం చెయ్యాలనుకునే విద్యార్థి విభాగాలను కలుపుకుని పోవాలనుకుంటున్నాము. ఈ సందర్భంగా డిసెంబర్ 29వ తేదిన వివిధ కాలేజీ విద్యార్థులు జేపీ గారి సమక్షంలో వైబిఐలో చేరారు. పలు స్వచ్ఛంద సంస్థలు వైబిఐతో పనిచెయ్యడానికి అంగీకరించి జేపీ సమీక్షంలో తమ నిర్ణయాన్ని తెలియచేసాయి. ఐఫోకస్, వై.ఎఫ్ఎస్ (వైఎఫ్ఎస్), ఆశా, 5వ పిల్లర్ వంటి స్వచ్ఛంద సంస్థలతో పాటు భద్రుక, ఉస్మానియా (ఓయూ), విజైమైటి (వి.జె.ఐ.టి), జెబిమైటి (జెబిఐటి), శ్రీ చైతన్య, శ్రీఇందు, శ్రీదత్తా, వాసవి తదితర కళాశాల విద్యార్థులు వైబిఐలో చేరారు. ఈ సందర్భంగా అవినీతి వ్యతిరేక విద్యార్థి ఉద్యమం ప్రారంభించేందుకు తీర్మానించబడింది. ◆

# ఉద్యమకారునికి జరిగిన ఘోర అన్యాయం

- ఎ. అన్నపూర్ణ

వేలూరు క్రిస్టయన్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలోని పిల్లల వైద్య నిపుణుడు వినాయక్ సేన్ 29 సంవత్సరాలుగా జైళ్ళలోకి వెడుతూ వస్తూండేవారు. జయప్రకాష్‌నారాయణ్ నేతగావున్న పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ క్రియాశీలక సభ్యుడు కనుక జైళ్ళలోని ఖైదీలకు వైద్యచికిత్సలు చేస్తూ వాళ్ళ హక్కులను సమర్థిస్తూ కష్టడీలలో హింసనుంచి వారిని కాపాడుతూ వుండేవారు. నాలుగేళ్ళ వయసులోనే న్యాయంకోసం ఆయన పడేతపన చూసి ఆయన తల్లి 'కర్మయోగి' అని పిలవసాగారు. 2006లో మావోయిస్టులకు వ్యతిరేకంగా తక్షణ ప్రజా ప్రతిఘటనగా ప్రాచుర్యం పొందిన సల్వాజుడుం మీద ఆయన సిద్ధం చేసిన నివేదిక కారణంగా ఆయన మీద చట్టపరంగా చర్యలు తీసుకోడానికి కారణం అయిందని భావించవచ్చు. సల్వాజుడుంను నక్సలిజానికి వ్యతిరేక పోరులో మేలిమి మలుపుగా ప్రభుత్వం ప్రచారం చేసుకోగా సేన్ నివేదిక మూడు తీవ్రమైనన ఆరోపణలు చేసింది. అది అప్పటికప్పుడు బయల్దేరిన ప్రజా ఉద్యమం కాదని ప్రభుత్వం నిర్వహిస్తున్న తీవ్రవాద నిరోధక ఉద్యమమని పేర్కొన్నారు. పల్లెలను భారీ స్థాయిలో తుడిచిపెట్టి లక్షలాది మంది ప్రజలను శరణార్థులు చేయాలని, చేసిన ప్రయత్నంలో హింసను రెచ్చగొట్టిందని ఆరోపణ చేశారు. చట్టనియమాల ఉల్లంఘన వినాయక్ సేన్‌కు ఘోరమైన కష్టాలను తెచ్చిపెట్టింది. 2009 మే నెలలో ప్రాసిక్యూషన్ తగిన సాక్ష్యాధికారమేదీ సమర్పించక పోవడం వల్లనే ఆయనకు బేషరుతు బెయిల్ లభించింది. కానీ ఇప్పుడు ఆనాటి అరకొర సాక్ష్యాధారమే సేన్‌కు శిక్షపడేలా చేసింది. అని సేన్ భార్య ఇలీనా చెప్పారు.

ఉదాహరణకు ఏ 37 సాక్ష్యాన్ని తీసుకుంటే 2007లో వినాయక్ సేన్ ఇంటిని సోదాచేసినప్పుడు అక్కడ అదిలేదు. పోలీసులు తమంతతాముగా వీడియో తీసుకున్నారు. సాక్ష్యంకోసం అక్కడ ఏదీ నాటకుండా వుండేలా చూసేందుకు మరో వీడియో తీసుకునేందుకు నేను అనుమతి తీసుకున్నాను అని ఆమె అన్నారు. పోలీసులు దేనినైనా స్వాధీనం చేసుకునివుంటే దానిని స్వాధీన నివేదికలో నమోదు చేసి అందులో వినాయక్ పోలీసు అధికారులు సంతకం చేయాల్సివుంటుంది. అని ఆమె అన్నారు. అయినప్పటికీ ప్రస్తుత శిక్షలో సంతకంలేని ఒక లేఖను సాక్ష్యం ఎ37గా పేర్కొన్నా అది మెమోలో చోటు చేసుకోలేదు. పోలీసులు దీనిపై వివరణ ఇస్తూ "అది మరో కాగితంలో అతుక్కుపోయి వుంటుంది" అని చెబుతున్నారు. విచిత్రం ఏమంటే ఏ 37 సాక్ష్యం ఒక తాజా మడతలేని కాగితం మీద ఒక కొత్త కంప్యూటర్ ప్రింటవుట్‌లా కనిపించే విధంగా రాయబడి వుంది. అది ఆయన కొరియర్ పంపించే లేఖ అయివుంటే అంతకొత్తగా ఎందుకు వుంటుందని ఇలీనా ప్రశ్నించారు. అన్ని సాక్ష్యాధారాలను సీలు వేయని సంచుల్లో తీసుకు వెళ్ళినట్టు కూడా ఆ వీడియో చూపిస్తోంది. వినాయక్ సేన్‌కు ఈ విషమ పరిక్ష 2007 వేసవిలో మొదలైంది. నక్సలైట్లతో సంబంధాలున్నట్టు వచ్చిన వదంతుల మీద విచారించడానికి ఒక పాత్రికేయుడు ఫోన్ చేయడంతో ఈ వివాదం మొదలైంది. ఆ తర్వాత రాయపూర్‌లోని పత్రికలు నగరంలో అందరికీ సుపరిచితుడైన వ్యక్తి పరారిలో వున్నారని ఆయనకోసం పోలీసులు గాలిస్తున్నారని వార్తలు రాయడం ప్రారంభించాయి. మావోయిస్టులకు లేఖలు పంపుతున్నారనే ఆరోపణ బలపడింది. వార్తాపత్రికల్లో తన సెల్‌ఫోన్ నంబర్లు ప్రచురించాలని సేన్ కోరారు. ఎవరైనా తనకు ఫోన్‌చేస్తే వివరించగలనని ఆయన చెప్పారు. అది ప్రచురితమైంది. కానీ ఎవరూ ఆయనకు ఫోన్‌చేయలేదు. వినాయక్ సేన్ ఆందోళనతో బిలాస్‌పూర్ హైకోర్టులో తన న్యాయవాదిని కలిసేందుకు వెళ్ళిన సమయంలో ఆయనను అరెస్ట్‌చేశారు. ఏడునెలలు జైలులో గడిపిన తర్వాత ఆయనమీద అభియోగం వెలుగులోకి వచ్చింది. సరైన అభియోగాలు లేకుండా వినాయక్ సేన్‌ను అంతకాలం ఎందుకు జైలులో పెట్టారన్న ప్రశ్నకు ఛత్తీస్‌గఢ్ డిజిపి విశ్వరంజన్ స్పందిస్తూ "కొన్ని సందర్భాలలో దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో జ్యుడిషియల్ కస్టడీ అనేది ఏళ్ళ తరబడే కొనసాగుతుందని" అన్నారు. తీర్పుమీద వ్యాఖ్యలు చేయడం నైతిక ప్రజాస్వామ్య నియమాలకు విరుద్ధమని గట్టిగా చెబుతూనే ఆయన మరో ముఖ్యమైన వ్యాఖ్యకూడా చేశారు. ఈ కేసు సందర్భానుగతంగా నిర్మించబడింది. ఇది సాక్ష్యాధారాలకన్నా శక్తివంతమైనదని అన్నారు. ఆ విషయం మీద న్యాయ వాదులు రంగ ప్రవేశం చేశారు. సందర్భాలకు మరో వివరణ ఏదైనా వుంటేతప్ప సందర్భానుగత సాక్ష్యాధారం ప్రాతిపదికను శిక్షవిధించడం సరికాదు. అనిసేన్ తరుపున్యాయవాది సుధాభరద్వాజ్ అన్నారు. ఆ ప్రకారం చూస్తే సన్యాల్, గుహలకు సేన్ లేఖలు కొరియర్ చేశారనే వాదన వీగి పోతుంది. జైలర్లు అందించిన సాక్ష్యం ప్రకారం సన్యాల్‌తో అన్ని సమావేశాలను వాళ్ళు పర్యవేక్షించారు. సన్యాల్‌ను తాను ఎందుకు కలుస్తున్నాననే దానిమీద వినాయక్‌సేన్ స్పష్టంగా అర్ధవంతమైన సమాధానమిచ్చారు. సేన్‌రాత పూర్వక ప్రకటన నుంచి ఇలీనా కొన్ని వ్యాఖ్యలను బయటకు చూపారు. సన్యాల్‌ను 2006లో రాయపూర్ జైలుకు తీసుకువచ్చిన తర్వాత ఆయన ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన కుటుంబ సభ్యులు నన్ను సంప్రదించారు. జైలు సిబ్బంది వైద్యులతో భావవ్యక్తీకరణ సమస్యల కారణంగా ఆయన చేతులకు శస్త్రచికిత్స ఆలస్యమవుతోందని ఆయన

కుటుంబ సభ్యులు నాదృష్టికి తీసుకువచ్చారు. ఆయనకు శస్త్రచికిత్స జరిగేలా చూడడంలో నేను సహాయపడ్డాను. ఈ సమయంలో ఖైదీకుటుంబానికి జైలు అధికారులకు వైద్యాధికారులకు మధ్య ఎక్కువగా ఉత్తరప్రత్యుత్తరాలు జరిగాయి. వాటి ప్రతులను నాకూ పంపించారు అంటూ ఆయన వివరించారు.

మరో ముఖ్యమైన విషయమేమంటే పోలీసు ప్రాసిక్యూషన్ బలమంతా ఏకైక సాక్షి అనిల్‌కుమార్ సింగ్ మీద ఆధారపడి ఉంది. ప్రస్తుతం అతని జాడలేదు అంతేకాక పోలీసులు గుహను అరెస్టు చేసినట్టు చూపుతున్న ప్రదేశాలలో కూడా తేడా కనిపిస్తోంది. సొంత సూత్రం ప్రాతిపదికన ఆ కేసును తయారు చేసారు. లేఖలను చేరవేశారనడాన్ని పూర్తిగానిరూపించలేక పోయారని సుధాభరద్వాజ అన్నారు. డిసెంబర్ 24వ తేది శుక్రవారం ఆ సంచలానత్మక తీర్పును కేవలం 20 నిముషాల్లో ముగించారు. "ఆయన నక్సలిజాన్ని ప్రేరేపించడంలోనూ దేశద్రోహం తలపెట్టిన కుట్రలోనూ నిందుతుడు" అని న్యాయమూర్తి బిపివర్మ కాస్తంత కఠినస్వరంతో అన్నారు. తీర్పు కఠిన జీవిత కారాగార శిక్ష. ఈ తీర్పువిన్న వినాయక్‌సేన్ ఒక్కసారిగా అక్కడే కుప్పకూలిపోయారు. పదినిముషాల్లో ఒక పోలీసు వాహనం కొత్త ఖైదీలతో రాయపూర్‌లోని కేంద్రకారాగారం వైపు దూసుకుపోయింది. అప్పటికే ఆయన రెండేళ్ళ జైలులో గడిపి 2009 మేలో బెయిల్ మీద విడుదలయ్యారు. సేన్‌కు జైలు జీవితం గురించి తెలిసినన్ని విషయాలు మరెవరికీ తెలియవు. అది ఏరకంగా అంటే పియుసిఎల్ (పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్) సభ్యుడిగా వున్న కారణం చేత! సాయంత్రం 3 గంటల సమయంలోవర్మ రూపొందించిన 92 పేజీలతో కూడిన తీర్పును వినడంకోసం సేన్‌ను తీసుకువచ్చారు. భారత పోలీసు శిక్షాస్మృతి చట్టంలోని 124ఎ 120బి ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజాభద్రత చట్టంలోని 8(1)(2)(3)(5) 1967 నాటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంలోని 39(2) అధికరణల కింద అభియోగాలు మోపారు. సాధారణ భాషలో చెప్పాలంటే రాజద్రోహంరాజద్రోహానికి కుట్ర అనే అర్థం వస్తుంది. డిసెంబర్ 27 సోమవారం వినాయక్‌సేన్ భార్య ఇలీనా ఆయనను కలుసుకున్నారు. జైలుగదిలో నుంచి బైటకు వచ్చిన ఆయన ప్రాంగణం నుంచి బైటకు రాలేక పోయారు. అక్కడ వివిధ పత్రికల్లో వచ్చిన వార్తల క్లిప్పింగ్‌లను ఆయన చదివారు. నేను ఆయనతో . జైలర్ గదిలోనే వారిని కలిశాను అని ఆమె చెప్పారు. 2007లో సేన్ ఖైదుకు తర్వాత ఈ శిక్షకు దారి తీసిన పరిణామాల వెనుక ముగ్గురు వ్యక్తులు కారకులుగా వున్నారు. సేన్‌తో బాటు కోల్‌కత్తా సమీపంలో బీడి కార్మాగారం నిర్వహిస్తూ బీడి ఆకులకోసం తరుచుగా ఛత్తీస్‌గడ్ వచ్చే పీయూష్‌గుహ మావోయిస్ట్ సిద్ధాంత కర్తగా అనుమానిస్తున్న నారాయణ్ సన్యాల్. నక్సలైట్ లేఖలు సంచికలను సన్యాల్ గుప్తాలకు అందజేసే మెసెంజర్‌గా సేన్ వ్యవహరించినట్టు పోలీసులు చెబుతున్నారు. ఇంతకూ ఆయనకు బలి పశువును చేశారా అంటే... సల్వాజుడుం పట్ల సిద్ధంచేసిన నివేదిక కూడా చర్యకు కారణం అయివుండచ్చు. సాక్ష్యాధారాల పరిశీలన గురించి వాళ్ళు పట్టించుకోరు. సేన్‌కు శిక్షవేయడమే ధ్యేయంగా భావించారు. అదే చేశారు. ఆయనపట ఇంతటి ప్రతికారవాంఛ కలిగి వుండటం దిగ్భ్రాతి కలిగించిన విషయమని ఇలీనాతో బాటు ప్రజలూ అనుకున్నారు.

1981లో ఛత్తీస్ గడ్‌ను తన భూభాగంగా చేసుకున్న సేన్ ఆది వాసీల ఆరోగ్య సంరక్షణకు శంకర్‌గుహ నియోగితో కలసి పనిచేశారు. ఎప్పుడూ ముఖంమీద చిరునవ్వుతో కనిపించేసేన్ శుక్రవారం నాటి తీర్పుతో తుడిచిపెట్టుకుపోయింది. 27వ తేదీన సేలీనా వారిప్పుడు మౌనంగా కూడా వున్నారని మరో వార్త చెప్పారు. "తనకు పడిన శిక్షకు వ్యతిరేకంగా దేశంలోనూ ప్రపంచం మూలలా నిరసనలు పెరుగుతూండటం పట్ల ఆయన చాలా సంతోషపడ్డారు." అని చెప్పారు.

"వార్డులో నేను పాఠాలు బోధిస్తాను. వాటితోబాటు న్యాయపరమైన చర్యలూ తీసుకుంటాను" అని దృఢ నిశ్చయంతో చెబుతున్నారు. ఇప్పటికే ఆమె కేన్సర్ వ్యాధిపై పోరులో జయించారు. అంతకన్నా కఠినమైన "భర్తవిముక్తి" కోసం పోరు ప్రారంభించారు. మహిళలం మనమంతా ఆమె వెన్నంటి చేయూత నిస్తూ సాగుదాం. న్యాయానిదే ఎప్పటికైనా గెలుపు. ఒక మహిళకు అన్యాయం జరిగితే మిగిలిన మహిళలు కూడా ఉద్యమించాలి. ◆

---

# ఎకరాకు 10,000రూ॥ నష్టపరిహారం ఇవ్వటం ప్రభుత్వానికి భారమా?

**- ఎస్.పి. శంకర్‌రెడ్డి**

అకాల వర్షాలతో తుఫానులతో మనం ఎలా నష్టపోయామో అందరికీ తెలుసు. కోసిన వరి పైరు చాలా ప్రాంతాలలో తడిసి మొలకెత్తి కుళ్ళి పోయింది. కొన్ని చోట్ల కొట్టుకు పోయింది. పెట్టుబడి పూర్తిగా నష్టపోయాం. తర్వాత పంట ఎలా వెయ్యాలో అన్న ఆవేదన మరియు ఈ సంవత్సరం కుటుంబం ఎలా గడపాలో పాలుపోని అయోమయ స్థితిలో ఉన్నాం. మన పిల్లలు చదువులు ఆగిపోతాయన్న భయం? అప్పులు ఎలా తీర్చాలో అన్న ఆందోళన. కరువు కాలంలో నెర్రకొట్టిన నేల ఆకాశాన్ని చూస్తున్నట్లుగా, ప్రభుత్వం ఏమన్నా చేస్తుందేమోనని ఆశగా చూస్తున్నాం.

అసలు ప్రభుత్వం ఎందుకు నష్టపరిహారం ఇవ్వాలి? మనం కష్టాల్లో ఉన్నామని దయతలచా(లేక) నష్టపరిహారం ఇవ్వటం ప్రభుత్వ కనీస బాధ్యతనా?

1. మన ధాన్యానికి కనీస మద్దతు ధర (ఎమ్.ఎస్.పి)ను లెక్కించేటప్పుడు ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే పంట నష్టాన్ని పరిగణలోకి తీసుకోవటం లేదు. గడచిన 10 సం॥లలో కనీసం 5 నుండి 6 సార్లు అకాల వర్షాలు, తుఫానుల వలన మరియు

రెండు సార్లు ప్రకృతి వలన పాక్షికంగా గాని, పూర్తిగా గాని నష్టపోయాం.

ధాన్యం పండించటంలో ఉండే ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టాన్ని "రిస్క్‌శాతాన్ని" ఎందుకు పరిగణలోకి తీసుకోవటం లేదు?

2. రైతులకు ఒక వేళ ధాన్యం రేటు పెరిగితే, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వెనువెంటనే మార్కెట్‌లో బియ్యం ధర పెరిగిందనే కుంటి సాకుతో బియ్యం ఎగుమతిని అంతర్ రాష్ట్రాల, అంతర్ జిల్లాల రవాణాను నిషేదించి రేటు పడిపోయే విధంగా చేస్తున్నాయి.

   అంటే మనకు ఎప్పుడూ లాభం / మిగులు అనేది రాకుండా ప్రభుత్వాలు నిర్ధేశిస్తున్నాయి. (రైతులు కుదేలయ్యి పోవాలే కానీ, బాగుపడితే ఎట్లా!?)

3. మార్కెట్‌లో రేటు పడిపోయినప్పుడు, ప్రభుత్వం గిడ్డంగులు ఖాళీగా లేవన్న సాకుతో కొనుగోలు చెయ్యరు. మరియు అలాగని ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయరు. ప్రభుత్వం కనీసమద్ధతు ధరను లెక్కించేటప్పుడు రైతుకు అయ్యే ఖర్చులను మాత్రమే లెక్కకడుతూ, ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టాన్ని మరియు నికర లాభాన్ని పరిగణనలోకి తీసుకోకుండా – మనం పంట పూర్తిగా నష్టపోయి కష్టాలలో ఉన్నప్పుడు ఎంగిలి మెతుకులు విదిలించి, చేతులు దులుపుకొని పోతున్నారు.

ప్రకృతి సహకరించినప్పుడు ఒక్క రూపాయి కూడా లాభం రాకుండా చేస్తూ, వైపరీత్యాలు వచ్చినప్పుడు ఎంగిలి మెతుకులు విదిలించటం న్యాయమా?

నలుగురు ముఖ్యమంత్రులతో కూడిన కేంద్ర వ్యవసాయ వర్కింగ్ గ్రూపు చెప్పినట్లు ఎకరాకు రూ॥10,000/– నష్టపరిహారం ఇవ్వటం చాలా కష్టమైన పనా? నిజంగా ప్రభుత్వంపై పెనుభారం పడుతుందా?

ఈ సంవత్సరం జూలై నుండి పడిన అకాల వర్షాల వలన నష్టపోయిన మొత్తం పంట విస్తీర్ణం 12.83 లక్షల ఎకరాలు. ఎకరాకు 10,000రూ॥ చొప్పున నష్టపరిహారం ఇస్తే ప్రభుత్వానికి అయ్యే ఖర్చు రూ॥1283 కోట్లు మాత్రమే ఇది ఒక్కసారి మాత్రమే అయ్యే ఖర్చు.

**రైతులు V/S ప్రభుత్వ ఉద్యోగస్థులు :**

ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్థులు చేస్తున్న డిమాండులవలన ప్రభుత్వానికి కలిగే భారం 2,400 కోట్లు. ఇది ప్రతి సంవత్సరం ఖర్చు పెట్టాలి. (అంటే రాబోయే 20 సం॥లలో సుమారు 48,000 కోట్ల రూ॥ భారం)

ప్రతి సంవత్సరం 2,400 కోట్లు రూ॥ ఖర్చు అయ్యే ఉద్యోగస్థుల డిమాండుల మీద సానుకూలంగా స్పందించి, రాష్ట్ర ప్రభుత్వం కాబినేట్ కమిటీని వేసి, డిమాండులను తీర్చటానికి సానుకూలత చూపిస్తుంది. ఏ ప్రభుత్వ ఉద్యోగి అప్పుల పాలయ్యి, తినటానికి తిండిలేక ఆత్మహత్య చేసుకోలేదు కానీ ఈ రాష్ట్రంలో అప్పుల భారంతో కుటుంబాలను పోషించలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

భారత రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే. ఒక వేళ పక్షవాతం చూపించాల్సి వస్తే – ఆర్థికంగానో, సామాజికంగానో బలహీనులయినటువంటి వర్గాలవైపు పక్షపాతం చూపించాలి (అందుకే భారత రాజ్యాంగం దళితులకు రిజర్వేషన్ కల్పించింది.) ఈ న్యాయ సూత్రానికి, ధర్మ సూత్రానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఆర్థికంగా బలహీనులయినటువంటి రైతులకు నష్టపరిహారం ఇవ్వటంంలో ఎంగిలిమెతుకులు విదిలిస్తూ, గుండెదిటవు చేసుకోమని చెప్తుంది. ఆర్థికంగా, సామాజికంగా, వ్యవస్థాగతంగా బలవంతులైన ప్రభుత్వ ఉద్యోగస్థుల డిమాండులపై అఘమేఘాలపై స్పందించి, డిమాండులను తీర్చబోతున్నారు.

మన ముఖ్య మంత్రిగార్కి పంటనష్టపోయిన రైతులకు రూ॥1283 కోట్లు ఒకే ఒక్కసారి నష్టపరిహారంగా ఇవ్వటం ఆర్థిక భారంగాను ప్రతీ సంవత్సరం రూ॥2,400 కోట్లు ఉద్యోగస్థలకు ఇవ్వటం చాలా తేలికగాను కనిపిస్తుంది.

ఈ ప్రభుత్వం బలవంతుల పక్షాన నిలబడి, బలహీనులను ఆత్మహత్యలు చేసుకొనే విధంగా చేస్తుంది.

**చిన్న సన్నకారు రైతులు V/S పెద్దరైతులు :**

ప్రభుత్వ ఉద్దేశ్యంలో 5 ఎకరాలకు పైన పొలం ఉన్న వాళ్ళు పెద్ద రైతు. నిజానికి 6 ఎకరాల నుండి వచ్చే ఆదాయం రాష్ట్ర ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగి ఆదాయం కన్నా చాలా తక్కువ. (అధమస్థంగా ప్రభుత్వ ఉద్యోగి ఆదాయం రూ॥1,20,000 వర్షం పడినా/ తుఫాను వచ్చినా, భూకంపం వచ్చినా, సమ్మెలు చేసినా జీతం వస్తూనే ఉంటుంది. ( ఏ విధమైన రిస్క్ లేకుండా) కానీ రైతు అలాకాదు.

"ప్రకృతి, మార్కెట్ మరియు ప్రభుత్వం అనే మూడు బలీయమైన శక్తులు ముప్పేట దాడిచేస్తూ బలహీనుడయిన రైతు వెన్ను విరుసున్నాయి. రైతులు అందరూ రోట్లో ఉన్న చిన్న గింజ, పెద్దగింజల్లాంటి వాళ్ళు, రోకటిపోటు అందరికీ ఒక్కటే.

ప్రభుత్వం కరువు భత్యం ఇచ్చేటప్పుడు రూ॥10,000 నెలజీతం వచ్చే 4వ తరగతి ఉద్యోగికి రూ॥70,000 నెల జీతం వచ్చే అధికారులకు నెలకి రూ॥ 40,000 పెన్షన్ తీసుకుంట్ను రిటైర్డ్ ఉద్యోగస్థులకి సమాన నిష్పతిలో భత్యం ఇస్తున్నారు. (నిజానికి కరువు వచ్చేది రైతులకి, కూలీలకి, కానీ ప్రభుత్వం కరువు భత్యం ఇచ్చేది ఉద్యోగస్థులకు) ప్రభుత్వం ఆర్థిక బలవంతులైనటువంటి ఉద్యోగస్థులకు కరువు భత్యం ఇచ్చేటప్పుడు లేనటువంటి చిన్న, పెద్ద లేకా, ప్రకృతి వైపరీత్యాం వలన పంటపూర్తిగా నష్టపోయిన రైతుల విషయంలో ఎందుకు చూపిస్తుంది? ఇది అన్యాయం కాదా? అక్రమం కాదా? ఆధర్మంకాదా?

సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటైన పరిస్థితిని పరిశీలించి – ప్రభుత్వ ఉద్యోగులకు 16% జీతం పెంపును ప్రతిపాదించింది. కానీ ఉద్యోగ సంఘాల నాయకులు, ముఖ్యమంత్రి గదిలో కూర్చొని, 3గం॥లు చర్చలు జరిపి భట్టిప్రోలు పెంచాయతిలాగా 39% జీతం పెంచారు.

నలుగురు ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రి, సెక్రటరీలు అందరూ క్షుణ్ణంగా రైతు ఆర్థిక పరిస్థితిని, ప్రభుత్వ విధానాలను పరిశీలించి ప్రకృతి వైపరీత్యాలలో పంటపూరిగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ॥10,000 నష్టపరిహారం ఇవ్వాలని ప్రతిపాదించింది. కానీ మన ముఖ్యమంత్రి గారు రూ॥2,400 మించి ఒక్క రూపాయి కూడా ఇవ్వమని, అది డిసెంబరు నెలలో పడిన 4 రోజుల భారీ వర్షాల వలన నష్టపోయిన రైతులకి మాత్రమే ఇస్తామని అసంబద్ధంగా, అన్యాయంగా మాట్లాడుతున్నారు.

ఉద్యోగస్థులకైతే కమిటీలు ప్రతిపాదించిన దాని కన్నా రెట్టింపు జీతాలు, పంటనష్టపోయిన రైతులకైతే పావలావంతు (2,400) పరిహారమా?

రైతులారా ఈ అన్యాయాన్ని ప్రశ్నించండి? ఈ ప్రభుత్వం మన ఓట్లతో కాకుండా ఉద్యోగస్థుల ఓట్లతో గెలిచిందా? మనవి ఓట్లే కాదా? మీ ప్రజా ప్రతినిధులను నిలదీయండి. ఎకరాకు 10,000 రూ॥ నష్టపరిహారం ఇవ్వటం పూర్తిగా న్యాయబద్ధం, ధర్మబద్ధం మరియు ప్రభుత్వానికి ఏవిధమైన భారం కాదు. ◆

# లోక్‌సత్తా దండు గదిలిందో...

**రచన : పి.వి.రావు, సర్వజన సత్తా**

**ప॥ లోక్‌సత్తా దండు గదిలిందో అవినీతి పరులా**
**గుండెలల్లో జల్లు బుట్టిందో అవినీతి పరులా ॥లోక్॥**

చ రాజ్యాంగములోన ఉన్నా రాజనీతిని అమ్ముకొనెడీ
లంచగొండుల గుండెలల్లో బాంబులయ్యీ పేలుతున్నా
కత్తి గన్నూ లేకున్నా కలము పోటును నమ్ముకోనీ
మాటలే తూటాలు జేసీ యుద్ధమునకూ సిద్ధమైనా
జేపీ గారీ గుండెబలమూకో అవినీతిపరులూ
గుండెలదిరీ గుటుకుమంటుండ్రో అవినీతిపరులూ ॥లోక్॥

చ భారతతీయులకందరికీ బ్రహ్మ అస్త్రంబైనట్టీ
సమాచారా హక్కు చట్టము సాధించీ చేతికిచ్చిన
నేర చరితుల చిట్టలన్నీ బట్టబయలూ చేసినట్టీ
పిట్టలాంటీ బక్కమనిషీ ఒక్కడేమీ జేస్తడంటే
అవినీతి బిల్లు బెట్టిండో ఆ బక్క మనిషీ
అలుపులేనీ పోరుజేస్తుండో ఆ బక్కమనిషీ ◆ ॥లోక్॥

చ చెమట చుక్కతో నేలతడిపీ దుక్కిదున్నీ పంట దీస్తే
దొక్కనిండని బక్క రైతూ ఎక్కిఎక్కీ ఏడుస్తుంటే
అతివృష్టీ అనావృష్టీ కల్తి ఎరువూ కల్తి విత్తనము
తెగులు వచ్చిన పంటజూసీ దిగులు చెందిన రైతు బిడ్డకు
వెన్ను దట్టీ వెంట నిలిచిందో మన లోక్‌సత్తా
గిట్టుబాటు (రేటు)కు పోరు జేస్తుందో మన లోక్‌సత్తా ॥లోక్॥

చ నాణ్యమైనా ఉచిత విద్యా, ఉచిత వైద్యం, ఉపాదీయే
దేశ ప్రగతికి ముఖ్యమంటూ బల్లగుద్దీ చాటి చెప్పిన
జిల్ల జిల్లాకు గ్రామములకూ ప్రభుత్వాలేర్పాటుజేసీ
ప్రజల నిధులూ ప్రజలకిచ్చీ ప్రజల చేతికి పాలనిచ్చీ
ఏలుకొమ్మని చాటి చెబుతుందో మన లోక్‌సత్తా
ఎదురు చూడక బతకమంటుందో మన లోక్‌సత్తా ॥లోక్॥

చ గాంధీజీ మార్గమందూ అంబేద్కర్ ఆశయాలను
అమలు చేయుట ధ్యేయమంటూ సర్వజనులకు స్థానమిచ్చీ
ప్రజాస్వామ్యా పద్ధతీలో సామాజిక న్యాయమునకై
పుట్టుకతో వివక్ష లేని విలువలతో జీవించమంటూ
సర్వజనులా సత్తా బెట్టిందో మన లోక్‌సత్తా
సర్వజనులను కదిలి రమ్మందో మన లోక్‌సత్తా ॥లోక్॥

చ పేదవాడీ ఓటు దోచే ఉన్న వాడీ నోటుచించీ
మంచి పాలనకై నిలిచిన నీతివంతులకోటు వేసీ
చెడ్డవారీ చెడుపుకంటే మంచివారీ మౌనమెంతో
ప్రమాదంబని తెలియజెప్పీ కదిలిరండనీ పిలుపునిచ్చీ
పాలకులనూ మార్చుకోమ్మందో మన లోక్‌సత్తా
పరిపాలన చేసుకొమ్మందో మన లోక్‌సత్తా ॥లోక్॥

**తమకు తెలీని దానిని తెలుసనే విధంగా వ్యవహరించేవారు తమకు తెలిసిన విషయాల్ని గురించి కూడా తెలీనివారుగా పరిగణించబడతారు.**

– తిరువళ్లువార్

**మీరు నిజాయితీపరులుగా ఉండండి. ఈ ప్రపంచంలోని జనాభా నుండి ఒక దుర్మార్గుడి సంఖ్య తప్పక తగ్గిందన్న భావన మీకు కలుగుతుంది.**

– థామస్ కార్లయిల్

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

## తూర్పుగోదావరి

### మద్యం అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం
### మిర్తిపాడు మహిళల పోరు రాష్ట్రానికే ఆదర్శం : లోక్‌సత్తా అధినేత జేపీ

**మిర్తిపాడు :** వ్యవసాయాన్ని చంపి, మద్యం అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్‌నారాయణ్ విమర్శించారు. మిర్తిపాడులో మద్యం షాపులు తొలగించాలంటూ 121 రోజుల నుంచి మహిళలు చేస్తున్న ఉద్యమం రాష్ట్రానికే ఆదర్శమన్నారు. లక్షలాది మంది మహిళలు మద్యం వల్ల వేధింపులకు గురవుతున్నా నాయకులు, అధికారులు ఎందుకు స్పందించటం లేదని జేపీ ప్రశ్నించారు. గ్రామంలో చేస్తున్న మహిళా ఉద్యమానికి ఆసరాగా ఉండటానికే తాను ఇక్కడకువచ్చానని, మహిళల పోరాటానికి అంతిమ విజయం లభించే వరకూ తమ పార్టీ మద్దతు ఉంటుందని జేపీ భరోసా ఇచ్చారు. అంతకు ముందు మహిళల ఆందోళన శిబిరాన్ని జేపీ సందర్శించి, దీక్ష చేస్తున్న మహిళలను అభినందించారు.

### మిల్లర్లకు మేలు చేసేందుకే జాప్యం

**రాజమండ్రి:** మిల్లర్ల ప్రయోజనం కోసమే ప్రభుత్వ ఉప్పుడు బియ్యం ఎగుమతులకు అనుమతి ఇవ్వడంలో జాప్యం చేస్తోంది. రైతులు తమ ధాన్యాన్ని ఏదొక ధరకు మిల్లర్లకు తెగనమ్ముకున్నాక వారికి ప్రయోజనం చేకూర్చేలా ఎగుమతులకు అనుమతి ఇస్తుందని జేపీ ఎద్దేవా చేశారు. లోక్‌సత్తా ప్రధానంగా 5 డిమాండ్లు చేస్తుందని చెబుతూ ఉప్పుడు బియ్యం ఎగుమతులకు అనుమతించడం, ధాన్యానికి రూ॥200 బోనస్ ప్రకటించి కొనుగోలు చేయడం, చెరకు మద్దతు ధరను క్వింటాలుకు రూ॥2300గా ప్రకటించడం, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే నూనె గింజలపై సుంకం విధించడం, చేపల దిగుమతిని నిషేదించడం చేయాలన్నారు. రైతుల అత్మహత్యలు దేనికీ పరిష్కారం కాదని మనోధైర్యంతో ముందుకుసాగాలని కోరారు.

### రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

**కోరుకొండ :** హైదరాబాద్ నుంచి విమానంలో మధురపూడి ఎయిర్‌పోర్టులో దిగి రోడ్డు మార్గాన వెళుతూ కోరుకొండ మండలంలోని పశ్చిమగోనగూడెంలోని ప్రభుత్వధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద 2.40 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేయడంలోనే ప్రభుత్వం రైతులతో వ్యవహరిస్తున్న తీరు అర్థమవుతోందని విమర్శించారు. నాయకులు రాజకీయాల్లో మునిగిపోయారే తప్ప రైతులను ఆదుకొనేందుకు చర్యలు చేపట్టడం లేదు. కౌలు రైతుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉందని, శిస్తులు కట్టలేక, పెట్టుబడులు పెట్టలేక కౌలు రైతులు కొట్టుమిట్టాడుతున్నారు అని అన్నారు. విదేశాలకు ఉప్పుడుబియ్యం ఎగుమతికి ఏర్పాట్లు చేయడం ద్వారా మనరాష్ట్రంలో తడిసిన, రంగుమారిన ధాన్యానికి గిరాకీ పెంచవచ్చని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ బాలాజీ, ఆలూరి విజయలక్ష్మి, ఆర్.చంద్రకళ, జిల్లా నాయకులు పసల భీమన్న, డాక్టర్ జి.వి.రామారావు, నాగులపాటి బాలాజీ, కె.కృష్ణమోహన్, నెక్కంటి శ్రీనివాస్, ఎన్.కుటుంబరావు, ఎన్.సుబ్రహ్మణ్యం, శ్రీరంగన్న, దాడి రాజ్‌కుమార్, బండి వీరబ్రహ్మం, కోయిడాల వీరాస్వామి, నాని పాల్గొన్నారు.

### పాలకుల నిర్వాకంతోనే తిప్పలు

**రాజమండ్రి :** పాకిస్తాన్ నుండి ఉల్లి దిగుమతి చేసుకుంటున్న మనం వారు కోరినట్టు పత్తి ఎగుమతి చేస్తే పత్తి రైతులు ఆత్మహత్య చేసుకోవాల్సిన దుస్థితి రాదన్నారు. కృష్ణాట్రిబ్యునల్ తీర్పు వెలువడిన 90 రోజుల లోపు అభ్యంతరాలు చెప్పాల్సి ఉన్నందున ఆ దిశగా నివేదిక రూపొందిస్తున్నామన్నారు.

### జై జవాన్... జై కిసాన్... నినాదానికి తూట్లు : జేపీ

**రాజమండ్రి:** "మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జై జవాన్.. జైకిసాన్ నినాదానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడిచాయి. కార్గిల్ వీరుల కోసం నిర్మించిన ఆదర్శ్ సొసైటిలో కుంభకోణం, రైతుల పరిస్థితులే వీటికి ఉదాహరణ. రాష్ట్రంలో రైతుల కడగండ్లు లేని ప్రాంతాలు లేవు. మెదక్ జిల్లాలో, తాజాగా తూర్పుగోదావరి జిల్లాలో రైతులు తమ పంటలను దగ్ధం చేసిన సంఘటనలు ఉన్నాయి. మన శత్రుదేశమైన పాకిస్థాన్‌కి మన రైతులపై వున్న ప్రేమ కూడా మన పాలకులకు లేదు"ని జేపీ ఎద్దేవా చేశారు. సంతానం నివేదిక ఆధారంగా అవినీతి నిర్మూలనకు అప్పటి ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని వీటిలో సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ ఏర్పాటు, అవినీతి నిరోధక చట్టానికి సవరణ, ప్రభుత్వశాఖలు, సంస్థలలో విజిలెన్స్ విభాగం ఏర్పాటు వంటి సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. శాస్త్రి నిజాయితీకి వారసులుగా పాలకులు మెలగాలని కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు వలన మన రాష్ట్రం రెండువిధాలుగా నష్టపోయిందని లేని జలాలు ఉన్నట్లుగా చూపించారని, దీనివల్ల ఎగువ వున్న వారికి లాభమేమని, దిగువన వున్న మనరాష్ట్రానికి నష్టమన్నారు. మిగులు జలాలు కూడా మూడు రాష్ట్రాలకు పంపిణీ చేయడంతో నష్టం వాటిల్లిందని, ట్రిబ్యునల్‌లో

సరైన వాదన వినిపించకపోవడమే దీనికి కారణమని, గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్ళించడం ద్వారా ట్రిబ్యునల్ తీర్పుతో నష్టపోయిన జలాలను వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాజమండ్రి నగర అధ్యక్షులు డాక్టర్ వి.వి.రామారావు, కరణం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# నల్గొండ




## సమస్యల పరిష్కారం కోసం ధర్నా

**కోదాడ :** మండలంలోని ఎర్రవరం, గణపవరం, భీక్యాతండ, కాపుగల్లు, తగ్రాయి గ్రామాలలో ప్రభుత్వం చేపట్టిన రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**లోక్‌సత్తా ఆధ్వర్యంలో...**

రచ్చబండలో ప్రజాసమస్యలపై సరైన వివరణ ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సాతులూరి గోవిందరావు అధికారులను నిలదీశారు. తడిసి, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయటానికి అనుమతులు ఇవ్వాలని, ఉపాధిహామీ పథకాన్ని రైతులకు అనుసంధానం చేయాలని కోరారు. తోగ్రాయి, కాపుగల్లు, భీక్యాతండాలలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు విశ్వేశ్వరరావు, రాజు, సత్తిపండు పాల్గొన్నారు.

# నెల్లూరు

## పేదల భూములకు హద్దులు, పాస్‌పుస్తకాల కోసం ధర్నా

**గూడూరు :** పేదల భూములకు హద్దులు, పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని జనవరి10న ఆర్డీఓ కార్యాలయం ముందు లోక్‌సత్తా ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కొమ్మలపూడి, మిట్టాత్మకూరు గ్రామస్తులు మాట్లాడుతూ మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామ సర్వేనెంబర్ 3593 లోని 79.60 ఎకరాల భూమిని 1981 దళితులకు పంచడం జరిగిందని, భూములకు ఇప్పటి వరకు హద్దులు చూపకుండా రద్దు పరచి కొంత మంది గ్రామ అగ్రవాల రైతులకు రియల్టర్ సహాయంతో



బినామీ పేర్లతో పట్టాలు సృష్టించి భూములను సొంతం చేసుకున్నారని, ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని గ్రామస్తులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు నర్రా శ్రీధర్, గూడూరు నియోజక వర్గ ఇంచార్జీ కె.వి. కృష్ణయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

**మనుబోలు :** కొమ్మలపూడిలోని భూముల వివాదంపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ రామ్మూర్తి తెలిపారు. మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో దళితుల భూముల వివాదాన్ని పరిష్కరించేందుకు జనవరి 13న ఆయన గ్రామసభ నిర్వహించారు.




## రైతు సమస్యల పరిష్కారం కోసం ధర్నా

**గూడూరు :** రైతు సమస్యలను పరిష్కరించాలంటూ లోక్‌సత్తా ఆధ్వర్యంలో జనవరి 10న గ్రామ సేవకుల భవనం ముందు ధర్నా చేశారు. ధర్నాకు తెలుగు దేశం, పీఆర్పీ, సీపీఐ, బీఎస్పీ, రజక, మాల మహానాడు, బీసి సంఘాల నేతలు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా కన్వీనర్ శ్రీధర్, కె.వి.కృష్ణయ్య, షబ్బీర్, కృష్ణారెడ్డి, ఉల్లిపాయల శంకరయ్య, ఎల్.వి.సుబ్బయ్య, అంకయ్య, మనపాటి రవీంద్రబాబు, మునిగిరీష్, నెల్లూరు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ద్వేషాన్ని దూరం చేయగలిగేది ప్రేమ ఒక్కటే. ద్వేషం కాదు**
– బుద్ధుడు

# కృష్ణా



### పంచాయితీలో వార్డు మెంబరు ఎన్నికల్లో జయకేతనం

**పెడన :** మాట్ల గ్రామ పంచాయితీలో 5వ వార్డు మెంబరు చనిపోవడం ద్వారా ఆ వార్డుకి ఎన్నికలు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ లోక్‌సత్తా పార్టీ అభ్యర్థులు మధ్య పోటీ జరిగింది. ఈ ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ అభ్యర్థి తిరుమాని శేషమ్మ డబ్బు మద్యం పంచకుండా జయకేతనం ఎగురవేసింది.

# గుంటూరు



### లోక్‌సత్తా భావజాలంపై పోటీ పరీక్ష జయప్రదం

**నరసరావుపేట :** ప్రసిద్ధ వైద్యులు, నర్సరావుపేట లోక్‌సత్తా శాఖ, పార్టీల వ్యవస్థాపకులు అయిన డా॥ ముక్కామల ఉమామహేశ్వరరావు సతీమణి కీ॥శే॥జయలక్ష్మీ ప్రథమ వర్ధంతి సందర్భంగా జనవరి 19న 4 స్థానిక కళాశాలల విద్యార్థులలో పోటీ పరిక్ష జరిగింది. లోక్‌సత్తా భావజాలం, స.హ.చట్టం, మద్య నియంత్రణ తదితర 6 అంశాలపై అవగాహనా పత్రాలను 600 మంది విద్యార్థులకు పంచగా, 180 మంది పరీక్ష రాశారు. 15 మంది బహుమతులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జనవరి 20న డా॥ముక్కామల నివాసంలో జయలక్ష్మీ వర్ధంతి సభ జరిగింది. లోక్‌సత్తా ఉద్యమసంస్థ అధ్యక్షులు మాకినేని హరిబాబు అధ్యక్షత వహించగా ప్రముఖ వైద్యులు డా॥కారసాని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులందజేశారు. ఇ.ఎం.స్వామి, నాగసరపు నరసింహారావు, హరినాధబాబురెడ్డి, రామాంజనేయరెడ్డి, ఈదరగోపిచంద్, కె.లలిత కుమారి తదితరులు ప్రసంగించారు. దాదాపు 70 మంది కళాశాల విద్యార్థులు ఈ సభకు హాజరయ్యారు. అందరికీ లోక్‌సత్తా ప్రచార సాహిత్యం అందజేయబడింది. విద్యార్థులు పాఠ్యపుస్తక జ్ఞానంతోపాటు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని వక్తలు పిలుపిచ్చారు.

# మెదక్

### రచ్చబండలో ప్రజాసమస్యలపై నిలదీయండి

**జహీరాబాద్ :** రచ్చబండ కార్యక్రమాల్లో ప్రజాసమస్యలపై అధికారులను నిలదీయాలని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్ రావు అన్నారు. జనవరి30న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నియోజకవర్గం ఇంచార్జీ ఐ.ప్రతాప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ఎం.గోవర్ధన్, పట్టణ పార్టీ అధ్యక్షులు అబ్దుల్‌హై తదితరులకు సభ్యత్వం ఇచ్చారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతూ పారిపాలనలో సంస్కరణలు తీసుకువస్తూ పారదర్శక పాలన కేవలం లోక్‌సత్తా పార్టీకే సాధ్యమన్నారు. యువత పార్టీ కార్యక్రమాల పట్ల ఆకర్షితులౌతున్నారు, ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర మహిళా సత్తా నాయకులు గీతామూర్తి మాట్లాడుతూ మద్యం వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభిస్తామని, మహిళల్లో చైతన్యం తీసుకుని వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు అబ్దుల్‌హై, ఎన్నిక అధికారి జి.విద్యాసాగర్, నాయకులు షబ్బీర్, అసిఫ్‌అలీ, రాంశెట్టి పాల్గొన్నారు.

### గ్రామస్థాయినుంచి పార్టీ నిర్మాణం చేపట్టండి

**సంగారెడ్డి రూరల్ :** గ్రామస్థాయినుంచి పార్టీ నిర్మాణం చేయాలని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు సూచించారు. జనవరి30న పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండారు రామ్మోహన్ రావు మాట్లాడుతూ, మున్సిపాలిటీలలో నేటినుంచే సభ్యత్వాలను ప్రారంభించాలన్నారు. రాజకీయాలకు ప్రజాస్వామ్యానికి అర్థాలు మారిపోయాయని, జన రాజకీయం ద్వారానే మహాత్మాగాంధీకి అసలైన నివాళి లభిస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతు సమస్యలపై నియోజకవర్గాల వారీగా ఐక్య యాత్రలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సుధీర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, యువసత్తా జిల్లా కన్వీనర్ శ్రీధర్, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, సాయికుమార్, నవాజ్, ఇనాయత్, అబూఖాన్ తదితరులు పాల్గొన్నారు.◆

# లోక్‌సత్తా పార్టీకి తోడ్పాటునివ్వండి

శ్రీ ____________________

____________________

ప్రియమైన మిత్రులకు

అక్టోబరు 2, 2006 న లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది. భారత ఎన్నికల కమీషన్ దగ్గర అధికారయుతంగా రిజిష్టరు అయింది. లోక్‌సత్తా పార్టీ మనసా, వాచా, కర్మణా ఒక జాతీయ పార్టీగా వ్యవహరిస్తుంది. పార్టీ ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలు ముఖ్యం అని భావిస్తుంది. కుల, మత, ప్రాంతీయ, భాషావిభేదాలకు అతీతంగా మనం అందరం భారతీయులం అన్న భావనతో వ్యవహరిస్తుంది.

ప్రస్తుత రాజకీయం పతనావస్థలో వుంది. క్షీణ సంస్కృతిలో వుంది. సమాజహితం కోసం చేసే ఒక పవిత్ర కార్యకలాపంగా వుండాల్సిన రాజకీయం కేవలం అధికార క్రీడగా మారింది. అందుకోసం డబ్బుసంచుల మీద, నేర చరితుల మీద, అవినీతి మీద ఆధారపడి మనుగడ సాగిస్తున్నది. స్వాతంత్ర్య ఫలాలు, ప్రజాస్వామ్య ఫలాలు ప్రజలకు అందకుండా పోతున్నాయి. ఈ క్షీణ రాజకీయ సంస్కృతిని రూపుమాపాలి. ఇదొక చారిత్రక అవసరం. ఈ చారిత్రక అవసరాన్ని నెరవేర్చడానికి ప్రస్తుత రాజకీయాన్ని మార్చడం లక్ష్యంగా ఒక కొత్త రాజకీయాన్ని, కొత్త సంస్కృతిని సాధించే కొత్త తరహా పార్టీగా లోక్‌సత్తా పార్టీ రూపుదిద్దుకుంది.

చెడ్డవారి దుర్మార్గం కంటే మంచి వారి మౌనం చేటు అన్నది సూక్తి. మంచి రాజకీయం కోరే వారంతా మౌనం వీడాలి. గళం విప్పాలి. ఒక వేదికలో సంఘటితం కావాలి. లోక్‌సత్తా పార్టీ అలాంటి వేదికగా వ్యవహరిస్తుంది. ఈ వేదికలో మీరు, మీ మిత్ర బృందం ప్రత్యక్షంగా, పరోక్షంగా పాలుపంచుకోవలసిందిగా కోరుతున్నాం.

ప్రజాస్వామ్యానికి రాజకీయ పక్షాలు అవసరం. సమాజహితం కోసం, రాజకీయం నిర్వహించడానికి పార్టీలకు నిధులు అవసరం. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇస్తే పూర్తి పన్ను రాయితీ కల్పిస్తూ చట్టం కూడా వచ్చింది. ప్రస్తుతం రాజకీయ పార్టీలు ఓట్ల కొనుగోళ్ల కోసం, మద్యం పంపిణీ కోసం, ఇతర ప్రలోభాల కోసం, నేర చరితుల పోషణ కోసం చేసే చట్ట విరుద్ధమైన ఖర్చుల కోసం చట్ట విరుద్ధమైన నిధుల సేకరణ మీద ప్రధానంగా ఆధారపడుతున్నాయి.

లోక్‌సత్తా పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులు ఎట్టి పరిస్థితులలోనూ ఓట్ల కొనుగోళ్లకీ, మద్యం పంపిణీ తదితర ప్రలోభాలకీ వారి స్వంత సొమ్ము కాని, విరాళాల సొమ్ము గాని వినియోగించరు. ఎన్నికల కమీషన్ పెట్టిన పరిమితికి లోబడి చట్టబద్ధంగానే ఖర్చు చేస్తారు.

లోక్‌సత్తా పార్టీ పూర్తిగా చట్టబద్ధంగానే విరాళాలు సేకరిస్తుంది. చట్టబద్ధమైన ఖర్చులకే వినియోగిస్తుంది. మీరు చెక్కు ద్వారా లేదా నగదు రూపంలో రశీదు తీసుకుని విరాళం ఇవ్వండి. ఆ మొత్తానికి మీరు ఆదాయపు పన్ను రాయితీని పూర్తిగా పొందవచ్చును. మీరు ఇచ్చే ప్రతి రూపాయి సమాజహితం కోసం చేసే మంచి రాజకీయానికి వినియోగిస్తాం. అందుచేత ఉదారంగా విరాళం ఇచ్చి లోక్‌సత్తా పార్టీకి తోడ్పాటు ఇవ్వవలసిందిగా కోరుతున్నాం.

అభివందనాలతో...

హైదరాబాద్
24-01-2011

(డా॥ జయప్రకాష్ నారాయణ్)
అధ్యక్షులు లోక్‌సత్తా పార్టీ

**Note:**

1. Lok Satta Party is registered as a political Party under section 29A of 'Representation of the people Act 1951' with Election Commission of India vide proceedings No. 56/152/2006/J.S.III/320 dated 22nd December 2006.
2. As per the provisions of Section 80 GGB of Income Tax Act, any sum contributed by an Indian Company to Lok Satta Party is fully deductable from its total income for the corresponding year, subject to a ceiling of 5% of the net average annual profit of three latest accounting years.
3. As per the provisions of Section 80 GGC of income Tax Act any contribution made by any person to Lok Satta Party is fully deductable form his/her total income for the corresponding year. There is no ceiling on such personal contributions. Tax exemption will apply to any amount.

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12




To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad